


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 1 సంచిక : 71 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ గురువారం 22 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 71 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD THU 22 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## మున్సి'పోల్స్' బరిలో మరో 3 పార్టీలు..!

### పోటీకి సై అంటున్న టీడీపీ, జనసేన, జాగృతి



- కామన్ సింబల్తో పోటీకి కవిత కసరత్తు
- పోటీకి సిద్ధమంటున్న తెలుగుదేశం పార్టీ
- బరిలోకి దిగనున్న జనసేన
- ఒంటరి పోరుకు గిరిగీసుకున్న బీజేపీ టీడీపీ-జనసేన కలిసి పోటీ చేస్తాయా?
- రాష్ట్రంలో మారనున్న రాజకీయ సమీకరణాలు

**హైదరాబాద్:పెన్ పవర్** ఈ సారి మున్సిపల్ ఎన్నికలు రసవత్తరంగా సాగనున్నాయి. చాలా కాలంగా పోటీకి దూరంగా ఉన్న ఏపీ పార్టీలు తెలంగాణలోకి దూసుకొస్తున్నాయి. వీటికి కవిత పెట్టబోయే కొత్త పార్టీ తోడవుతోంది. అప్పటి వరకు పార్టీ గుర్తు ఫైనల్ కాకుంటే ఇక్కడ పెద్దగా ప్రచారం లేని పార్టీల కామన్ సింబల్పై తమ అనుకూలురను రంగంలోకి దించేందుకు మాజీ ఎమ్మెల్సీ కవిత సిద్ధమవుతున్నారు.ఈ మేరకు యువకులు, మహిళలకు అవకాశం కల్పిస్తామని, అవసరమైతే తాను కూడా వచ్చి ప్రచారం చేస్తానని ఆమె ప్రకటించారు. ఇదిలా ఉండగా 2018 ఎన్ని కల తర్వాత తెలంగాణలో పోటీ చేయని తెలుగుదేశం పార్టీ ఈ సారి

- మిగతా2లో



## ఐరోపా సరైన దిశలో వెళ్లడం లేదు

### దావోస్ వేదికగా డొనాల్డ్ ట్రంప్

- ఐరోపాలో వలసలపై నియంత్రణ లేదన్న ట్రంప్
- తన పాలనలో అమెరికా అభివృద్ధి పథంలో సాగుతుందన్న ట్రంప్
- దేశంలో ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసినట్లు వెల్లడి

## రాజకీయ ప్రయోగశాలగా సింగరేణి.. బొగ్గు అక్రమాలపై సీబీఐ దర్యాప్తు జరపాలి



**హైదరాబాద్ పెన్ పవర్:** సింగరేణిని రాజకీయ ప్రయోగశాలగా మార్చారని కేంద్ర మంత్రి కిషన్రెడ్డి ఆరోపిం చారు. గతంలో బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ విధ్వంసం చేస్తున్నాయని ఫైర్ అయ్యారు. నైనీ కోలి విషయంలో కేంద్రం సహకారం అందిస్తోందన్నారు. ఢిల్లీలో కిషన్ రెడ్డి

- మిగతా2లో

# ఫాలోఆప్ సదస్సును తెలంగాణలో నిర్వహించాలి

### దావోస్ సదస్సు వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రతిపాదన

- ప్రపంచ ఆర్థిక సదస్సు ఫాలోఅప్ సదస్సును తెలంగాణలో నిర్వహించాలన్న ముఖ్యమంత్రి
- ప్రతి సంవత్సరం జులైలో హైదరాబాద్లో ఫాలోఅప్ సదస్సు నిర్వహించాలన్న సీఎం
- మద్దతు తెలిపిన ప్రముఖ వ్యాపారవేత్తలు, పాలసీ నిర్ణేతలు



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక కీలక ప్రతిపాదన చేశారు. ప్రపంచ ఆర్థిక సదస్సు ఫాలోఅప్ సదస్సును ప్రతి సంవత్సరం తెలంగాణలో నిర్వహించాలని ఆయన సూచించారు. దావోస్లో జరుగుతున్న సదస్సులో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. ప్రతి సంవత్సరం జులైలో హైదరాబాద్ నగరంలో ఫాలోఅప్ సదస్సు నిర్వహించాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి ప్రతిపాదనకు ప్రముఖ వ్యాపారవేత్తలు, పాలసీ నిర్ణేతలు మద్దతు తెలిపారు.ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో బ్లైజ్ కో ఫౌండర్ సీఈవో దినకర్ మునగాల సమావేశమయ్యారు. హైదరాబాద్ లో బ్లైజ్ ఆర్ అండ్ డీ సెంటర్ విస్తరణకు తెలంగాణ ప్రభుత్వంతో ఆయన ఎంవోయూ కుదుర్చుకున్నారు. దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ లైఫ్ సైన్సెస్ పాలసీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## తెలంగాణకు భారీ పెట్టుబడి..

### రూ.6 వేల కోట్లు ఇన్వెస్ట్ చేసేందుకు ముందుకొచ్చిన న్యూక్లర్ ప్రొడక్ట్స్ కంపెనీ



**హైదరాబాద్ పెన్ పవర్:** క్లీన్ ఎనర్జీ రంగంలో తెలంగాణ మరో ముందడుగు వేసింది. సుమారు 6 వేల కోట్ల రూపాయల పెట్టుబడితో స్మాల్ మాడ్యులర్

- మిగతా2లో

## గుంపు మేస్త్రీ, గుంటనక్క కలిసే ఉన్నారు

- ఫోన్ ట్యాపింగ్ పేరుతో రాజకీయ డ్రామా మొదలుపెట్టారన్న కవిత
- ఒక జిల్లాకు పీవీ నరసింహారావు పేరు పెట్టాలని డిమాండ్
- ట్యాంక్బండ్పై తెలంగాణ మహనీయుల విగ్రహాలు పెట్టాలన్న కవిత

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఫోన్ ట్యాపింగ్ కేసు విషయంలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ పేరుతో రాజకీయ డ్రామా మొదలుపెట్టారని తెలిపారు. గుంపు మేస్త్రీ, గుంటనక్క కలిసే ఉన్నారని... ఫోన్ ట్యాపింగ్ పేరుతో డ్రామా ఆడుతున్నారని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల సమయంలోనే ఎందుకు విచారణ చేపట్టారని ప్రశ్నించారు. ఈ విచారణ తుది దశకు చేరతుందనే నమ్మకం లేదని చెప్పారు. ఈ విచారణ వల్ల తనలాంటి బాధితులకు న్యాయం జరుగుతుందని తాను భావించడం లేదని అన్నారు.బలహీన వర్గాలకు పొలిటికల్ పవర్ వచ్చినపుడే సమాజం బాగుపడుతుందని కవిత చెప్పారు. యువత, మహిళలు ఎక్కడ పోటీచేసినా జాగృతి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. బీసీ వర్గాన్ని మభ్యపెడుతూ, మున్సిపల్ ఎన్నికల్లో వారికి 42 శాతం వాటా కూడా ఇవ్వకుండానే ప్రభుత్వం ఎన్నికలకు వెళుతోందని విమర్శించారు. సికింద్రాబాద్ను జిల్లా చేయాలి అని,

- మిగతా2లో





## రేవంత్తో కిషన్ రెడ్డికి చీకటి ఒప్పందం ఉంది

- ఇది మీ అజ్ఞానమా? లేక సీఎం రేవంత్ తో మీకు, బీజేపీకి ఉన్న చీకటి ఒప్పందమా..?: కిషన్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్
- దొంగే వచ్చి దర్యాప్తు కోరమనడం విడ్డూరంగా ఉందని విమర్శలు
- సీఎం బంధువు కోసమే సింగరేణి టెండర్లలో అక్రమాలు అంటూ ధ్వజం
- సింగరేణిని ప్రైవేటీకరించేందుకే బీజేపీ, కాంగ్రెస్ కుట్ర అని వ్యాఖ్యలు

- మిగతా2లో

## మాపై భారీగా పన్నులేయండి

### 400 మంది సంపన్నుల డిమాండ్



- టైమ్ టు విన్ పేరిట సంతకాలు చేసి బహిరంగ లేఖ విడుదల
- సంపన్నులకు, సామాన్యులకు మధ్య అంతరం పెరుగుతోందని ఆందోళన
- ప్రపంచంలో అసలు సిసలైన ప్రజాస్వామ్య వ్యవస్థలను కోరుకుంటున్నామని వెల్లడి

- మిగతా2లో

## హనుమకొండ అడిషనల్ కలెక్టర్ పై ఏసీబీ కేసు




- సస్పెండైన అదనపు కలెక్టర్ ఇంట్లో సోదాలు.. కోట్లాది రూపాయలు అక్రమ ఆస్తులుగుర్తింపు
- గత నెలలో రూ.60 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకీ చిక్కిన వెంకట్ రెడ్డి
- ఖరీదైన విల్లా, లక్షల విలువ చేసే ఓపెన్ ప్లాట్లు, వ్యవసాయ భూమి గుర్తింపు
- రూ.30 లక్షల నగదు, రూ.44.03 లక్షల బ్యాంకు బ్యాలెన్స్ గుర్తింపు

- మిగతా2లో

## రికార్డు స్థాయిలో రూపాయి పతనం

- డాలర్తో పోలిస్తే రికార్డు కనిష్టానికి పడిపోయిన రూపాయి
- ఒక దశలో 91.74 స్థాయికి చేరిన మారకం విలువ
- బంగారం, వెండి దిగుమతులు పెరగడం ఒక కారణం
- దేశీయ మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడుల తరలింపు ప్రభావం
- అంతర్జాతీయ వాణిజ్య యుద్ధ భయాలు కూడా పతనానికి మరో కారణం

- మిగతా2లో






# వ్యావహారిక భాషా పితామహుడు

తెలుగు వ్యావహారిక బాషకు పితామహుడిగా, అభినవ వాగను శాసనునిగా పేరెన్నిక గన్న సాహితీవేత్త గిడుగు రామమూర్తి పంతులు రామమూర్తి (1863–1940). ఆధునిక విజ్ఞాన వ్యాప్తికి, వచన రచనకు కావ్యభాష పనికి రాదనీ, సామాన్య జనానికి అర్థమయ్యే సమకాలీన "శిష్టవ్యావహారికం"లో ఉండాలనీ ఆనాటి సాంప్రదాయిక పండితులతో హోరాహోరీగా యుద్ధంచేసి ఆధునిక ప్రమాణ భాషను ప్రతిష్టించటానికి మార్గదర్శకుడైన వారు గిడుగు రామమూర్తి. గిడుగు వారి వ్యవహారిక భాషోద్యమం వల్ల ఆధునిక సాహిత్యం కొత్త సొగసులు సంతరించుకుంది. రచనా వైవిధ్యం, వైశిష్ట్యంతో పుష్టి చేకూరింది. విశ్వ విద్యాలయాలలో వాడుకభాష రాజ్య మేలుతోంది. పత్రికలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. అక్షరాస్యత పెరిగింది. తెలుగు అధికార భాషగా, పరిపాలనా భాషగా కీర్తికెక్కింది. దీనికంతటికీ గిడుగు పిడుగే మూలకారకులు. గ్రాంధికభాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకు వచ్చి, నిత్య వ్యవహారం లోని భాషలో ఉన్న అందాన్నీ, వీలునూ తెలియ జెప్పిన మహనీయుడు. ఆంధ్రదేశంలో వ్యావహారిక భాషోద్యమానికి మూల పురుషుడు. బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘసంస్కర్త, హేతువాది. శిష్టజన వ్యవహారిక భాషను గ్రంథరచనకు స్వీకరింప జేయడానికి చిత్తశుద్ధితో కృషిచేసిన అచ్చ తెలుగు చిచ్చర పిడుగు గిడుగు. గిడుగు ఉద్యమంవల్ల ఏ కొద్దిమందికో పరిమితమైన చదువు వ్యావహారిక భాషలో సాగి, అందరికీ అందుబాటు లోకి వచ్చింది. పండితులకే పరిమితమైన సాహిత్య సృష్టి, సృజనాత్మక శక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ వీలైంది. తెలుగు భాష గురించి ఆధునిక పద్ధతిలో ఆలోచించిన తొలి భాషా విజ్ఞాని ఆయన. ఈ వాడుక భాషా వాదాన్ని చేపట్టినందుకు గిడుగువారు పండితులతో యుద్ధం చేయవలసి వచ్చింది. దీన్ని గ్రామ్య వాదమనీ, గిడుగు వారు గ్రామ్యాచార్యులనీ గ్రాంధికవాదులు హేళన చేస్తూ పద్యాలూ, వ్యాసాలు రాశారు. జయంతి రామయ్య పంతులు, కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి, వేదం వెంకటరామ శాస్త్రి, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి మొదలైన వారితో ఢీకొనవలసి వచ్చింది. ఆంధ్రసాహిత్య పరిషత్తు గ్రాంధిక భాషావాదానికి అండగ నిలిచింది. గిడుగువారు 'తెలుగు' పత్రిక ద్వారా గ్రాంధిక వాదాన్ని ఖండిస్తూ వ్యావహారిక వాదాన్ని బల పరిచారు. పండితులే తప్పులు లేకుండా రాయలేని గ్రాంధికం బలవంతాన రుద్దడం ఎందుకంటూ "ఆంధ్ర పండిత బిషక్కుల భాషా భేషజం" అనే పుస్తకం ప్రచురించారు. తెలుగు సాహిత్యంపై పండితుల గుత్తాధి కారాన్ని పోగొట్టారు. ప్రజలలో ఒక్కరు కూడా నిరక్షరాస్యులు కాకూడదని, అందుకు వాడుక భాష సాధనం కానీ... గ్రాంధికమని తమకే రాని, తమకే తెలియని, భాషను పిల్లలు ఉపయోగించాలనీ అందులోనే పుస్తకాలు రాయాలనీ, దానిలోనే పాఠ్య పుస్తకాలుండాలని శాసించడం అవివేకమని ఉద్యమించారు. చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి, తాతా సుబ్బరాయుడు శాస్త్రి వంటి ఉద్దండ పండితులే ఆయన వాదంలోని సబబు గుర్తించారు. బల పరచారు. కుండలాల, శాలువాల పండితుల సాహిత్యాధికారం, అసంబద్ధమైన వ్యాకరణ, ఛందశ్శాస్త్ర దండనాధికారం చెల్లదన్నారు. సాహిత్య ఫ్యూడల్ సంప్రదాయాన్ని ధిక్కరించి, నిరాకరించి, నిర్మూలించి ప్రజాస్వామ్య పద్ధతిని తెలుగు సాహిత్యంలో ప్రతిష్ఠించాడు. తప్పు ఒప్పులు నిర్ణయించే అధికారం ఎవరికీ లేదన్నారు. భాషకైనా, మనిషికైనా మార్పు కూర్పు చేర్పు సహజమని బోధించారు, నచ్చచెప్పారు. వ్యావహారిక భాషోద్యమం తెలుగు భాషలో వచ్చిన చారిత్రాత్మకమైన మార్పుకు ప్రధాన కారణం గిడుగు రామమూర్తి సారధ్యంలో నడిచిన వ్యావహారిక భాష ఉద్యమం లేదా వ్యావహారిక భాషోద్యమం. ఇది 20వ శతాబ్దపు పూర్వార్ధంలో ప్రాచీనమైన గ్రాంథిక భాషకు... వ్యావహారిక లేదా వాడుక భాషకు మధ్య జరిగిన భాషా ఉద్యమం. పూర్వం తెలుగులో పాఠ్యాంశాలు అన్నీ గ్రాంధిక బాషలోనే ఉండేవి. 1907లో ఉత్తర కోస్తా జిల్లాలకు పాఠశాలాల ఇన్స్పెక్టర్‌గా వచ్చిన జె.ఎ.యేట్స్ అనే బ్రిటీష్ అధికారి ప్రజలు వ్యవహరించే భాష, పుస్తకాల భాష మధ్య ఉన్న తేడాలు చూసి ఆవేదన చెందారు. ఆయన అదే విషయాన్ని గిడుగుతో చర్చించారు. ఆ విధంగా గిడుగు జీవిత ఉత్తరార్థంలో ఈ విషయాన్ని గురించి గాఢంగా ఆలోచించి తెలుగు విద్యా విధానంలో అన్యాయం జరుగుతున్నదని గుర్తించారు. గురజాడ, గిడుగులు, శ్రీనివాస అయ్యంగారు, యేట్సు ? ఈ నలుగురి ఆలోచనల వల్ల వ్యావహారిక భాషోద్యమం ఆరంభమైంది. 1919–20ల మధ్య వ్యావహారిక భాషోద్యమ ప్రచారం కొరకు 'తెలుగు' అనే మాసపత్రిక నడిపారు. వ్యవహారిక భాషను ప్రతిఘటించిన ఆంధ్ర సాహిత్య పరిషత్తు సభలో (1925, తణుకులో) నాలుగు గంటలపాటు ప్రసంగించి గ్రంథాల్లోని ప్రయోగాల్ని ఎత్తి చూపి తన వాదానికి అనుకూలంగా సమితిని తీర్మానింప జేసారు "గిడుగు". సాహితీ సమితి, నవ్య సాహిత్య పరిషత్తు మొదలైన సంస్థలు కూడా గిడుగు వాదాన్ని బలపరచాయి. స్కూలు కాలేజీ పుస్తకాల్లో గ్రాంథిక భాషే పాతుకు పోయింది; కొన్నిటిలో వీరేశలింగం ప్రతిపాదించిన సరళ గ్రాంథికం కూడా వచ్చింది. గిడుగు రామమూర్తి ఊరూరా ఉపన్యాసాలిస్తూ గ్రాంథికంలో ఏ రచయితా నిర్దిష్టంగా రాయలేదని నిరూపించారు. 1919లో గిడుగు "తెలుగు" అనే మాస పత్రికను స్థాపించి తన శాస్త్రీయ వ్యాసాలతో, ఉపన్యాస పాఠాలతో అవిశ్రాంతంగా పోరాటం సాగించారు. కాని ఆ పత్రిక ఒక ఏడాది మాత్రమే నడిచింది. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి, తల్లావజు&ఝుల శివశంకరశాస్త్రి, కందుకూరి వీరేశలింగం, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, వజ&ఝుల చిన సీతారామశాస్త్రి మొదలైన కవులు, పండితులు వ్యావహారిక భాషావాదం వైపు మొగ్గు చూపారు. 1919 ఫిబ్రవరి 28న రాజమహేంద్ర వరంలో కందుకూరి వీరేశలింగం అధ్యక్షులుగా, గిడుగు కార్యదర్శిగా "వర్తమానాంధ్ర భాషా ప్రవర్తక సమాజం" స్థాపించారు. 1924లో కాకినాడలోని ఆంధ్ర సాహిత్య పరిషత్తు అధికారికంగా వ్యావహారిక భాషా నిషేధాన్ని ఎత్తివేసింది. 1933లో గిడుగు రామమూర్తి సప్తతి మహోత్సవం ఆయన అభిమానులు, శిష్యులు రాజమహేంద్ర వరంలో బ్రహ్మాండంగా జరిపారు. తెలికచెర్ల వెంకటరత్నం సంపాదకుడుగా ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన 46 పరిశోధక వ్యాసాలతో వ్యాస సంగ్రహం అనే ఉద్గ్రంథాన్ని ఆయనకు సమర్పించారు. 1936 లో నవ్యసాహిత్య పరిషత్తు అనే సంస్థను ఆధునికులు స్థాపించి సృజనాత్మక రచనల్లో శిష్ట వ్యావహారికాన్ని ప్రోత్సహించే "ప్రతిభ" అనే సాహిత్యపత్రికను ప్రచురించారు. 1937లో తాపీ ధర్మారావు సంపాదకులుగా "జనవాణి" అనే పత్రిక కేవలం ఆధునిక ప్రమాణ భాషలోనే వార్తలు, సంపాదకీయాలు రాయటం మొదలు పెట్టింది. వాడుక భాష గ్రామ్యభాష కాదు. సజీవ భాష. తెలుగు భాష మారుతోంది. కాబట్టి కొత్త వ్యాకరణాలు, సవరణలు వెలువడ్డాయి. నన్నయ భాషకి, తిక్కన భాషకి, ప్రబంధ బాషకి, దక్షిణాంధ్ర యుగం నాటి భాషకి చాలా భేదాలున్నాయి. వ్యావహారిక భాషావాదం ప్రాచీన సాహిత్యానికి వ్యతిరేకంగా ఏర్పడలేదు. ప్రాచీన కావ్యాలను, వ్యాకరణాలను గౌరవిస్తూనే వాడుక భాషకి ప్రాచుర్యం కల్పించాలి. వాడుక భాషలో కూడా ఉత్తమ సాహిత్యాన్ని సృష్టించవచ్చును. ఉదాహరణ: గురజాడ అప్పారావు గారి కన్యాశుల్కం. గ్రాంథిక భాష పండితులకే అర్థం కాదు. గొప్ప పండితులు కూడా తప్పులు లేకుండా రాయలేరు. మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్ర, సాంకేతిక రంగాలలో విజ్ఞానం పెంపొందించు కోవాలంటే పాఠ్య గ్రంథాలు వాడుక భాషలోనే ఉండాలి. వాడుక భాష ప్రజల భాష. గ్రాంథిక భాష పండితుల భాష. ఆ రోజుల్లోనే అతనికి దగ్గర అడవుల్లో ఉండే సవరల భాష నేర్చుకొని వాళ్ళకు చదువు చెప్పాలనే కోరిక కలిగి, తెలుగు, సవర భాషలు రెండూ వచ్చిన ఒక సవర వ్యవహర్తను ఇంట్లోనే పెట్టుకొని చాలా ఏళ్ళు సవర భాష నేర్చుకున్నారు. సవర భాషలో పుస్తకాలు రాసి సొంత డబ్బుతో స్కూళ్ళు పెట్టి అధ్యాపకుల జీతాలు చెల్లించి సవరలకు వాళ్ళ భాషలోనే చదువు చెప్పే ఏర్పాట్లు చేశారు. మద్రాసు ప్రభుత్వం ఈ కృషికి మెచ్చి 1913లో "రావ్ బహదూర్" బిరుదు ఇచ్చారు. భాషాశాస్త్రంలో అప్పుడప్పుడే వస్తున్న పుస్తకాలు చదివి వ్యాకరణ నిర్మాణ విధానం నేర్చుకొన్నారు. ముప్పై అయిదేళ్ళ కృషితో 1931లో ఇంగ్లీషులో సవర భాషా వ్యాకరణాన్ని, 1936లో సవర–ఇంగ్లీషు కోశాన్ని నిర్మించారు. 1940 జనవరి 15వ తేదీన ప్రజామిత్ర కార్యాలయంలో పత్రికా సంపాదకులను సంబోధిస్తూ చేసిన తన తుది విన్నపంలో వ్యావహారిక భాషా వ్యాప్తికి చాలా సంతృప్తి పొందారు. కాని, ప్రభుత్వ విద్యాశాఖ, విశ్వ విద్యాలయాలు గ్రాంథికాన్ని వదిలి పెట్టక పోవటానికి బాధపడ్డారు. గిడుగు జన్మదినమైన ఆగస్టు 29 ను 'తెలుగు భాషా దినోత్సవము'గా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము పరిగణిస్తున్నది. తెలుగు వ్యావహారిక బాషకు పితామహుడిగా పరిగణించ బడే, తెలుగు బాషకు ఎనలేని సేవ చేసిన గిడుగు 1940, జనవరి 22న కన్ను మూశారు.

# ఐరోపా సరైన దిశలో వెళ్లడం లేదు

ఐరోపా సరైన దిశలో పయనించడం లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐరోపాలో వలసలపై సరైన నియంత్రణ లేదని అన్నారు. తన పాలనలో అమెరికా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, దేశంలో ద్రవ్యోల్బణాన్ని అదుపులోకి తెచ్చామని ఆయన వెల్లడించారు. ప్రపంచ ఆర్థిక ఇంజిన్‌గా అమెరికా నిలుస్తోందని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. వివిధ దేశాలపై సుంకాల విధించడం ద్వారా తమ వాణిజ్య లోటును గణనీయంగా తగ్గించామని ఆయన తెలిపారు. వెనెజువెలాకు ఇప్పుడు సమర్థవంతమైన కొత్త నాయకత్వం లభించిందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రీన్‌లాండ్‌ను అమెరికా తప్ప మరే ఇతర దేశం కూడా సురక్షితంగా ఉంచలేదని ఆయన స్పష్టం చేశారు. గ్రీన్‌లాండ్ కొనుగోలుపై తక్షణమే చర్చలు జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు. డెన్మార్క్‌పై ట్రంప్ విమర్శలు గుప్పించారు. డెన్మార్క్ కృతజ్ఞత లేని దేశమని ఆయన అభివర్ణించారు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత గ్రీన్‌ల్యాండ్‌ను తిరిగి అప్పగించడం అమెరికా చేసిన పొరపాటని ఆయన అన్నారు. రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో జర్మనీ చేతిలో ఓడిపోయిన డెన్మార్క్, గ్రీన్‌లాండ్‌ను కాపాడుకోలేకపోయిందని ఆయన గుర్తు చేశారు. డెన్మార్క్ మరియు గ్రీన్‌లాండ్ ప్రజల పట్ల తమకు ఎంతో గౌరవం ఉందని ఆయన పేర్కొన్నారు.

# హనుమకొండ అడిషనల్ కలెక్టర్ పై ఏసీబీ కేసు

పాఠశాల అనుమతికి సంబంధించి గత ఏడాది డిసెంబర్‌లో రూ.60 వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి పట్టుబడి, సస్పెన్షన్‌కు గురైన హన్మకొండ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట్ రెడ్డి నివాసంలో ఏసీబీ అధికారులు ఈరోజు సోదాలు నిర్వహించారు. ఆయన ఇల్లుతో సహా మొత్తం ఏడు చోట్ల సోదాలు నిర్వహించిన అధికారులు భారీగా ఆస్తులను గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.7.69 కోట్లు ఉంటుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. సోదాల్లో సుమారు రూ.4.65 కోట్లు విలువైన విల్లాతో పాటు ఒక ఫ్లాట్‌ను గుర్తించారు. అలాగే, రూ.60 లక్షల విలువ చేసే ఒక దుకాణం, రూ.65 లక్షల విలువైన ఎనిమిది ఓపెన్ ప్లాట్లు, 14.5 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. బహిరంగ మార్కెట్లో వీటి విలువ మరింత ఎక్కువగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదే కాకుండా, రూ.30 లక్షల నగదు, రూ.44.03 లక్షల బ్యాంకు బ్యాలెన్స్, 297 గ్రాముల బంగారు ఆభరణాలను కూడా గుర్తించారు.

# తెలంగాణకు భారీ పెట్టుబడి..

- మొదటి పేజీ తరువాయి

రియాక్టర్ (ఎస్ఎంఆర్) ఆధారిత విద్యుత్ ప్రాజెక్ట్ అభివృద్ధికి స్లోవాకియాకు చెందిన న్యూక్లర్ ప్రొడక్ట్స్ సంస్థ ముందుకు వచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆ సంస్థ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈఓఐ) సమర్పించింది. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక2026 సమావేశాల సందర్భంగా బుధవారం (జనవరి 21) సీఎం రేవంత్ రెడ్డితో న్యూక్లర్ ప్రొడక్ట్స్ సంస్థ ప్రతినిధులు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఐక్యూ క్యాపిటల్ గ్రూప్ ఛైర్మన్ డాక్టర్ జాన్ బాబిక్, గ్రూప్ సీఈఓ, డైరెక్టర్ అనిల్ కుమార్ బావిసెట్టి, గ్రీన్ హౌస్ ఎన్విరో సీఈఓ, డైరెక్టర్ మొలుగు శ్రీపాల్ రెడ్డి, స్లోవాక్ రిపబ్లిక్ కాన్సుల్ మాటుస్ జెమెస్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉందన్నారు. 2047 నాటికి నెట్‌జీరో లక్ష్యాన్ని సాధించడంలో సుస్థిర అభివృద్ధే తెలంగాణకు ప్రధానమని స్పష్టం చేశారు. కాగా, స్లోవాకియాకు చెందిన ఐక్యూ క్యాపిటల్,

భారత్‌కు చెందిన గ్రీన్ హౌస్ ఎన్విరో సంయుక్త భాగస్వామ్యంలో న్యూక్లర్ ప్రొడక్ట్స్ సంస్థ ఏర్పడింది. 600 మిలియన్ యూరోలు (సుమారు రూ.6,000 కోట్లు) పెట్టుబడితో గరిష్ఠంగా 300 మెగావాట్ల సామర్థ్యంతో తెలంగాణలో కొత్త విద్యుత్ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను న్యూక్లర్ ప్రొడక్ట్స్ సంస్థ పరిశీలిస్తోంది.

# రాజకీయ ప్రయోగశాలగా సింగరేణి.. బొగ్గు అక్రమాలపై సీబీఐ దర్యాప్తు జరపాలి

- మొదటి పేజీ తరువాయి

మాట్లాడుతూ 'సింగరేణిని అన్ని రకాలుగా విధ్వంసం చేశారు. బీఆర్ఎస్ ఎలా పనిచేసిందో కాంగ్రెస్ అలానే పనిచేస్తుంది. ఒడిశాలో బీజేపీ వచ్చాక అక్కడి ప్రభుత్వంతో అనుమతులపై చర్చించాను. నైనీ బొగ్గు గనులకు చివరి పర్మిషన్ వచ్చాక పనులు ఎందుకు ఆలస్యం చేశారు? బీఆర్ఎస్ హయాంలోనూ అనేక అక్రమాలు జరిగాయి. ఆరోజు కొందరు వ్యక్తులకు లాభంగా చేకూరేలా వ్యవహరించారు. సింగరేణి అక్రమాలపై సీబీఐదర్యాప్తు జరగాలి. రాష్ట్రం ముందుకొస్తే కేంద్రం పరిశీలిస్తుంది. సింగరేణి మైనింగ్కు ముందుకు వస్తే, చెయ్యలేమని ప్రైవేట్ కు కట్టబెట్టారు. సంస్థని బెదిరించి లేఖ రాయించారు. ఈ వివా దంలోకి నన్ను కూడా లాగుతున్నారు.

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఏం చేసింది? సింగరేణి భవిష్యత్తు ప్రమాదకరంగా మార్చారు. సంస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలి' అని అన్నారు.

# రేవంత్‌తో కిషన్ రెడ్డికి చీకటి ఒప్పందం ఉంది

సింగరేణి బొగ్గు గనుల టెండర్ల కుంభకోణంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ స్కామ్‌పై కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి వైఖరిని తప్పుబడుతూ, సీఎం రేవంత్ రెడ్డితో బీజేపీకి చీకటి ఒప్పందం ఉందేమోనని ఆయన ఘాటుగా ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన బావమరిదికి అక్రమంగా టెండర్ కట్టబెట్టేందుకే దేశంలో ఎక్కడా లేని 'సైట్ విజిట్' నిబంధనను కొత్తగా చేర్చారని కేటీఆర్ ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో మైనస్ 20 శాతానికి ఖరారైన టెండర్లను రద్దు చేసి, ఇప్పుడు దాదాపు 10 శాతం ప్లస్‌కు కాంట్రాక్టులు అప్పగించడం దారుణమని విమర్శించారు. ఈ కుంభకోణంలో ప్రధాన దోషే ముందుకొచ్చి సీబీఐ విచారణ కోరాలని కేంద్రమంత్రి చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. "పట్టపగలు దోపిడీ చేసిన దొంగే స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి విచారణ జరపమని కోరతాడా?" అని నిలదీశారు.

సింగరేణిలో 49 శాతం వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వం ఇంత భారీ అవినీతి జరుగుతున్నా ప్రేక్షకపాత్ర వహించడంపై కేటీఆర్ మండిపడ్డారు. ఇది కిషన్ రెడ్డి అజ్ఞానమా లేక కాంగ్రెస్‌తో కుమ్మక్కా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణిని నష్టాల్లోకి నెట్టి, ఆ తర్వాత సంస్థను ప్రైవేటీకరించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఈ స్కామ్‌పై విచారణ జరపాలని సింగరేణి కార్మికులు 'జంగ్ సైరన్' మోగించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిక అని కేటీఆర్ అన్నారు. తెలంగాణకు కొంగుబంగారమైన సింగరేణిని కాంగ్రెస్, బీజేపీల నుంచి కాపాడే వరకు కార్మికులతో కలిసి తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

# అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలకు... నో పే!

**పెన్ పవర్ డెస్క్:** వైసీపీ ఎమ్మెల్యేలను పరోక్షంగా ప్రస్తావిస్తూ ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీకి హాజరు కాని ఎమ్మెల్యేలకు 'నో వర్క్.. నో పే' విధానం అమలు చేయాల్సిందే అని ఆయన స్పష్టం చేశారు. అసెంబ్లీకి రాకుండా జీతాలు ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించిన స్పీకర్ల మహాసభలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజల పట్ల శాసన వ్యవస్థకు ఉన్న జవాబుదారీతనం అంశంపై అయ్యన్నపాత్రుడు కీలక ప్రసంగం చేశారు. ఎమ్మెల్యేలు ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులని, అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడం వారి ప్రాథమిక బాధ్యత అని స్పీకర్ గుర్తు చేశారు. ప్రజలు నమ్మకంతో ఎన్నుకుని పంపిన ప్రతినిధులు సభకు రాకుండా జీతాలు తీసుకోవడం సరికాదని స్పష్టంగా చెప్పారు. శాసనసభ కార్యకలాపాల్లో పాల్గొన్నప్పుడే ప్రజల సమస్యలు చర్చకు వస్తాయని అన్నారు. ఈ అంశంపై లోక్‌సభ స్పీకర్‌తో పాటు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్పీకర్లు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అయ్యన్నపాత్రుడు కోరారు. శాసనసభ వ్యవస్థను మరింత బాధ్యతాయుతంగా మార్చాలంటే ఇలాంటి సంస్కరణలు తప్పనిసరిగా అవసరమని అభిప్రాయపడ్డారు.

ఎమ్మెల్యేల హాజరు తప్పనిసరిగా ఉండేలా 'నో వర్క్.. నో పే' విధానం అమలైతే, శాసనసభ పనితీరు మెరుగుపడుతుందని, ప్రజల విశ్వాసం మరింత బలపడుతుందని స్పీకర్ పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనపై దేశవ్యాప్తంగా విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

# గుంపు మేస్త్రీ, గుంటనక్క కలిసే ఉన్నారు

- మొదటి పేజీ తరువాయి

అలాగే పీవీ నరసింహారావు పేరు ఏదో ఒక జిల్లాకు పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఉద్యమకారులను పట్టించుకోలేదని కవిత విమర్శించారు. ట్యాంక్‌బండ్‌పై ఆంధ్రావారి విగ్రహాలే ఉన్నాయని... తెలంగాణ మహనీయుల విగ్రహాలు లేవని చెప్పారు. ఆంధ్రవారి విగ్రహాలను తొలగించాలని తాను చెప్పడం లేదని... తెలంగాణవారి విగ్రహాలను కూడా పెట్టాలని చెబుతున్నానని అన్నారు.

# మున్సి'పోల్స్' బరిలో మరో 3 పార్టీలు..!

- మొదటి పేజీ తరువాయి

పోటీకి రెడీ అవుతోందని తెలుస్తోంది. దీంతో పాటు ఆ పార్టీకి ఏపీలో మిత్రపక్షంగా ఉన్న జనసేన కూడా బరిలోకి దిగేందుకు రెడీ అవుతోంద ని సమాచారం. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని జనసేన పార్టీ ఎన్ని కల సన్నాహక పనులను ప్రారంభించినట్లు సమాచారం. మున్సిపల్ ఎన్నికల అవసరాలకు అనుగుణంగా వాటిని పునర్నిర్మించే ప్రణాళికలతో, పార్టీ తెలంగాణలోని వివిధ స్థాయిలలోని తన రాజకీయ కమిటీలను రద్దు చేసింది. పొత్తుపై బీజేపీతో చర్చలు త్వరలోనే జరిగే అవకాశం ఉందని తెలంగాణకు చెందిన నాయకుడొకరు తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు తమ పార్టీ పొత్తులు లేకుండా మున్సిపల్ ఎన్నికలలో స్వతంత్రంగా పోటీ చేస్తుందని ప్రకటించడంతో అనిశ్చితి కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్లో టీడీపీ, జనసేనతో బీజేపీకి పొత్తు ఉంది. ఇక్కడ వేర్వేరుగా పోటీ చేస్తారా..? లేక టీడీపీ.. జనసేన కలిసి బరిలోకి దిగుతాయా..? అన్నది హాట్ టాపిక్‌గా మారింది. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, ఆగస్టు 2024లో తెలంగాణ పార్టీ నాయకులతో జరిగిన సమావేశంలో, రాష్ట్రంలో పార్టీని పునరుద్ధరించి బలోపేతం చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సంస్థాగత పునర్నిర్మాణం, సభ్యత్వ నమోదుపై దృష్టి పెట్టాలని కూడా ఆయన నాయకులను కోరారు. ఈ నేపథ్యంలో, తెలంగాణలో టీడీపీ, జనసేన మున్సిపల్ ఎన్నికలలో పోటీ చేయవచ్చనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఏది ఏమైనా మరో మూడు రాజకీయ పార్టీలు తెలంగాణలోకి ఎంట్రీ ఇస్తుండటంతో ఫలితాలపై ఎలాంటి ప్రభావం చూపబోతోందనేది హాట్ టాపిక్ గా మారింది.

# రికార్డు స్థాయిలో రూపాయి పతనం

అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ చరిత్రాత్మక కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ట్రేడింగ్‌లో రూపాయి భారీగా నష్టపోయి, ఒక దశలో 91.74 వద్ద ఆల్ టైమ్ కనిష్ఠాన్ని నమోదు చేసింది. మార్కెట్‌లో నెలకొన్న పలు ప్రతికూల పరిణామాల మధ్య ఒక్కరోజే 77 పైసల మేర విలువను కోల్పోయింది. నిన్న 90.97 వద్ద ముగిసిన రూపాయి, ఇవాళ ఉదయం 91.05 వద్ద బలహీనంగా ప్రారంభమైంది. ట్రేడింగ్ సాగుతున్న కొద్దీ అమ్మకాల ఒత్తిడి పెరగడంతో రూపాయి విలువ అంతకంతకూ దిగజారింది. బంగారం, వెండి దిగుమతులు పెరగడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఫీ××లు) దేశీయ మార్కెట్ల నుంచి తమ పెట్టుబడులను భారీగా ఉపసంహరించుకోవడం పతనానికి ప్రధాన కారణంగా నిలిచింది. మరోవైపు అమెరికా, యూరప్ మధ్య వాణిజ్య యుద్ధ భయాలు, గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు అమెరికా ప్రయత్నిస్తోందన్న వార్తలు వంటి అంతర్జాతీయ అంశాలు కూడా రూపాయిపై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. వీటికి తోడు దేశీయ స్టాక్‌మార్కెట్లు నష్టాల్లో కొనసాగడం రూపాయి విలువను మరింత బలహీనపరిచిందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

## మాపై భారీగా పన్నులేయండి

భవిష్యత్ ప్రణాళికలు వేసుకుంటూ, కొత్త అవకాశాలను వెతుక్కుంటూ ప్రతిఏటా దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సుకు (డబ్ల్యూఈఎఫ్) వ్యాపారవేత్తలు వస్తుంటారు. ఈ నేపథ్యంలో 400 మంది సంపన్నులు వినూత్న డిమాండ్ చేశారు. తమపై భారీగా పన్నులు విధించాలని ఇచ్చిన పిలుపు ఆశ్చర్యపరుస్తోంది 24 దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తోన్న ఈ బృందం.. "ఙఅఎవ˜శీ ఔఙఅ" పేరిట సంతకాలు చేసిన బహిరంగ లేఖను విడుదల చేశారు. సూపర్ రిచ్ వ్యక్తులకు, మిగతా మానవాళికి మధ్య అంతరం నానాటికీ పెరుగుతోందని హెచ్చరించారు. దానిని రూపుమాపాలంటే ధనవంతులపై అత్యధిక పన్నులు విధించాలన్నారు. ప్రజా జీవితం, రాజకీయ వ్యవస్థలను సంపన్నులు ప్రభావితం చేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ భారీ సంపద ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరుస్తోందని, ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తోందన్నారు. "భారీ సంపద కలిగిన కొందరు మన ప్రజాస్వామ్యాలను కొనుగోలు చేశారు. ప్రభుత్వాలను స్వాధీనం చేసుకున్నారు. మీడియా స్వేచ్ఛను హరించారు. ఆవిష్కరణలపై పట్టు బిగించారు" అంటూ ఆవేదన వ్యక్తంచేశారు. "అసలుసిసలైన ప్రజాస్వామ్య వ్యవస్థలను తిరిగి కోరుకుంటున్నాం. ఆ దిశగా ప్రగతిశీల సంపద పన్నులు విధించాలి. ఈ పన్నులతో కుబేరుల జీవన ప్రమాణాలు ఏమాత్రం పడిపోవు. పైగా ఆరోగ్యం, విద్య వంటి ప్రజాసేవలకు మరిన్ని నిధులు అందుతాయి'' అని ఆ లేఖలో పేర్కొన్నారు. భారతదేశంలో సూపర్ రిచ్ వ్యక్తులపై పన్నులు పెంచాలనే ప్రతిపాదనలు, చర్చలు ఉన్నాయి. మన దేశంలో ప్రజల మధ్య అత్యధిక స్థాయిలో ఆదాయ అసమానతలు ఉన్నాయని ఫ్రాన్స్ ఆర్థికవేత్త, 'క్యాపిటల్ ఇన్ 21వ సెంచరీ' పుస్తక రచయిత థామస్ పికెట్టీ గతంలో వ్యాఖ్యానించారు. దీనిని నివారించాలంటే దేశంలో ఉన్న సూపర్ రిచ్ వ్యక్తులపై అధికంగా పన్నులు (ఖు×) విధించాలని సూచించారు.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్

# దావోస్‌లో రేవంత్ రెడ్డితో చిరంజీవి..

- పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా దావోస్‌కు వెళ్లిన రేవంత్ రెడ్డి
- జ్యూరిక్ లో చిరంజీవి ఉన్నట్టు తెలుసుకున్న రేవంత్
- దావోస్‌కు రావాలంటూ చిరంజీవికి ఆహ్వానం
- రేవంత్ ఆహ్వానం మేరకు దావోస్ వెళ్లిన మెగాస్టార్

**హైదరాబాద్ పెన్ పవర్:**స్విట్జర్లాండ్లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే ప్రధాన లక్ష్యంగా రేవంత్ ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ సదస్సుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కీలక అధికారులు హాజరయ్యారు. సదస్సులో మెగాస్టార్ చిరంజీవి కూడా పాల్గొన్నారు. స్విట్జర్లాండ్‌లోని జ్యూరిక్ లో చిరంజీవి ఉన్నట్టు తెలుసుకున్న రేవంత్ రెడ్డి... సదస్సుకు ఆయనను ఆహ్వానించారు. రేవంత్ ఆహ్వానం మేరకు దావోస్ సదస్సుకు చిరంజీవి వెళ్లారు. ఈ సందర్భంగా, తెలంగాణ ప్రభుత్వం ఆవిష్కరించిన “తెలంగాణ రైజింగ్ 2047” విజన్ డాక్యుమెంట్‌ను చిరంజీవి ఆసక్తిగా వీక్షించారు. ఈ సందర్భంగా చిరంజీవితో రేవంత్ ముచ్చటిస్తూ... ఇటీవల కుటుంబంతో కలిసి ‘మన శంకర వరప్రసాద్ గారు’ సినిమాను చూశానని, సినిమా చాలా బాగుందని తెలిపారు. చిరంజీవికి అభినందనలు తెలియజేశారు. ప్రస్తుతం చిరంజీవి స్విట్జర్లాండ్‌లో ఫ్యామిలీ ట్రిప్‌ను ఎంజాయ్ చేస్తున్నారు.



# బీఆర్ఎస్ హయాంలో అవినీతి జరిగిందని కవితనే చెప్పారు

- కవిత ఆరోపణలకు బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలన్నమంత్రి
- సింగరేణిపై బీఆర్ఎస్ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపాటు
- హిల్ట్ పాలసీపై అసెంబ్లీలో చర్చ పెడితే బహిష్కరించి వెళ్లిపోయారన్న మంత్రి

**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో ఎంతో అవినీతి జరిగిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపణలు చేశారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కవిత లేవనెత్తిన ప్రశ్నలకు, ఆమె చేసిన ఆరోపణలకు బీఆర్ఎస్ నాయకులు సమాధానం ఇవ్వడం లేదని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సింగరేణిపై బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.గత ప్రభుత్వం 30 శాతం అధిక కేటాయింపులతో టెండర్లను అప్పగించిందని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో కాంట్రాక్టులు పొందిన వ్యక్తులు ఇప్పుడు వారికి చెడ్డవారయ్యారా అని ఆయన ప్రశ్నించారు. హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ (హిల్ట్) పాలసీపై కూడా బీఆర్ఎస్ నాయకులు ఇలాగే ఆరోపణలు చేశారని, అసెంబ్లీలో చర్చకు అవకాశం ఇస్తే బహిష్కరించి వెళ్లిపోయారని ఆయన విమర్శించారు.



# ముందు మీ ఇంట్లో పంచాయతీ తేల్చుకోండి

## కేసీఆర్ ఫ్యామిలీపై మంత్రి కోమటిరెడ్డి ఫైర్



**హైదరాబాద్ పెన్ పవర్:** కేసీఆర్ ఫ్యామిలీపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శలు చేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులు ముందు వాళ్ల ఇంట్లో పంచాయతీ తేల్చుకోవాలని సూచించారు. హరీష్ రావు కాళేశ్వరం దొంగ అని స్వయంగా కేసీఆర్ కూతురు కవిత అన్నారని గుర్తు చేశారు. పదేళ్ల దొర పాలనలో విసుగు చెందే తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారన్నారు. బుధవారం (జనవరి 21) శామీర్ పేటలో అలియాబాద్, మూడు చింతలపల్లి, ఎల్లంపేట మున్సిపాలిటీల సమన్వయ సమావేశం జరిగింది. మంత్రి కోమటిరెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో అన్నిచోట్ల అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందడం ఖాయమని.. లేకపోతే ఏ సవాల్‌కైనా సిద్ధమన్నారు. కేసీఆర్ పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉండి తన ఫామ్ హౌస్‌కు నాలుగు దిక్కుల వేయి కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్ముతో రోడ్లు వేయించుకున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాల్లో కూడా ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారని గుర్తు చేశారు. కేసీఆర్ పదేళ్లు ముఖ్యమంత్రిగా పని చేసి 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ఒక ఎంపీ స్థానాన్ని

- మిగతా 4లో...

# ప్రాజెక్టుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

## పర్యావరణ అనుమతుల కోసం కేంద్రంపై ఒత్తిడి తెద్దాం: ఉత్తమ్

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం సహా ప్రధాన ప్రాజెక్టుల నిర్మాణాలను శరవేగంగా పూర్తి చేయాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను కొనసాగించడానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ డీపీఆర్ రూపకల్పన అధ్యయనం వేగంగా జరగాలని, కాళేశ్వరం పునరుద్ధరణ డిజైన్లు నెలలోపు పూర్తి చేయాలని సూచించారు. నీటిపారుదల ప్రాజెక్టులపై బుధవారం సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆ శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఇతర అధికారులు పాల్గొన్నారు. “నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తి చేయడానికి సరిపడా నిధుల కేటాయింపునకు సీఎం అంగీకరించినందున యుద్ధప్రాతిపదికన పనులు నిర్వహించేందుకు అధికారులు చొరవ చూపాలి. సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్ కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీలైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల స్థలాల తనిఖీ నివేదిక, పనుల ప్రణాళిక సమర్పించింది. ఈ నెల 22న పరిశీలన పనులు ప్రారంభమవుతాయి. ఈ మూడు బ్యారేజీల



పునరుద్ధరణ డిజైన్లు నెల వ్యవధిలో రూపొందించాలి. సత్వరం పర్యావరణ అనుమతులు పొందేందుకు కేంద్రంపై ఒత్తిడి తెద్దాం. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను కేంద్ర జలశక్తి మంత్రి దృష్టికి తీసుకెళ్లాం. సీఎంతో చర్చించాక ప్రధాని మోదీకి వివరిద్దాం’ అని ఉత్తమ్ పేర్కొన్నారు.



# వికారాబాద్ జిల్లా పరిగిలో భారీ అగ్నిప్రమాదం..

## ఒకేసారి మూడు ఇళ్ళు అగ్నికి ఆహుతి..

**హైదరాబాద్ పెన్ పవర్:**వికారాబాద్ జిల్లా పరిగిలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. పరిగి మున్సిపల్ పరిధిలోని మల్లెమోనిగూడలో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో ఒకేసారి మూడు ఇళ్ళు అగ్నికి ఆహుతయ్యాయి. బుధవారం ( జనవరి 21 ) జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. పరిగి మున్సిపల్ పరిధిలోని మల్లెమోనిగూడలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రసూల్ బి, బషీర్ బి, మౌలానా అనే వ్యక్తుల ఇళ్లు ఒకేసారి అగ్నికి ఆహుతయ్యాయి. బాధితులు పొలం పనులకు వెళ్లిన సమయంలో మంటలు చెలరేగడంతో ఇళ్లలోని సామాగ్రి మొత్తం కాలి బూడిదైంది. ఈ ప్రమాదంలో రెండు మేక పిల్లలు సజీవ దహనమయ్యాయి. స్థానికులు ఫైర్

- మిగతా 4లో...

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
‘ ఐదు రోజులకు ’
‘4 సెం.మీ 4 సెం.మీ’
‘మరిన్ని వివరాలకు సంప్రదించండి ’
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కాంగ్రెస్ సమావేశానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేను ఎలా అనుమతిస్తారు?

- బీఆర్ఎస్‌లోనే ఉన్నట్లు సంజయ్ అఫిడవిట్ ఇచ్చారన్న జీవన్ రెడ్డి
- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అవమానాలు ఎదుర్కొన్నామన్న జీవన్ రెడ్డి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే సమీక్షకు వస్తే కార్యకర్తలకు ఏమని సమాధానం చెప్పాలని నిలదీత



**హైదరాబాద్ పెన్ పవర్:**నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమీక్షలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ పాల్గొనడంపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జీవన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ సమీక్షలో ఎలా పాల్గొంటారని ఆయన ప్రశ్నించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి విజయం సాధించిన పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పక్షాన కొనసాగుతుండడం తెలిసిందే.ఈరోజు గాంధీ భవన్‌లో నియోజకవర్గ సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే సంజయ్ పాల్గొనడంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమక్షంలోనే జీవన్ రెడ్డి నిరసన వ్యక్తం చేశారు.అనంతరం గాంధీ భవన్ వెలుపల మీడియాతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేని కాంగ్రెస్ పార్టీ సమావేశానికి ఎలా అనుమతిస్తారని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌లోనే ఉన్నట్లు

- మిగతా 4లో...

- ఎస్ఈసీ మార్గదర్శకాల మేరకు కమిషనర్లను బదిలీ చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు
- సొంత జిల్లాల్లో పని చేస్తున్నవారు, ఒకేచోట సుదీర్ఘకాలం పని చేస్తున్న వారు బదిలీ
- బదిలీ అయిన అధికారులు వెంటనే బాధ్యతలు స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్న ప్రభుత్వం

# మున్సిపల్ ఎన్నికలకు ముందు...

## తెలంగాణలో 47 మంది కమిషనర్ల బదిలీ


**హైదరాబాద్ పెన్ పవర్:**2026 మున్సిపల్ ఎన్నికలకు ముందు తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 47 మంది మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేసింది. నిష్పాక్షికంగా ఎన్నికల నిర్వహించేందుకు జీహెచ్ఎంసీ, కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో ఈ బదిలీలు చేపట్టింది. ఈ మేరకు పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎస్ఈసీ మార్గదర్శకాల మేరకు కమిషనర్లను బదిలీ చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు ఇచ్చింది.సొంత జిల్లాల్లో పనిచేస్తున్న వారు, ఒకేచోట సుదీర్ఘ కాలం పనిచేస్తున్న అధికారులను పరిపాలనాపరమైన కారణాలతో పాటు పదోన్నతులపై బదిలీ చేసింది.సి.వి.ఎన్. రాజు ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్-3) నుంచి రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ సెక్రటరీగా బదిలీ అయ్యారు. జి.రాజు క్యాతనపల్లి నుంచి ఆదిలాబాద్ మున్సిపాల్ కమిషనర్‌గా, ముసాబ్ అహ్మద్ నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా, బి.శ్రీనివాస్ ఆలేరు నుంచి హుజూర్ నగర్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. బి.శరత్ చంద్ర ప్రమోషన్‌పై నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా వెళ్లనున్నారు. బదిలీ అయిన అధికారులు వెంటనే తమకు కేటాయించిన కొత్త ప్రాంతాల్లో బాధ్యతలు స్వీకరించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

# కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సంకల్పానికి కదులుతున్న పల్లెలు

**బెల్ట్ షాపు రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుకోవడానికి ర్యాలీలు**

**చాటుమాటుగా కిరాణా షాపుల్లో మద్యం అమ్ముతున్న వాళ్లకి యూత్ కౌన్సిలింగ్**

**మద్యం నియంత్రణ దిశగా మునుగోడు లో మారుతున్న ముఖచిత్రం**




**మునుగోడు పెన్ పవర్:** మునుగోడునియోజకవర్గంలో మద్యం నియంత్రణపై మద్యం షాపుల సమయపాలన పై వెనక్కి తగ్గేదే లేదని తమ వద్దకు వచ్చిన మద్యం వ్యాపారులకు తేల్చి చెప్పిన గౌరవ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సంకల్పానికి మునుగోడు నియోజకవర్గంతో పాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భారీ స్పందన వస్తుంది... ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీసే వ్యాపారం ఎందుకని పొద్దంతా మీరు తాగిన తర్వాతే ప్రజలకు తాపించడని మద్యం వ్యాపారులను ఉద్దేశించి అన్న మాటలకు ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు, చదువుకున్న మేధావులు, సామాజిక అనుభవజ్ఞులు శబాష్ అంటున్నారు.. రాజగోపాల్ రెడ్డి మద్యం విషయంలో మాట్లాడే మాటలు అక్షర సత్యాలని మద్యం మహమ్మారి వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయాని, గ్రామాలలో యుక్త వయసులోనే మహిళలు విదవలు గా మారుతున్నారని సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రజలు తమ అభిప్రాయాన్ని చెబుతున్నారు...

2018లో తాను మునుగోడు నియోజకవర్గ శాసనసభ్యుడి గా గెలిచిన తర్వాత గ్రామాలలో బెల్ట్ షాపులను నిర్మూలిస్తానని మునుగోడు నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చారు..గెలవగానే బెల్ట్ షాపులను నిర్మూలించాలని పిలుపునిచ్చారు..ఆ పిలుపు అందుకున్న కొన్ని గ్రామ పంచాయతీలు గ్రామ సభ తీర్మానం చేసి బెల్ట్ షాపులను నిర్మూలించాయి.. బెల్టు షాపులను నిర్మూలించిన గ్రామాలకు తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ తరఫున ఐదు లక్షల ఆర్థిక సహాయం కూడా చేశారు.. కానీ రాష్ట్రంలో టిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండడం వల్ల గ్రామాలలో బెల్ట్ షాపుల నిర్మూలన అనేది సక్సెస్ కాలేదు... తిరిగి 2023లో గెలిచిన తర్వాత మునుగోడు నియోజకవర్గంలో బెల్ట్ షాపుల నిర్మూలన లేకుండా చేశారు.. అక్కడితో ఆగకుండా నూతన మద్యం పాలసీ రాగానే మునుగోడు నియోజకవర్గంలో వైన్ షాపులు దక్కించుకునే వాళ్లకు పలు సూచనలు చేశారు ఆ సూచనల ప్రకారం మధ్యాహ్నం ఒంటిగంటకు మాత్రమే వైన్ షాపులు తెరవాలని, సాయంత్రం 6 గంటల తరవాతే పర్మిట్ రూములను ప్రారంభించాలని ఆదేశించారు... గౌరవ ఎమ్మెల్యే గారి ఆదేశాల మేరకు మునుగోడులో మద్యం నియంత్రణ మద్యం షాపుల సమయపాలన కొనసాగుతోంది..అయితే ఇటీవల కొందరు మద్యం షాపుల యజమానులు సమయపాలనలో కొద్దిగా మార్పులు తీసుకురావాలని కోరడానికి రావడంతో మద్యం షాపుల సమయపాలనలో ఎటువంటి మార్పు ఉండదని మద్యం వ్యాపారులకు తెగేసి చెప్పారు.. తాము ఎన్నుకున్న తమ నాయకుడు ప్రజల ఆరోగ్యం పట్ల కమిట్మెంట్తో పని చేస్తున్న విధానాన్ని చూసి ఆయన సంకల్పానికి అనుగుణంగా మునుగోడు నియోజకవర్గం లోని గ్రామాలలో చాటుమాటుగా బెల్ట్ షాపులను నిర్వహించొద్దని ర్యాలీలు నిర్వహిస్తున్నారు.. గట్టుప్పల్ మండలం వెల్మకన్నె గ్రామంలో బెల్ట్ షాపులు నిర్వహించద్దని ర్యాలీ తీస్తూ ప్రతి ఒక్క కిరాణా షాప్ యజమాని దగ్గరికి వెళ్లి రాజగోపాల్ రెడ్డి గారి సంకల్పానికి మద్దతుగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లో చాటుమాటుగా మద్యం అమ్మకాలు జరిపితే ఊరుకోమని కౌన్సిలింగ్ ఇస్తున్నారు.

ప్రకృతికి అనుగుణంగా మనిషి జీవన విధానం కొనసాగుతోంది సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు మనిషి కష్టపడి పని చేయాలని ప్రకృతి నేర్పింది.. ఎన్నో వేల తరాలు ఆ ప్రకృతి నియమాలకు కట్టుబడే జీవనాన్ని కొనసాగిస్తూ తరువాతి తరానికి ఆ జీవన విధానాన్ని అందించారు... కానీ ప్రకృతి విధానానికి విరుద్ధంగా సూర్యోదయం నుంచి తాగడం మొదలుపెడుతున్నారు పనిచేసుకొని పైసలు సంపాదిస్తూ భార్య పిల్లల్ని సాకాల్సిన సమయాన్ని తాగుడుకు కేటాయిస్తూ బానిసలుగా మారి కుటుంబాలను ఆర్థికంగా ఆరోగ్యంగా దెబ్బ తీసుకుంటున్నారు.. సూర్యోదయం నుండి తాగే విధానానికి స్వస్తి పలికి ప్రజలు పొద్దంతా పనిచేసుకున్న తర్వాతే తాగుడు గురించి ఆలోచించాలనే సంకల్పంతోనే మునుగోడు

నియోజకవర్గంలో మద్యం నియంత్రణ మద్యం షాపుల సమయాలలో మార్పు విధానాన్ని కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి గారు తీసుకొచ్చారు.. తాను తాగుడుకు వ్యతిరేకం కాదని పొద్దస్తమానం పనిచేయకుండా అతిగా తాగే విధానానికి మాత్రమే వ్యతిరేకమని ఎన్నో వేదికల మీద స్పష్టం చేశారు..ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీసే వ్యాపారం మంచిదికాదని వైన్ షాపుల యజమానులకు కౌన్సిలింగ్ ఇచ్చారు..అక్కడితో ఆగకుండా మొదట మనం పాటిస్తేనే ప్రజలు పాటిస్తారని తనతో పాటు తిరిగే తన అనుచరులకు అభిమానులను కూడా పగటిపూట మద్యం సేవించొద్దని హుకుం జారీ చేయడంతో నాయకులు అభిమానులు కూడా పగటి పూట మద్యం తీసుకొనే విధానానికి స్వస్తి పలికారు.

## బెల్ట్ షాపులను మూసివేయాలి..

**మునుగోడు, జనవరి 21 పెన్ పవర్:** : నల్లగొండ జిల్లా గట్టుప్పల మండలంలోని వెల్మకన్నె గ్రామంలో గ్రామ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 'మద్యం వద్దు కుటుంబం ముద్దు' అనే నినాదంతో ఈరోజు గ్రామంలోని ప్రధాన వీధులలో భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రామ పరిరక్షణ సమితి అధ్యక్షుడు చలమల్ల యాదగిరిరెడ్డి మాట్లాడుతూ, మత్తు పదార్థాల వల్ల యువకుల జీవితాలు నాశనమవుతున్నాయని, కుటుంబాల్లో కలహాలు రేగుతున్నాయని, పిల్లల భవిష్యత్తు, విద్య, ఆర్థిక స్థితిగతులు దెబ్బతింటున్నాయని, సమాజంలో గుర్తింపు కోల్పోతున్నారని తెలిపారు.

## తేనెటీగల దాడిలో రైతుకు గాయాలు,

## 108 సిబ్బంది సకాలంలో స్పందన

**బోధన్, జనవరి 21 పెన్ పవర్:** ఎడపల్లి మండలం అంభం గ్రామానికి చెందిన జడగల గంగారాంపై బోధన్ మండలం బెల్లాల్ గ్రామంలో కూరగాయలు విక్రయిస్తుండగా తేనెటీగల గుంపు దాడి చేసింది. పరిస్థితి విషమించడంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. ఎడపల్లి 108 సిబ్బంది లక్ష్మణ్, ఆసిఫ్ ప్రథమ చికిత్స చేసి జిల్లా ఆస్పత్రి బోధన్‌కు తరలించారు. సకాలంలో స్పందించిన 108 సిబ్బందిని వైద్యులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

## వేల్పూర్ లో మార్కండేయ జయంతి ఘనంగా నిర్వహణ

**నిజామాబాద్ అర్బన్, జనవరి 21 పెన్ పవర్:** వేల్పూర్ మండల కేంద్రంలో బుధవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సర్పంచ్ మొండి అశోక్, ఉప సర్పంచ్ బాలులను శాలువాలతో సన్మానించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్‌తో పాటు పద్మశాలి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## అభయాంజనేయ స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం

**నల్లగొండ, జనవరి 21 పెన్ పవర్:** నల్లగొండ పట్టణంలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. దేవాలయ ప్రాంగణంలో వేద పండితులచే ఉదయం నుండి అన్ని క్రతువులను పూర్తి చేసి, హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గుమ్మల మోహన్ రెడ్డి, ఎడ్ల శంకర్, గుండెబోయిన వెంకన్న యాదవ్, కమిటీ అధ్యక్షుడు భైరగోని రాజయ్య, ప్రధాన కార్యదర్శి బండారు ప్రసాద్, ఉపాధ్యక్షుడు వీరేల్లి చంద్రశేఖర్, ఇటీకాల కృష్ణయ్య, గార్లపాటి వెంకటయ్య, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# ఉత్సాహభరితంగా బీమా సభలు

**హైదరాబాద్ పెన్ పవర్:** అఖిల భారత బీమా ఉద్యోగుల అసోసియేషన్ (ఏఐఐఇఎ) 27వ మహాసభలు 2025 డిసెంబర్ 28 నుంచి 2026 జనవరి ఒకటి వరకు ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో ఉత్సాహ భరితంగా జరిగాయి. దేశం నలుమూల నుంచి మొత్తం 1524 మంది సభ్యులు పాల్గొ న్నారు. దశాబ్దాల పాటు యూనియన్‌కు సేవలందించిన సీనియర్లు ఈ ప్లాటినం జూబ్లీ మహాసభల్లో పాల్గొని వన్నె తెచ్చారు. కొత్తగా రిక్రూట్ అయిన యువతరం అధిక సంఖ్యలో పాల్గొన్నది. 368 మంది మహిళా కామ్రేడ్స్ హాజరయ్యారు. పాల్గొన్నవారి సంఖ్య, వ్యక్తమైన ఉద్వేగాలు, అర్థవంతమైన చర్చలు, మహాసభ ఇచ్చిన భరోసా, నమ్మకం ఇలా ఏ రకంగా చూసినా గత మహాసభలకంటే ఈ ప్లాటినం జూబ్లీ సంవత్సర మహాసభ అద్భుతమనే చెప్పవచ్చు. 27 మంది మహిళా ఉద్యోగులు ఏఐఐఈఎ అరుణ పతాకాలను చేతబూని ముందు నడవగా, మూడు వేల మందితో మహాసభ ర్యాలీ సాగింది. విభిన్నవర్ణాల దుస్తుల్లో, వివిధ భాషల్లో, నినాదాలతో భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా ర్యాలీ సాగింది. కళింగ యూనివర్సిటీ ప్రాంగణంలోనే బహిరంగసభ నిర్వహించబడింది. 28న ఉదయం హాజరైన సభ్యుల విప్లవ నినాదాల మధ్య, భువనేశ్వర్ కామ్రేడ్స్ విప్లవ గీతాలాపనతో ప్రతినిధుల సభ ప్రారంభమైంది. సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ మాజీ సభ్యులు తపన్ సేన్, ప్రముఖ ఆర్థికవేత్త ప్రభాత్ పట్నాయక్ మాట్లాడారు. పాలకుల ప్రజా, కార్మిక ప్రతికూల విధానాలను వివరించారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, అసమానతలు పెరగడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల్ని చైతన్యపరిచి, ప్రజాభిప్రాయాన్ని కూడగట్టి, వారిని ఉద్యమాలకు సమీకరించాలని, ఇదే మన కర్తవ్యమని ఆయన ఉద్బోధించారు. బీమారంగంలో ప్రతిపాదిస్తున్న వందశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు దేశం కోసం కాదన్నారు. లేబర్‌కోడ్‌లను కూడా కార్పొరేట్ సంస్థల కోసమే కేంద్రం తీసుకొచ్చిందని చెప్పారు. ప్రభుత్వరంగ సంస్థల వల్లనే దేశ ఆర్థిక వ్యవస్థ నిలకడగా ఉందని, అందువల్ల, వాటిని కాపాడుకోవడానికి దీర్ఘకాలిక పోరాటాలు అవసరమని, ఫిబ్రవరి పన్నెండున కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ప్రతినిధుల సభలో మొత్తం 74 మంది డెలిగేట్లు నివేదికపై చర్చలో పాల్గొన్నారు. ఇందులో పది మంది మహిళా కామ్రేడ్స్ మాట్లాడారు. చర్చలో పాల్గొన్న కామ్రేడ్స్ మనల్ని, మన జీవితాలను ప్రభావితం చేస్తున్న అంతర్జాతీయ సమస్యలను, యుద్ధాల్ని, పాలకుల విధానాలను ప్రస్తావించారు. ప్రతినిధుల సభలో చంద్రశేఖర్ బోస్, అమానుల్లా ఖాన్, వేణుగోపాల్‌ల ప్రసంగాలు చర్చలను మరింత సుసంపన్నం చేశాయి.మహాసభలలో రెండు సెమినార్లు నిర్వహించబడ్డాయి. "భారతదేశ సమ్మిళిత సాంస్కృతిక వైవిధ్యం ఐక్యత" అంశంపై కువెంపు యూనివర్సిటీ ప్రొఫెసర్ రాజేంద్ర చెని, రెండవ సెమినార్‌లో 'దిగజారుతున్న ప్రజాస్వామ్య విలువలు, మీడియా బాధ్యత'అనే అంశంపై ఫ్రంట్ లైన్ పత్రిక మాజీ అసోసియేట్ ఎడిటర్ వి.శ్రీధర్ పాల్గొన్నారు. ప్లాటినం జూబిలీ సంవత్సరం సందర్భంగా, ఏఐఐఈఎ నాయకులను మహాసభ ఘనంగా సత్కరించింది. ఈ కాన్ఫరెన్స్‌లో మొత్తం ఇరవై నాలుగు తీర్మానా లను ఆమోదించారు. ఎఫ్‌డిఐ, ప్రయివేటీ కరణకు వ్యతిరేకంగా ప్రచార ఉద్యమం కొనసాగాలి. ఎల్ఐసి తక్షణ రిక్రూట్మెంట్ చేపట్టాలి. జనరల్ ఇన్సూరెన్స్ వేతనసవరణ, 30శాతం ఫ్యామిలీ పెన్షన్ అమలు చేయాలి. నాలుగు లేబర్-కోడ్స్ రద్దు చేయాలి. మహళల, దళితుల, ఆదివాసీలపట్ల రక్షణ చర్యలు చేపట్టాలి. గాజాలో జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా తీర్మానం, అలాగే యువ నాయకత్వ అభివృద్ధికి ఆల్ ఇండియా వర్క్‌షాప్ హైదరాబాదులో నిర్వహించడం వంటివి ఉన్నాయి. ఇంకా జూలై ఒకటిన ప్లాటినం జూబ్లి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించాలి. ఏఐఐఈఎ కోసం ఒక గీతం, ఒక ప్రతిజ్ఞ, ఒక వెబ్‌సైట్, ఒక యూట్యూబ్ ఛానెల్ ఏర్పాటు చేయాలి. ఇలా అనేక అంశాలపై తీర్మా నాలను సభ్యులు ఆమోదించారు. ఐక్యత, పోరాటం, ప్రజలపక్షాన నిలబడడం ఏఐఐఈఎ నిజమైన బలం. భువనేశ్వర్‌లో జరిగిన ఈ మహాసభలు బీమా కార్మిక ఉద్యమానికి దిశానిర్దేశం. ప్రభుత్వ రంగ బీమా సంస్థలరక్షణకు, దేశ ఆర్థిక వ్యవ స్థను కాపాడుకు నేందుకు తీసుకున్న ఒక దృఢ సంకల్పం. దోపిడీ, అసమానత, వివక్షలేని ఒక సమాజం కోసం మనం కంటున్న ఓ కలని సాకారం చేసుకునే దిశగా సాగే ప్రయాణంలో ఓ భాగం. మహాసభ ఇచ్చిన స్ఫూర్తితో, ధైర్యంతో, ఐక్యతతో రాబోయే సవాళ్లను గట్టిగా ఎదుర్కొంటామన్న నమ్మకంతో, జనరల్ ఇన్సూరెన్స్ ప్రభుత్వరంగ సంస్థల రక్షణ కోసం ప్రచార ఉద్యమాన్ని కొనసాగించాలి. అందుకు ఎఐఐఇఎ సైన్యం ముందుకు సాగాలి.

## గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి



**జయశంకర్ భూపాలపల్లి పెన్ పవర్:** 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ఈ సందర్భంగా బుధవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డా బిఆర్ అంబేద్కర్ క్రీడా మైదానంలో జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలకు మైదానం పూర్తిగా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆహూతులు సౌకర్యవంతంగా కూర్చునేందుకు షామియానాలు, కుర్చీలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు.

ప్రజలకు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించే విధంగా సింగరేణి, విద్యా, డిఆర్‌డీఓ, గృహ నిర్మాణ, సంక్షేమ, వ్యవసాయ, ఉద్యాన, వైద్య శాఖల అధికారులు స్టాళ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే గణతంత్ర దినోత్సవ వేడుకలలో పాఠశాలల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని విద్యా శాఖ అధికారిని ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించే ప్రసంగ పాఠాన్ని సిద్ధం చేయాలని డిపిఆర్‌ఓను కలెక్టర్ ఆదేశించారు. గణతంత్ర

దినోత్సవ వేడుకలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఈ సందర్భంగా సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఏఎస్పి నరేష్ కుమార్, ఆర్డిఓ హరికృష్ణ, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి వాకిటి శ్రీహరి చేతుల మీదుగా సీసీ రోడ్డుకు భూమి పూజ

**మక్తల్, జనవరి 21 పెన్ పవర్:** నారాయణపేట జిల్లా మక్తల్ 7వ వార్డ్ లో అయ్యప్ప కాలనీ మరియు అయ్యప్ప ఆలయానికి వెళ్లే రహదారిలో సీసీ రోడ్డు నిర్మాణానికి మంత్రి వాకిటి శ్రీహరి భూమి పూజ చేశారు. పట్టణానికి దూరంగా ఉన్న ఈ ప్రాంతంలో నిర్మాణాలు పెరిగి కాలనీ ఏర్పడిందని, రహదారి సౌకర్యం కోసం ఈ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు మంత్రి తెలిపారు. నూతన రోడ్డుతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేసి, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఊర్కొండలో ఘనంగా రోడ్డు భద్రతా వారోత్సవాలు



**నాగర్‌కర్నూల్, జనవరి 21 పెన్ పవర్:** నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండల కేంద్రంలో బుధవారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలీసులు, రవాణా శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాహనదారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని పోలీసులు పిలుపునిచ్చారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అతివేగం ప్రమాదకరమని తెలిపారు.

## గృహలక్ష్మి పథకం:

## 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పంపిణీ

**నాగార్జునసాగర్, జనవరి 21 పెన్ పవర్:** తిరుమలగిరి సాగర్ మండలం నాగార్జున పేట గ్రామపంచాయతీలో గృహలక్ష్మి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని లబ్ధిదారులకు గ్రామ సర్పంచ్ ఆంబోతు శ్రీను నాయక్, ఉపసర్పంచ్ రక్మి పాండు నాయక్, వార్డు సభ్యులు రామావత్ శ్రీనివాస్ నాయక్, ఆంబోతు సైది యాదగిరి నాయక్, జరపల మాంగ్త నాయక్ అందజేశారు. ఈ పథకం ద్వారా అర్హులైన వారికి ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుంది.

## వేసవిలో నీటి కష్టాలు:

## నేరేడు గుమ్ము ప్రజల ఆందోళన

**దేవరకొండ, జనవరి 21 పెన్ పవర్:** దేవరకొండ మండలం నేరేడు గుమ్ము గ్రామస్తులు రాబోయే వేసవిలో నీటి సమస్య తీవ్రతరం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌ను కోరుతున్నారు. "దాహం వేసినప్పుడు బావి తవ్వడం కంటే.. ఎండలు ముదిరే లోపే నీటి వనరులను సిద్ధం చేయడం ఉత్తమ లక్షణం" అని నినదిస్తూ, నీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. నీరు ప్రాణాధారమని, ప్రజాప్రతినిధిగా నీటిని అందించడం బాధ్యత అని గుర్తుచేశారు. ఎండలు పెరగకముందే నీటి కష్టాలు తీరాలని, ఎమ్మెల్యే దృష్టికి సమస్యను తీసుకెళ్లాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## రెండు శాఖల మధ్య వివాదం

**మిర్యాలగూడ, జనవరి 21 పెన్ పవర్:** నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రైవేట్ భవనంలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఎన్ఎస్పీ క్వార్టర్స్ లోని ప్రభుత్వ భవనంలోకి మార్చాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, ఇప్పటికే అదే భవనంలో ఎన్ఎస్పీ డివిజన్ కార్యాలయం కొనసాగుతుండటంతో, ఇరు శాఖల అధికారుల మధ్య సమన్వయ లోపం తలెత్తింది. కలెక్టర్ ఆదేశాలున్నాయని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది భవనాన్ని ఖాళీ చేయాలని కోరగా, తమకు అధికారిక సమాచారం అందలేదని, ఖాళీ చేయబోమని ఎన్ఎస్పీ అధికారులు స్పష్టం చేశారు. దీంతో ఇరు శాఖల సిబ్బంది మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. చివరకు కార్యాలయం తమదేనంటూ ఇరు శాఖల సిబ్బంది భవనానికి విడివిడిగా రెండు తాళాలు వేయడం చర్చనీయాంశంగా మారింది.

# వికారాబాద్ జిల్లా పరిగిలో భారీ అగ్నిప్రమాదం..

### ఒకేసారి మూడు ఇళ్ళు అగ్నికి ఆహుతి..

-3 పేజి తరువాయి

సిబ్బందికి సమాచారం అందించినప్పటికీ వారు వచ్చేలోపే సర్వం బూడిదయ్యాయి. నిలువనీడ కోల్పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు.షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదం జరిగి ఉండవచ్చని ఫైర్ సిబ్బంది భావిస్తున్నారు. మొదట ఓ ఇంట్లో మొదలై... మూడు ఇళ్ళకు పాకినట్టు తెలుస్తోంది. ఇళ్ళు పూర్తిగా దగ్ధమవ్వడంతో బాధితులకు ఉండటానికి గూడు లేని పరిస్థితి ఏర్పడింది. నిలువ నీడ కోల్పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు బాధితులు.

## ముందు మీ ఇంట్లో పంచాయతీ తేల్చుకోండి

-3 పేజి తరువాయి

కూడా గెలుపించుకోలేదని ఎద్దేవా చేశారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఎక్కువ మంది బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచారని అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యేగా కేసీఆర్ జీతభత్యాలు తీసుకుంటూ ఫామ్ హౌస్‌లో పడకుంటున్నాడని విమర్శించారు. మల్కాజిగిరి పార్లమెంటు ఇంచార్జీగా సెగ్మెంట్‌లోని మూడు మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని అన్నారు.

# కాంగ్రెస్ సమావేశానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేను ఎలా అనుమతిస్తారు?

-3 పేజి తరువాయి

సంజయ్ అఫిడవిట్ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్ పదేళ్ళ పాలనలో తాము ఆ పార్టీ నుంచి అవమానాలను ఎదుర్కొన్నామని, అలాంటి పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేను తమ పక్కన కూర్చోబెట్టడం సరికాదని అన్నారు.

పదేళ్లు బీఆర్ఎస్‌పై పోరాటం చేశామని, ఇప్పుడు పోరాటం చేసిన వారినే గాంధీ భవన్‌కు రానిస్తే కార్యకర్తలకు ఏమని సమాధానం చెప్పాలని నిలదీశారు. సమీక్ష సమావేశానికి సంజయ్ రావడం జీర్ణించుకోలేక తాను పీసీసీకి క్షమాపణలు చెప్పి గాంధీ భవన్ నుంచి బయటకు వచ్చానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం పోరాడిన వారిని చులకనగా చూసే పరిస్థితి వస్తుందని తాము ఊహించలేదని అన్నారు.ప్రస్తుతం జరుగుతున్న సమావేశం పార్టీ విధానానికి, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ ఆలోచనలకు భిన్నంగా జరుగుతోందని అన్నారు. రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి మచ్చతెచ్చేలా ఈ సమీక్ష సమావేశం ఉందని మండిపడ్డారు. నాలుగు దశాబ్దాలుగా తాను పార్టీలో ఉన్నానని, ఎన్నో కష్టాలను భరించానని తెలిపారు. కాంగ్రెస్ తన పార్టీయేనని, కేవలం ఈ రోజు సమీక్ష సమావేశం నుంచి మాత్రమే వెళ్లిపోతున్నానని తెలిపారు.



# వివాదాల్లో కొండా సురేఖ...

**హైదరాబాద్, జనవరి 21, పెన్ పవర్:** తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వివాదాలలో చిక్కుకోవడం పరిపాటిగా మారిపోయింది. అయితే తొలిసారిగా ఆమె ప్రమేయం లేకుండానే ఈసారి ఆమె శాఖలో వివాదం ఏర్పడింది. అది కాస్త ఏకంగాఉద్యోగుల నిరసనకు దారి తీసే అవకాశం కనిపిస్తోంది. దీనికి సంబంధించిన కథనాలు మీడియాలో విస్తృతంగా కనిపిస్తున్నాయి.కొండా సురేఖ అటవీశాఖ తో పాటు దేవాదాయ శాఖను కూడా పర్యవేక్షిస్తున్నారు.దేశదేశాలలో ఇతర విభాగాల అధికారుల వలసలను నివారించడానికి ఆమె డిప్యూటేషన్ల ప్రక్రియను రద్దు చేశారు. గత ఏడాది జూన్లోనే సురేఖ ఆదేశాలు జారీ చేశారు. సొంత శాఖ అధికారుల ప్రయోజనాలనుకాపాడేందుకు ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. కానీ దేవాదాయ శాఖలో ఇతర విభాగాల అధికారులు వలసలు మొదలుపెట్టారని తెలుస్తోంది. సురేఖ ఇచ్చిన ఆదేశాలను సైతం ఉన్నత అధికారులు పక్కన పెట్టారని..డిప్యూటేషన్లను వేగవంతం చేశారని తెలుస్తోంది. ఈ వ్యవహారం దేవాదాయ శాఖలో చర్చనీయాంశంగా మారింది.సచివాలయం స్థాయిలో ఈ దస్త్రాలు కదులుతున్నాయని.. ఆలయ కార్య నిర్వహణ అధికారి నుంచి మొదలు పెడితే సహాయ కమిషనర్ వరకు ఇలా అనేక రకాల పోస్టులలో ఇతర విభాగాల వారిని డిప్యూటేషన్ మీద తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. సొంత శాఖలో అధికారులప్రయోజనాలు కాపాడేందుకు గతంలోనే డిప్యూటేషన్ల ప్రక్రియను రద్దు చేస్తూ మంత్రి సురేఖ నిర్ణయం తీసుకున్నారు. ఆమె నిర్ణయాన్ని పక్కనపెట్టి కొంతమంది ఉన్నతాధికారులు పంచాయతీరాజ్, మున్సిపాలిటీ, రెవెన్యూవిభాగాలలో పనిచేస్తున్న వారిని.. దేవాదాయ శాఖలకు తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.సచివాలయం స్థాయిలో దస్త్రాలు కదులుతున్న నేపథ్యంలో దేవాదాయ శాఖ ఉద్యోగుల జేఏసీ తీవ్రస్థాయిలో ఆగ్రహంవ్యక్తం చేస్తోంది. సంవత్సరాలుగా ఒకే హోదాలో పనిచేసిన తమకు ఉద్యోగ ఉన్నతి కల్పించకుండా.. ఇతర శాఖల సిబ్బందితో భర్తీ చేయడం ఎంతవరకు సమంజసమని జేఏసీ ఆరోపిస్తున్నారు. సీనియార్టీ ఉన్నప్పటికీ పదోన్నతి కల్పించకుండా.. సర్వీస్ రూల్స్ అమలు చేయడం లేదని ఉద్యోగుల జేఏసీ ఆరోపిస్తోంది. కాగా, ముఖ్య కార్యదర్శి నుంచి డైరెక్టర్ కు లేఖ రావడంతో దేవాదాయ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మరి దీనిపై మంత్రి సురేఖ ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో చూడాల్సి ఉంది.


02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు'
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244


## హత్యాయత్నం కేసు..
## నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష

**పరకాల, జనవరి 21 పెన్ పవర్:** నర్సాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో, ఇవ్వాల్సిన డబ్బులు అడిగిన వ్యక్తిపై దాడి చేసి చంపడానికి ప్రయత్నించిన శివప్రసాద్‌కి ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 5 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సుభావళి తీర్పునిచ్చారు. ఆటో డ్రైవర్ వద్ద నిరంజన్ కల్లు తాగడానికి కల్లు దుకాణానికి వెళ్లగా, అక్కడ శివప్రసాద్‌ను డబ్బులు అడగడంతో గొడవ జరిగింది. దీంతో శివప్రసాద్ కల్లు సీసాతో నిరంజన్‌పై దాడి చేశాడు. ఈ ఘటనలో నిందితుడికి శిక్ష పడినట్లు ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.

## సర్పంచ్ ఆదర్శ్ హామీ నెరవేర్చారు:
## కోతుల బెడదకు పరిష్కారం

**మెదక్, జనవరి 21 పెన్ పవర్:** మెదక్ జిల్లా, వెల్దుర్తి మండలంలో బీజేపీ బలపరిచిన అభ్యర్థి దండెం ఆదర్శ్, ఎన్నికల్లో గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చారు. ప్రధాన సమస్యగా ఉన్న కోతుల బెడదను పరిష్కరిస్తానని మాట ఇచ్చి, వందల సంఖ్యలో కోతులను పట్టించారు. సర్పంచ్ గా గెలిచిన తర్వాత కూడా ఈ సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తానని, మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని ఆదర్శ్ అన్నారు. ఈ సంఘటన మెదక్ జిల్లా, నర్సాపూర్ నియోజకవర్గంలో జరిగింది.

## అప్పుల ఊబిలో రైతు బలి?

**నర్సాపూర్, జనవరి 21 పెన్ పవర్:** కౌడిపల్లి మండలం బతుకమ్మ తండాకు చెందిన దేవసత్ సర్వేశ్ (48) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారు. వ్యవసాయ అవసరాల కోసం రెండు బోర్లు తవ్వించడంతో ఆయన తీవ్ర అప్పుల్లో కూరుకుపోయారు. అప్పులు తీర్చలేక మానసిక ఒత్తిడికి గురైన సర్వేశ్, ఈ నెల 11వ తేదీన గడ్డి మందు తాగారు. కుటుంబ సభ్యులు అతన్ని గాంధీ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

## ఎల్కతుర్తి మండల ఉపసర్పంచులు
## ఏకగ్రీవంగా ఎన్నిక



**హుస్నాబాద్, జనవరి 21 పెన్ పవర్:** హుస్నాబాద్ నియోజకవర్గం, హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తి మండల కేంద్రంలో బుధవారం రోజున, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుకిన సంతాజి, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పుల్లూరి శ్రీధర్ రావు ఆధ్వర్యంలో, ఎల్కతుర్తి మండలంలోని 11 గ్రామాల ఉపసర్పంచులు ఏకగ్రీవంగా దండపల్లి గ్రామానికి చెందిన శనిగరపు సందీప్ ను ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. గోపాల్ పూర్ గ్రామ ఉపసర్పంచ్ మారుపాక సందీప్ ఉపాధ్యక్షులుగా, బాబుపేట గ్రామ ఉపసర్పంచ్ మేకల బాబు గౌరవ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షులుగా ఎన్నికైన సందీప్, తమ అభివృద్ధికి కృషి చేస్తానని, సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## కొత్తూరులో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం:
## యువత క్రీడల్లో రాణించాలి

**సిద్దిపేట, జనవరి 21 పెన్ పవర్:** సిద్దిపేట జిల్లా ములుగు మండలం కొత్తూరు గ్రామంలో బుధవారం క్రికెట్ టోర్నమెంట్ ను సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్ష రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శరీర దృఢత్వాన్ని, ఆలోచనా శక్తిని పెంచుతాయని అన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని ఆమె పిలుపునిచ్చారు.


## వడ్డీ లేని రుణాలు, చీరల పంపిణీ:
## వనపర్తిలో మహిళలకు శుభవార్త

**వనపర్తి, జనవరి 21 పెన్ పవర్:** వనపర్తి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పాల్గొన్నారు. ఇందిరా మహిళా శక్తిలో భాగంగా చీరలు పంపిణీ చేశారు.

## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి:

**దేవరకద్ర, జనవరి 21 పెన్ పవర్:** వనపర్తి జిల్లా, ఆత్మకూరులో బుధవారం రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా సీఐ శివకుమార్ ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని, వాహన పత్రాలు వెంట ఉంచుకోవాలని, ప్రతి వాహనానికి బీమా చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

# కాళేశ్వరం రిపేర్లు సాధ్యమేనా..



**కరీంనగర్ జనవరి 21, పెన్ పవర్:** కాళేశ్వరం లో బ్యారేజీల మరమ్మతులు ఇప్పట్లో జరిగేలా కనిపించడం లేదు. అసలు జరుగుతాయో లేదో కూడా అర్థం కావడం లేదు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల లో లోపాలు బయటపడ్డాయి. వీటికి మరమ్మతులు చేయడానికి నిర్మాణ సంస్థలు ముందుకు రావడం లేదు. పైగా ఇప్పుడు ఆ సంస్థలు సర్కార్ తోనే న్యాయపోరాటానికి దిగుతున్నాయి.కాళేశ్వరం లో బ్యారేజీలను నిర్మించారు. అయితే వీటిని రిజర్వాయర్లుగా ఉపయోగించడం వల్లే ఈ సమస్య ఏర్పడిందని నిర్మాణ సంస్థలు వాదిస్తున్నాయి. మరోవైపు బ్యారేజీల డిజైన్ల లోనే లోపాలు ఉన్నాయని.. బ్యారేజీలను రిజర్వాయర్లుగా ఉపయోగించడం వల్లే కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో లోపాలు బయటపడ్డాయని.. మాజీ ముఖ్యమంత్రి నిర్ణయాల వల్ల ఇవన్నీ జరిగాయని వివిధ నివేదికలు బయటపెట్టాయి. ఇదే విషయాన్ని నిర్మాణ సంస్థలు బలంగావాదిస్తున్నాయి. " ఇందులో మా బాధ్యత లేదు. మేము చేసిన తప్పు కూడా లేదు. ప్రభుత్వం క్రిమినల్ కేసులు పెడితే లొంగేది లేదు. మేడిగడ్డ నుంచి మొదలు పెడితే సుందిళ్ల వరకు మరమ్మతు, పునరుద్ధరణ..ఇలా ఏ పనులు చేయాలన్నా సరే కొత్తగా ఒప్పందాలు కుదుర్చుకోవాల్సిందేనని" నిర్మాణ సంస్థలు చెబుతున్నాయి.మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యం కావడంతో.. దానికి నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టి కారణమని.. సొంతనిధులతో ఆ బ్యారేజీకి మరమ్మతు చేయకపోతే క్రిమినల్ కేసులు పెడతామని ప్రభుత్వం హెచ్చరించింది. అంతేకాదు నోటీసులు కూడా పంపింది. మిగతా బ్యారేజీలు నిర్మించిన సంస్థలకు కూడా ప్రభుత్వం ఇదేవిధంగానోటీసులు పంపించింది. మేడిగడ్డలో సమస్య తీవ్రత అధికంగా ఉంది. అన్నారం, సుందిళ్ల లో మాత్రం చిన్న చిన్న సమస్యలు ఉన్నాయి.. అన్నారంలో గేట్ల నుంచి విడుదలయ్యే వరద విస్తరణకు.. ఇతర రక్షణ చర్యలుతీసుకుంటే బ్యారేజీ పూర్వస్థితికి వస్తుందని అధికారులు చెబుతున్నారు. సుందిళ్ల ప్రాంతంలో సీ పేజీ కట్టడి చేస్తే బ్యారేజీ వినియోగంలోకి వస్తుంది.మేడిగడ్డతోనే ప్రభుత్వానికి ఇబ్బందికరమైన వాతావరణం ఏర్పడింది.దీనిని నిర్మించిన ఎల్ అండ్ టీ సంస్థ మీద క్రిమినల్ కేసులు పెట్టి.. బ్యారేజ్ కి సంబంధించిన పునరుద్ధరణ వ్యయం మొత్తం ఆ సంస్థ నుంచి రాబట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో జరిగినఅవకతవకలకు సంబంధించి ప్రభుత్వ నియమించిన జస్టిస్ పినాకి చంద్ర గోష్ కమిషన్ కూడా ఇదే విషయాన్ని వెల్లడించింది. దీనికంటే ముందు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విభాగం కూడా ఇదే విషయాన్నిప్రకటించింది. అయితే బ్యారేజ్ లు నిర్మించిన సంస్థలు సర్కార్ కు వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధం కావడంతో అధికారులు తలలు పట్టుకున్నారు. మరోవైపు తుమ్మిడి హెట్టి వద్ద బ్యారేజ్ నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది.కాళేశ్వరం లో బ్యారేజీల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. కాగా, ప్రభుత్వం బ్యారేజీ నిర్మాణం పూర్తయిందని.. సర్టిఫికెట్లు జారీ చేసింది. డిఫెక్ట్ లయబులిటీ కాలం కూడా గతప్రభుత్వ హయాంలోనే పూర్తయింది. దీంతో నిర్మాణ సంస్థలతోనే బ్యారేజీలకు మరమ్మతులు చేయించే దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారని తెలుస్తోంది

## రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ రగ్బీ పోటీలకు
# రైజింగ్ సన్ పాఠశాల విద్యార్థి

**పెద్దపల్లి: పెన్ పవర్:** కరీంనగర్ లోని అంబేద్కర్ క్రీడా మైదానంలో గత నవంబర్ నెలలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి రగ్బీ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినరైజింగ్ సన్ పాఠశాల విద్యార్థి వికాస్ ఎంపికైనట్లువ్యాయా మ ఉపాధ్యాయుడు తగరం తిరుపతి తెలియజేశారు. ఈ మేరకు ఈ నెల 22 నుండి 24 వరకు మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ జిల్లా పరిషత్ హై స్కూల్ లో జరిగే రాష్ట్ర స్థాయి అండర్ 14 పోటీలలోపాల్గొననున్నాడు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాల కరస్పాండెంట్ సయీద్ అహ్మద్, ప్రధానోపా ధ్యాయులు హాకీమ్ ఖాన్ విద్యార్థులను అభినందించా రు. జాతీయ స్థాయిలో కూడా రాణించి మంచి పేరు ప్రతిష్టలుతీసుకురావాలని కోరారు.




# అన్నీ వున్నా భూములకు కంచె వేసారు

**కుత్బుల్లాపూర్ పెన్ పవర్:** నిజాంపేట్ సర్కిల్ బాచుపల్లి లోని సర్వే నెంబరు 142, 143 ,144 లో దాదాపు 3 ఎకరాల భూమి తమ భూమిని కనీస సమాచారం లేకుండా,నోటీసులు ఇవ్వకుండా తమ భూమిలో కంచెను కూల్చి,హైడ్రా అధికారులుఆక్రమైంచకున్నారని స్పీడ్ విద్యుత్ వెంచర్ నిర్వహకులు ఆరోపించారు. ఈ చర్యలపై ఎం/స్. స్పీడ్ విద్యుత్ వెంచర్ ప్రైవేట్ లిమిటెడ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. తమ భూములు అర్బన్ ల్యాండ్ సీలింగ్ (ఖూజ)పరిధిలోకి రావని, చట్టబద్ధంగా కొనుగోలు చేసిన ప్రైవేట్ పట్టా భూములేనని సంస్థ స్పష్టం చేసింది.సర్వే నెంబర్లు 142/ఆ, 143/ఆ, 144/ఆలలో ఉన్న సుమారు 20 ఎకరాలు 14 గుంటల భూమిని తామురిజిస్ట్రేషన్ చేసిన సేల్ డీడ్లు మరియు సేల్ అగ్రిమెంట్‌కమ్‌జీపీయేల ద్వారా చట్టబద్ధంగా కొనుగోలు చేశామని సంస్థ తెలిపింది. ఈ భూములపై ప్రభుత్వానికి ఎలాంటి హక్కు లేదని, జిల్లా కలెక్టర్ కార్యాలయం జారీ చేసిన యూఎల్సీ స్పష్టీకరణలు దీనిని నిర్ధారిస్తున్నాయని పేర్కొంది.ఈ భూములపై గతంలో హైకోర్టులో విచారణ జరిగిందని, హైకోర్టు ఉత్తర్వుల మేరకు 27 జనవరి 2026న సంయుక్త సర్వే జరగాల్సి ఉండగా,ఆ సర్వే పూర్తయ్యేలోపే హైడ్రా ఫీల్డ్ అధికారులు ముందస్తు నోటీసు లేకుండా భూమిలోకి ప్రవేశించి తమ ఫెన్సింగ్ను తొలగించి, హూడ్రా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారని సంస్థ ఆరోపించింది. తాము టైటిల్ డాక్యుమెంట్లు,యూఎల్సీ స్పష్టీకరణలు చూపించినప్పటికీ వాటిని పరిగణనలోకి తీసుకోకుండా చర్యలు చేపట్టడం చట్ట విరుద్ధమని స్పీడ్ విద్యుత్ వెంచర్ పేర్కొంది. హైడ్రా ఈ చర్యలను తక్షణమే పునఃపరిశీలించాలని, తమ ఫెన్సింగ్ను తొలగించి తిరిగి సంస్థకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకునే అవకాశం ఇవ్వాలని సంస్థ డిమాండ్ చేసింది.

# సునీతకు వరంగల్ దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ పదోన్నతి

**వరంగల్ వెస్ట్, జనవరి 21 పెన్ పవర్:** వరంగల్ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా సేవలందిస్తున్న శ్రీమతి ఆర్. సునీతను ప్రభుత్వం వరంగల్ డిప్యూటీ కమిషనర్ (ఈంఅ) గా నియమించింది. ఈ నియామకం ద్వారా పరిపాలనాపరమైన చిక్కుముడులను తొలగించి, వ్యవస్థను గాడిలో పెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. సునీత గారు వరంగల్ జిల్లాలోని చారిత్రాత్మక దేవాలయాల అభివృద్ధి, ధూప దీప నైవేద్యాల నిర్వహణ, భక్తులకు కనీస వసతుల కల్పనలో తనదైన ముద్ర వేస్తారని ఆశిస్తున్నారు. ఆమె సమర్థవంతమైన నాయకత్వంతో వరంగల్ దేవాదాయ శాఖను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతారని భక్తులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

# మున్సిపల్ ఎన్నికల బరిలో కవిత



**హైదరాబాద్, జనవరి 21, పెన్ పవర్:** బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన కల్వకుంట్ల కవిత.. కొత్త పార్టీ ఏర్పాటు దిశగా కసరత్తు ముమ్మరం చేస్తున్నారని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌తో వరుస సమావేశాలునిర్వహిస్తున్నారని ప్రచారం జరిగింది. త్వరలోనే కొత్త రాజకీయ పార్టీ ప్రకటించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో.. తెలంగాణజాగృతి నేతలు బరిలోకి దిగే అవకాశం ఉందని.. ఈ మేరకు కవిత కసరత్తు చేస్తున్నారని వార్తలు వస్తున్నాయి.బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన కల్వకుంట్ల కవిత.. కొత్త పార్టీ ఏర్పాటు దిశగా కసరత్తు ముమ్మరంచేస్తున్నారని వార్తలు వస్తున్నాయి. అందులో భాగంగా రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌తో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రచారం జరిగింది. త్వరలోనే కొత్త రాజకీయ పార్టీ ప్రకటించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో మరో వార్త రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో కూడా.. కవిత నేతృత్వంలోని తెలంగాణ జాగృతి బరిలోకిదిగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే మేయర్లు, చైర్‌పర్సన్ల రిజర్వేషన్లు ఖరారయ్యాయి. మొత్తం పదవుల్లో 50 శాతాన్ని మహిళలకు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికల్లో జాగృతి నేతలు బరిలో దిగుతారని వార్తలు వస్తున్నాయి. ఆశావహులతో హైదరాబాద్‌లోని తన నివాసంలో కవిత భేటీఅయినట్లు సమాచారం. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు.. ఇతర అంశాలపై కవిత చర్చించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఈ మున్సిపల్ ఎన్నికల్లో నిజామాబాద్‌లో 20- 30 స్థానాల్లో జాగృతి అభ్యర్థులుబరిలోకి దిగే అవకాశాలు ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.కాగా, తెలంగాణ జగృతి అభ్యర్థులు సింహం గుర్తుపై బరిలోకి దిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల్లో పోటీపై కవిత గానీ,తెలంగాణ జాగృతి ప్రతినిధులు గానీ అధికారికంగా ప్రకటించలేదు. వారు అధికారికంగా వెల్లడిస్తేనే ఈ వార్తలపై ఒక క్లారిటీ వస్తుంది. అయితే ఎన్నికలకు ముందే ప్రజల్లో గుర్తింపు పొందాలన్న వ్యూహంతోనే కవిత ఇలాంటినిర్ణయం తీసుకునే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో తాము పోటీ చేస్తామని జనసేన పార్టీ ప్రకటించింది. ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించామని తెలిపింది.సాధ్యమైనన్ని స్థానాల్లో పోటీ చేస్తామని తెలిపింది. ఇప్పుడు జాగృతి కూడా ఇదే విధంగా అడుగులు వేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో ఈసారి జరగనున్న తెలంగాణ మున్సిపల్ ఎన్నికలపై ఆసక్తి నెలకొంది.అయితే జనసేన, జాగృతి వల్ల ఎవరి ఓటు బ్యాంకుకు గండిపడుతుంది.. ఏ పార్టీపై ప్రభావం చూపిస్తుందని ప్రజల్లో చర్చ మొదలైంది.కాగా, తెలంగాణ మున్సిపల్ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవలమార్గదర్శకాలు విడుదల చేసింది. అభ్యర్థుల అర్హతలు, నామినేషన్ పత్రాలు, డిపాజిట్ వివరాలు, వ్యయ పరిమితులపై క్లారిటీ ఇచ్చింది. కార్పొరేషన్‌లలో పోటీ చేసే అభ్యర్థులకు రూ. 10 లక్షలు, మున్సిపాలిటీలకు రూ.5 లక్షల వ్యయ పరిమితి విధించింది. అంతేకాకుండా ప్రత్యేక బ్యాంకు ఖాతా తప్పనిసరి చేసింది.

# 3 జిల్లాలో 6 అర్బన్ ఫారెస్టులు



**హైదరాబాద్, జనవరి 21, పెన్ పవర్:** తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 'నగర్ వన్ యోజన' కింద రాష్ట్రంలోని మూడు జిల్లాల్లో 6 అర్బన్ ఫారెస్టుల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. వీటి అభివృద్ధికి రూ. 8.26 కోట్లు మంజూరు చేసింది.పట్టణాల్లో పచ్చదనం పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. కాగా, పట్టణాల్లో ఏర్పాటు చేయబోయే ఈ వనాలల్లో స్థానిక వృక్ష జాతులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలంగాణ అటవీ శాఖఅధికారులు తెలిపారు.తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. తెలంగాణలోని మూడు జిల్లాల్లో 6 అర్బన్ ఫారెస్ట్‌లు అభివృద్ధి చేయడానికి ఆమోదం తెలిపింది. ఈ మేరకు 'నగర్ వన్ యోజన' కింద రాష్ట్రానికిరూ. 8.26 కోట్లు మంజూరు చేసింది. అర్బన్ ఫారెస్టుల ఏర్పాటకు సంబంధించి విడతల వారీగా నిధులు విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. అందులో భాగంగా తొలివిడతలో 70 శాతం నిధులు విడుదల చేసింది.ఈ మేరకు తెలంగాణ అటవీ శాఖ అధికారులు వివరాలు వెల్లడించారు.పట్టణ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంచడానికి కేంద్ర ప్రభుత్వం.. నగర్ వన్ యోజన పథకాన్ని 2020 జూన్ 5న ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది.పట్టణాల పరిధిలో అర్బన్ ఫారెస్ట్‌ల ఏర్పాటు ద్వారా.. పర్యావరణ సమతుల్యత కాపాడడం, కాలుష్యాన్ని తగ్గించడం ప్రజలకు ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కాగా, మొదటిఐదేళ్లలో 200 పట్టణాల్లో అర్బన్ ఫారెస్టులను అభివృద్ధి చేయాలని టార్గెట్ పెట్టుకుంది. ఇప్పుడు 1000 నగరాల్లో వీటిని అభివృద్ధి చేయాలని కేంద్రం భావిస్తోంది. అందులో భాగంగా తాజాగా తెలంగాణలో 6 అర్బన్‌ఫారెస్టులకు ఆమోదం తెలిపింది.మరోవైపు, పట్టణాల్లో నగర్ వన్ యోజన కింద ఏర్పాటయ్యే అర్బన్ ఫారెస్ట్‌లల్లో.. స్థానిక వృక్ష జాతికి చెందిన మొక్కలకు ప్రాధాన్యం ఇస్తున్నారని అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఇవిఅర్బన్ ప్రజలకు ప్రకృతిలో గడిపిన అనుభూతిని అందిస్తాయని చెప్పారు. ఈ పట్టణ వనాల్లో వాకింగ్ ట్రాక్‌లు, విశ్రాంతి కేంద్రాలు, పచ్చని మైదానాలు ఏర్పాటు చేయనున్నారు.ఆదిలాబాద్, మంచిర్యాల, మేడ్చల్-మల్కాజ్‌గిర్ జిల్లాలో ఈ 6 అర్బన్ ఫారెస్టులను అభివృద్ధి చేయనున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో మావళా, యాపల్‌గూడ×× పట్టణాల్లో అర్బన్ ఫారెస్టులు ఏర్పాటు కానున్నాయి. ఇక మంచిర్యాల జిల్లాలో ఇందారం(క్యాతనపల్లి మండలం), చెన్నూర్‌లలో ఏర్పాటు చేస్తారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో యెల్లంపేట, చెంగిచెర్లలో పట్టణ వనాలు అభివృద్ధి చేయనున్నారు.మరోవైపు, తెలంగాణలో 9 జిల్లాల్లోని మున్సిపాలిటీలపరిధిలో.. 14 అర్బన్ ఫారెస్టులను ఏర్పాటు చేయనున్నట్లు 2025 డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఒక్కో పార్కుకు రూ. 2 కోట్ల చొప్పున.. రూ. 28 కోట్లను కేటాయించింది. తాజాగా మూడు జిల్లాలోఆరు పట్టణ వనాలకు నిధులు విడుదల చేసింది. మిగతా వికారాబాద్ (4), భూపాలపల్లి (1), కొత్తగూడెం (1), జగిత్యాల (1), పెద్దపల్లి (1) జిల్లాలోని పట్టణ వనాలకు నిధులు మంజూరు చేయాల్సి ఉంది.

# మరో ప్రాజెక్టు కోసం 4,200 ఎకరాల భూసేకరణ

**మహబూబ్ నగర్ జనవరి 21, పెన్ పవర్:** కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టు కోసం 4,200 ఎకరాల భూసేకరణకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. లక్ష ఎకరాలకు సాగునీరు అందించే ఈపథకానికి త్వరలోనే పర్యావరణ అనుమతులు లభించే అవకాశం ఉంది. రూ.4,885 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టు పనులు వేగవంతం కానున్నాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణం ద్వారా వికారాబాద్, నారాయణపేట జిల్లాలోని పలు మండలాలకు సాగు నీరు అందించనున్నారు.ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో నిర్మించ తలపెట్టిన కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలకనిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టు కోసం 4,200 ఎకరాల భూసేకరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలోనే ఈ పథకానికి పర్యావరణ అనుమతులు జారీ అయ్యే అవకాశం ఉంది. దీనికోసం రాష్ట్రస్థాయిపర్యావరణ ప్రభావ మదింపు మండలి హైదరాబాద్‌లో సోమవారం సమావేశమైంది. గతంలో జరిగిన బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నివేదికలను పరిశీలించి, ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఎత్తిపోతల పథకం ద్వారా లక్షఎకరాలకు సాగునీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.ఈ ఎత్తిపోతల పథకం పూర్తయితే.. వికారాబాద్, నారాయణపేట జిల్లాల పరిధిలోని కోస్గి, నారాయణపేట, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, కొడంగల్, ధన్వాడ, ఊట్కూరు, మక్తల్, మద్దూర్, దామరగిద్ద మండలాల్లోని భూములకు సాగు నీరందుతుంది. భూసేకరణలో భాగంగా ఎకరాకు గరిష్ఠంగా రూ. 20 లక్షల పరిహారం చెల్లించనున్నట్లు ఇంజినీర్లు ???కు తెలిపారు. ఈప్రాజెక్టు కోసం 4,425 చెట్లను తొలగించాల్సి ఉంది. అలా తొలగించిన చెట్ల స్థానంలో కాలువలు, చెరువుకట్టలపై పదింతల చెట్లను పెంచుతామని అధికారులు హామీ ఇచ్చారు.ఈ ఎత్తిపోతల పథకం కోసం రూ.4,885 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇంత భారీ మొత్తంతో నిర్మిస్తున్న ఈ పథకంలో 209 మెగావాట్ల సామర్థ్యం గల పంపులను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పంపుహౌస్‌లు,ప్రెజర్ మెయిన్ల నిర్మాణానికి ప్రభుత్వం టెండర్లు పిలిచి, పనులు అప్పగించింది. పర్యావరణ అనుమతులు మంజూరై, భూసేకరణ పూర్తయితే.. ప్రాజెక్టు నిర్మాణ పనులు శరవేగంగా ముందుకు సాగుతాయి.డిసెంబర్ 8నకాలుష్య నియంత్రణ మండలి, నీటిపారుదల శాఖలు ఈ ప్రాజెక్టు పరిధిలోని రెండు ప్రాంతాల్లో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ సభలు నిర్వహించాయి. ఆ నివేదికల ఆధారంగానే ??? సమావేశం జరిగింది. ఇంజినీర్లఅంచనా ప్రకారం, కొద్దిరోజుల్లోనే పర్యావరణ అనుమతులు జారీ అయ్యే అవకాశాలున్నాయి. ఆ వెంటనే భూసేకరణ జరిపి.. పనులు వేగవంతం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

# మార్కండేయ జయంతి: పద్మశాలీల కులదైవానికి ఘన నివాళి



**రాజేంద్రనగర్, జనవరి 21 పెన్ పవర్:** రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ లోని మైలర్ దేవ్ పల్లి డివిజన్ లో బుధవారం పద్మశాలీల కులదైవం మార్కండేయ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ట్రస్ట్ మాజీ చైర్మన్ కాశీగారి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మార్కండేయ చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కాశీగారి మాట్లాడుతూ, మార్కండేయ మహర్షి లోక కల్యాణానికి ఆదర్శప్రాయుడని, భక్తితో స్మరిస్తే ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని కొనియాడారు. యువత మార్కండేయ మహర్షి చూపిన ధర్మమార్గంలో నడవాలని యాదగిరి సూచించారు. కుల బాంధవులంతా ఏకమై సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుంటూ ఉత్సవాలు జరుపుకోవడం సంతోషకరమని తెలిపారు.

# దోపిడీ దొంగల బీభత్సం

**మల్కాజ్‌గిరి, జనవరి 21 పెన్ పవర్:** హైదరాబాద్‌లోని లాలాగూడలో దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. అడ్డగుట్టలోని హరిహంత్ సదన్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు, గాజులను దుండగులు లాక్కెళ్లారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్ లో అప్పుల ఊబి: యువకుడి ఆత్మహత్య

**మహేశ్వరం, జనవరి 21 పెన్ పవర్:** ఆన్‌లైన్ బెట్టింగ్ లకు బానిసై అప్పుల పాలైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. నందనవనం ప్రాంతానికి చెందిన కోట్ల లక్ష్మీకాంత్ (24) అనే యువకుడు బెట్టింగ్ లలో లక్షల్లో నష్టపోయి తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఇంట్లోని బాత్రూంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పిస్తున్నా ఆన్ లైన్ గేమ్స్ కు బానిసలయ్యే వారి సంఖ్య పెరుగుతూనే ఉంది.

# బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కృష్ణారెడ్డి గుండెపోటుతో మృతి

**ఖమ్మం, జనవరి 21 పెన్ పవర్:** సింగరేణి మండలం గాదెపాడు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దాచేపల్లి కృష్ణారెడ్డి (60) బుధవారం మధ్యాహ్నం గుండెపోటుతో మరణించారు. ఉదయం నుంచి ఛాతీలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఇల్లెందు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కృష్ణారెడ్డి మృతితో గాదేపాడు పరిసర గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. సమాచారం తెలుసుకున్న ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తదితరులు కృష్ణారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

# వైరా మున్సిపల్ ఎన్నికలు: రాజకీయ సమీకరణాలు వేడెక్కాయి

**వైరా, జనవరి 21 పెన్ పవర్:** ఖమ్మం జిల్లాలోని వైరాలో మున్సిపల్ ఎన్నికల పోరు రసవత్తరంగా మారింది. కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీలు ఓటర్లను ఆకట్టుకునేందుకు వ్యూహరచనలో నిమగ్నమయ్యాయి. టీడీపీ, బీజేపీ, వామపక్ష పార్టీలు పొత్తులతో ముందుకు వెళ్తాయా లేక ఒంటరిగా పోటీ చేస్తాయా అనే దానిపై ఆసక్తి నెలకొంది. రిజర్వేషన్ల ఖరారుతో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. వామపక్షాలు ఏ పార్టీతో జత కడతాయోనని ఓటర్లలో ఉత్కంఠ నెలకొంది. ఈ ఎన్నికల నేపథ్యంలో వైరాలో రాజకీయ వేడి రాజుకుంది.

# రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత




**సత్తుపల్లి, జనవరి 21 పెన్ పవర్:** సత్తుపల్లి బస్ స్టాండ్‌లో 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై సీఐ తుమ్మలపల్లి శ్రీహరి అవగాహన కల్పించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో, ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. రోడ్డు భద్రతా నియమాలను అందరూ బాధ్యతగా పాటిస్తూ, ప్రమాదాలను నివారించి ప్రాణ నష్టాన్ని తగ్గించాలని ఆయన సూచించారు.

# బోటి తండా సర్పంచ్ తులసీరామ్ కన్నుమూత: రాజకీయ ప్రముఖుల సంతాపం

**మధిర, జనవరి 21 పెన్ పవర్:** ఖమ్మం జిల్లా, వైరా నియోజకవర్గం సింగరేణి మండలం బోటి తండా సర్పంచ్ భూక్యా తులసీరామ్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన మృతితో బోటి తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. వైరా మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్, మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ మాళోత్ శకుంతల, మాజీ బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అజ్మీర వీరన్న, సర్పంచులు కిషోర్, మౌనిక, శంకర్ తదితరులు తులసీరామ్ భౌతికకాయాన్ని సందర్శించి, పూలతో నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## గాంధీనగర్ లో ఉచిత పశువైద్య శిబిరం: గర్భకోశ వ్యాధులకు చికిత్స

**పాలేరు, జనవరి 21 పెన్ పవర్:** ఖమ్మం జిల్లా సింగరేణి మండలం గాంధీనగర్ గ్రామంలో బుధవారం గర్భకోశ వ్యాధి నివారణకు ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పశువులకు గర్భకోశ వ్యాధులను పరీక్షించి, వైద్యం అందించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి మండల పశువైద్యాధికారి జి. ఇందిరా, గోపాలమిత్ర సూపర్వైజర్ కె. వెంకటేష్, గోపాలమిత్రులు సురభి శ్రీకాంత్, రేగళ్ల మంగయ్య, రైతులు పాల్గొన్నారు.

## మేడారంలో భక్తులకు గాయాలు, స్వల్ప అపశ్రుతి

**ములుగు, జనవరి 21 పెన్ పవర్:** మేడారంలో సమ్మక్క, సారలమ్మ దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులతో గద్దెల వద్ద రద్దీ నెలకొంది. అమ్మవారి గద్దెల వద్దకు వెళ్లలేని కొందరు భక్తులు దూరం నుంచి కొబ్బరికాయలు విసరడంతో ఐదుగురు భక్తులు గాయపడ్డారు. రక్తస్రావం కావడంతో అక్కడి రెస్క్యూ సిబ్బంది వారికి చికిత్స అందించారు. ఈ సంఘటన స్వల్ప అపశ్రుతిగా పరిగణించబడుతోంది.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: స్పెషల్ ఆఫీసర్ నీరజ



**వర్ధన్నపేట, జనవరి 21 పెన్ పవర్:** పర్వతగిరి మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాలలో ప్రిన్సిపల్ పి అపర్ణ అధ్యక్షతన స్ఫూర్తి కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్పెషల్ ఆఫీసర్ మాటేటి నీరజ, మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని, దాని అమలులో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. మత్తు పదార్థాల వల్ల ఆలోచనా శక్తి, ప్రవర్తన దెబ్బతింటాయని, కుటుంబంలో ఎవరైనా వాడితే ఖండించాలని తెలిపారు. లక్ష్య సాధనకు ప్రణాళిక, క్రమశిక్షణ, కష్టపడి పనిచేయాలని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపల్ అపర్ణ విద్యార్థులను కొత్త ఆవిష్కరణలు చేసి పేటెంట్ పొందే స్థాయికి ఎదగాలని ప్రోత్సహించారు. అనంతరం నీరజ విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డిపై ఏసీబీ దాడులు

**వరంగల్ ఈస్ట్, జనవరి 21 పెన్ పవర్:** వరంగల్ జిల్లా హన్మకొండ అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డిపై ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టినట్లు వచ్చిన ఆరోపణలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బుధవారం ఉదయం సోదాలు చేపట్టారు. ఆయన నివాసంతో పాటు తెలంగాణ వ్యాప్తంగా పది చోట్ల తనిఖీలు కొనసాగుతున్నాయి. హైదరాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, హన్మకొండలోని ఇళ్లు, కార్యాలయాల్లో ఏసీబీ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. ఈ సోదాల్లో నగదు, బంగారం, ఆస్తి పత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ప్రాథమిక విచారణ అనంతరం కేసు నమోదు చేసి సోదాలు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# అభివృద్ధికి పార్టీలకు అతీతంగా కృషి: ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**ఆదిలాబాద్, జనవరి 21 పెన్ పవర్:** బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తలమడుగు మండలంలోని సుంకిడి గ్రామంలో అయ్యప్ప ఆలయంలో రూ. 15 లక్షల వ్యయంతో నిర్మించిన షెడ్డును ప్రారంభించారు. అలాగే, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో రూ. 15.50 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్టీలకు అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని, పిల్లలు చదువుల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మంత్రి సీతక్క కేస్లాపూర్ నాగోభ దేవాలయంలో ప్రత్యేక పూజలు



**బోథ్, జనవరి 21పెన్ పవర్:** రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క రాత్రి ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోభ దేవాలయాన్ని దర్శించుకున్నారు. అక్కడ నాగోభ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి సీతక్కతో పాటు జిల్లా కలెక్టర్ రాజర్షిష, ఎస్పీ అఖిల్ మహాజన్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు కూడా ఆలయాన్ని సందర్శించి పూజల్లో పాల్గొన్నారు. నాగోభ దేవత ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రానికి అభివృద్ధి, శాంతి సమృద్ధి కలగాలని మంత్రి సీతక్క, ఆత్రం సుగుణక్క ప్రార్థించారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు కేస్లాపూర్ నాగోభ దేవాలయం ప్రతీకగా నిలుస్తోందని, ఇలాంటి పుణ్యక్షేత్రాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని నేతలు తెలిపారు.

# సీఎం కప్ లో డ్యాంగపూర్ జట్టు విజయం

**నిర్మల్, జనవరి 21పెన్ పవర్:** నిర్మల్ జిల్లా కేంద్రంలోని డ్యాంగపూర్ గ్రామంలో సీఎం కప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో డ్యాంగపూర్, రానాపూర్ జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. చివరికి, డ్యాంగపూర్ జట్టు విజేతగా నిలిచి బహుమతిని కైవసం చేసుకుంది. ఈ కార్యక్రమంలో డ్యాంగపూర్, రానాపూర్ సర్పంచులు నవీన్ నెహ్రూ, ఉప సర్పంచ్ హరీష్, వార్డు సభ్యులు పోశెట్టి, నాయకులు చిన్నయ్య, భీమేష్, పంచాయతీ కార్యదర్శులు సాయికృష్ణ, ప్యారీ లాల్, గ్రామస్తులు పాల్గొన్నారు. సీఎం కప్ పోటీలు డ్యాంగపూర్ లో జరిగాయి.

# పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ మహర్షి జయంతి వేడుకలు

**ముథోల్, జనవరి 21పెన్ పవర్:** నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని నగర్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బుధవారం శ్రీ మార్కండేయ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు ఆడెపు సుధాకర్, ప్రధాన కార్యదర్శి జల్ల రాజేశ్వర్, నిర్మల్ జిల్లా అధ్యక్షులు చిలుక రమణ, నిర్మల్ జిల్లా పద్మశాలి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు బూర ఉమాశంకర్, ఎడెల్లి రాజేశ్వర్, మాన్పురి పోశెట్టి, చిప్ప గంగయ్యతో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా మార్కండేయ మహర్షి జయంతి

**ఖానాపూర్, జనవరి 21పెన్ పవర్:** సోన్ మండలం పాక్ పట్ల గ్రామంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బుధవారం శ్రీ భక్త మార్కండేయ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మార్కండేయ మహర్షి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తిమార్గంలోనే మోక్షం లభిస్తుందని మార్కండేయుడు నిరూపించారని ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు చిలారి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు సాయిచరణ్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

# కార్పొరేషన్ ప్రస్థానం!

**కరీంనగర్, జనవరి 21పెన్ పవర్:** కరీంనగర్ మున్సిపాలిటీ 1941లో ఏర్పడి, 2005 మార్చి 5న మున్సిపల్ కార్పొరేషన్‌గా రూపాంతరం చెందింది. ఇది మొదట థర్డ్ గ్రేడ్ మున్సిపాలిటీగా 1952లో ప్రారంభమై, 1959లో సెకండ్ గ్రేడ్, 1984లో ఫస్ట్ గ్రేడ్, 1996లో స్పెషల్ గ్రేడ్, 1999లో సెలక్షన్ గ్రేడ్ స్థాయికి చేరింది. సయ్యద్ కరీముద్దీన్ పేరు మీదుగా ఏర్పడిన ఈ సంస్థ, ఎలగందుల నుంచి జిల్లా కేంద్రంగా మారిన తర్వాత నగర పాలక సంస్థగా విస్తరించింది.

# జాతీయ ఓటర్ దినోత్సవం: అధికారులకు కలెక్టర్ ఆదేశాలు




**హుజూరాబాద్, జనవరి 21పెన్ పవర్:** ఈ నెల 25న జరగనున్న జాతీయ ఓటర్ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన సమావేశంలో, బూత్ స్థాయి పోలింగ్ అధికారులు వృద్ధ ఓటర్లను సన్మానించాలని కలెక్టర్ సూచించారు. ఈ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# వేములవాడ ఆలయంలో టెండర్ల సెగ!

**మానకొండూరు, జనవరి 21పెన్ పవర్:** వేములవాడ శ్రీ భీమేశ్వరాలయంలో కొబ్బరి ముక్కలు, పచ్చి గడ్డి, అరటి పండ్లు, పత్రి, బెల్లం, పూజా సామగ్రి విక్రయంతో పాటు లాకర్స్ నిర్వహణ హక్కుల కోసం పిలిచిన టెండర్లకు కాంట్రాక్టర్ల నుంచి స్పందన కరువైంది. వరుసగా రెండోసారి టెండర్లు పిలిచినా, ఆశించిన ఆదాయం రాకపోవచ్చనే భయంతో కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఆలయ అధికారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

# ఐలాపూర్ లో ఘనంగా మార్కండేయ జయంతి వేడుకలు



**ఆర్మూర్, జనవరి 21 పెన్ పవర్:** నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం ఐలాపూర్ గ్రామంలో శ్రీ భక్త మార్కండేయ జయంతి సందర్భంగా ఐలాపూర్ పద్మశాలి పెద్దల ఆధ్వర్యంలో మహాముని శ్రీ భక్త మార్కండేయ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో శోభాయాత్ర నిర్వహించి, అనంతరం అన్న సత్రం నిర్వహించారు. ఈ వేడుకలు నిజామాబాద్ జిల్లా, ఆర్మూర్ ప్రాంతంలో జరిగాయి. ఈ కార్యక్రమం జనవరి 21, 2026 నాడు జరిగింది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# 5 వేల కోట్ల కోసం 42 ఎకరాల భూమి అమ్మకం

**హైదరాబాద్, జనవరి 21, పెన్ పవర్:** హైదరాబాద్‌లో మరోసారి భూములు వేలం వేయడానికి తెలంగాణ ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. మూసాపేట, బంజారాహిల్స్, కొండాపూర్‌లో మొత్తం 42 ఎకరాలను వేలం వేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీని ద్వారా సుమారు రూ. 5 వేల కోట్లు సేకరించాలని టార్గెట్‌గా పెట్టుకుంది. దీనికి సంబంధించి హెచ్‌ఎండీఏ ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. అయితే గతంలో హైదరాబాద్‌లో జరిగిన భూముల వేలాల్లో రికార్డు ధరలు పలికాయి. దీంతో ఈసారి కూడా భారీ స్పందన వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో మరోసారి భూములు వేలం వేయడానికి సిద్ధమవుతోంది. మొత్తం 42 ఎకరాల భూమి వేలం వేయాలని నిర్ణయించింది. దీని ద్వారా దాదాపు రూ. 5 వేల కోట్లు సేకరించాలని టార్గెట్‌గా పెట్టుకుంది. కాగా, భాగ్యనగరంలో భూములు వేలం వేసిన ప్రతిసారి రికార్డు ధరలు పలుకుతున్నాయి. ఇటీవల కోకాపేటలో ఎకరం రూ. 151 కోట్లు పలికింది. అంతకుముందు రాయదుర్గంలో జరిగిన వేలంలో ఎకరం ఏకంగా రూ. 177 కోట్లు పలికి రికార్డు సృష్టించింది. ఈ తరుణంలో త్వరలో జరగబోయే వేలంలో ఎకరం ఎంత పలుకుతుంది అనేది ఆసక్తిగా మారింది. మూసాపేటలో 14 ఎకరాలు, బంజారాహిల్స్‌లో 8.37 ఎకరాలు, కొండాపూర్‌లో 20 ఎకరాల వేలం వేయడానికి హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) కసరత్తు చేస్తోంది. దాదాపు రెండు నెలల క్రితం కోకాపేటలో భూములు వేలం వేసినప్పుడే.. మూసాపేటలో భూములను కూడా విక్రయించాలనిలని ప్రభుత్వం భావించింది. అయితే భూములు వేలం వేయొద్దంటూ స్థానికులు, ప్రజాప్రతినిధుల నుంచి వ్యతిరేకత రావడం వల్ల.. ప్రభుత్వం వెనక్కి తగ్గింది. కాగా, ఆ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, రాత్రికి రాత్రే నిర్మాణాలు చేపడుతున్నారని అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడంతో మరోసారి ఈ భూముల వేలం మరోసారి తెరపైకి వచ్చింది. ఆ నివేదికను పరిశీలించిన ప్రభుత్వం.. స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చలు జరిపి భూములను వేలం వేసేందుకు ఆమోదం తెలిపింది. బంజారా హిల్స్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సుమారు 15 ఎకరాల వరకు ఉన్న భూమి.. చాలా వరకు కబ్జాకు గురైంది. ప్రభుత్వ స్థలంలోకి నిర్మాణాలు చొచ్చుకొచ్చాయి. దీంతో కొండ ప్రాంతాన్ని పక్కకు పెట్టి.. 8.37 ఎకరాలను విక్రయించాలని ప్రభుత్వం భావించింది. కొండాపూర్‌లో 20 ఎకరాలు, మూసాపేటలోని 14 ఎకరాలు కలిపి మొత్తం 42 ఎకరాలను ఆన్‌లైన్‌లో వేలం వేసేందుకు హెచ్‌ఎండీఏ కసరత్తు చేస్తోంది. మరోవైపు, హైదరాబాద్ ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధి చెందుతోంది. భారత్‌లోని టాప్ నగరాలతో పోటీ పడుతూ అత్యంత నివాసయోగ్యమైన ప్రాంతంగా గుర్తింపు పొందుతోంది. మౌలిక సదుపాయాలు, మానవవనరులు పుష్కలంగా ఉండటంతో.. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన సంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యాలయాలను ప్రారంభించడానికి ఆసక్తి చూపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారీ నిర్మాణ ప్రాజెక్టులు చేపట్టాలనుకునే సంస్థలకు భూములు దొరకడం కష్టంగా మారింది. ప్రైవేటు స్థలాలు వివిధ ప్రాంతాల్లో ఉన్నా.. విక్రయించడానికి యజమానులు ముందుకు రావడం లేదు. ఈ నేపథ్యంలో గతంలో టీజీఐఐసీ, హెచ్‌ఎండీఏలు వేలం వేసిన భూములకు మంచి రెస్పాన్స్ వచ్చింది. మూసాపేట, బంజారాహిల్స్, కొండాపూర్‌లో కూడా అలాంటి రెస్పాన్స్ వచ్చి.. రూ. 5 వేల కోట్ల టార్గెట్ చేరుకుంటామని ప్రభుత్వం భావిస్తోంది.

# బొంద రాజకీయాలు

**హైదరాబాద్, జనవరి 21, పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం "బొంద పెట్టాలి" అనే పదం చుట్టూ పెద్ద దుమారమే రేగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, దానికి బీఆర్ఎస్ ఇస్తున్న కౌంటర్లు ఇప్పుడు రాష్ట్రంలో హాట్ టాపిక్ అయ్యాయి. ఖమ్మం వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు తెరలేపాయి. ఒకప్పుడు తాను పెరిగిన తెలుగుదేశం పార్టీని తెలంగాణలో నామరూపాలు లేకుండాచేసిన కేసీఆర్‌పై రేవంత్ తన కసిని వెళ్లగక్కారు. అయితే, దీనికి బీఆర్ఎస్ ఇస్తున్న రిటార్ట్ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ముఖ్యమంత్రి అయినప్పటికీ, ఆయన రాజకీయ ప్రస్థానంటీడీపీ నుంచే మొదలైంది. తెలంగాణలో నేడు టీడీపీకి బలమైన నాయకత్వం లేకపోయినా, క్షేత్రస్థాయిలో ఆ పార్టీ సానుభూతిపరులు, కేడర్ ఇంకా ఉన్నారు. గత ఎన్నికల్లో టీడీపీ పోటీకి దూరంగా ఉండటంతో, ఆ ఓటుబ్యాంకులో మెజారిటీ కాంగ్రెస్‌కు మళ్లినట్లు విశ్లేషణలు ఉన్నాయి. ఏపీలో చంద్రబాబుకు వ్యతిరేకంగా కేసీఆర్, జగన్ చేతులు కలిపారనే భావన టీడీపీ అభిమానుల్లో బలంగా ఉంది. దీనిని క్యాష్ చేసుకునేందుకే రేవంత్ రెడ్డి"టీడీపీని దెబ్బతీసిన కేసీఆర్‌ను, ఆయన బీఆర్ఎస్ పార్టీని బొంద పెట్టాలి" అంటూ సెంటిమెంట్ అస్త్రాన్ని ప్రయోగించారు. రేవంత్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అగ్రనేతలు తీవ్రంగా స్పందిస్తూ ఒక చారిత్రక కోణాన్ని ముందుకుతెచ్చారు. తెలుగుదేశం పార్టీ పుట్టిందే కాంగ్రెస్ వ్యతిరేక భావజాలంపైన..! ఎన్టీఆర్ తన జీవితాంతం కాంగ్రెస్ అరాచక పాలనపైనే పోరాడారు. "ఎన్టీఆర్ ఆత్మ శాంతించాలంటే ఆయన బద్ధశత్రువైన కాంగ్రెస్‌నే బొంద పెట్టాలికానీ, ఆయన శిష్యుడైన కేసీఆర్‌ను కాదు" అనేది బీఆర్ఎస్ వాదన. రేవంత్ రెడ్డి ఇప్పటికీ టీడీపీ ఏజెంట్‌గా కాంగ్రెస్‌లో పనిచేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో నెటిజన్లు ఈ వ్యవహారంపైసెటైర్ల వర్షం కురిపిస్తున్నారు. ఒకవైపు రేవంత్ ఏమో బీఆర్ఎస్ ను బొంద పెట్టాలంటున్నారు. మరోవైపు బీఆర్ఎస్ ఏమో కాంగ్రెస్ ను బొంద పెట్టాలంటోంది. మరికొందరు నెటిజన్లు "అసలు ఒకప్పుడు టీడీపీలో కలిసి పనిచేసిన రేవంత్, కేసీఆర్.. ఇప్పుడు ఒకరినొకరు బొంద పెట్టుకుంటామనడం విడ్డూరంగా ఉంది" అని కామెంట్ చేస్తున్నారు. తెలంగాణలో టీడీపీ ఉనికి కోల్పోవడానికి కేసీఆర్ ఆపరేషన్ ఆకర్ష్ ప్రధాన కారణం అనడంలోసందేహం లేదు. ఓటుకు నోటు కేసు తర్వాత చంద్రబాబు ఏపీకి పరిమితం కావడం, ఇక్కడి నేతలంతా బీఆర్ఎస్ లో చేరిపోవడం చకచకా జరిగిపోయాయి. ఇప్పుడు రేవంత్ రెడ్డి పిలుపుతో పాత టీడీపీ శ్రేణులుఆలోచనలో పడ్డాయి. అయితే, రేవంత్ కాంగ్రెస్ లో ఉండి టీడీపీ గురించి మాట్లాడటాన్ని కొంతమంది కాంగ్రెస్ విధేయులు కూడా జీర్ణించుకోలేకపోతున్నారు.

తెలంగాణలో ఇప్పుడు పాత కక్షలు, పార్టీల మనుగడ చుట్టూతిరుగుతోంది. రేవంత్ రెడ్డి తన 'టీడీపీ మూలాలను' వాడుకొని బీఆర్ఎస్ ను దెబ్బతీయాలని చూస్తుంటే, బీఆర్ఎస్ అదే 'ఎన్టీఆర్ సెంటిమెంట్'తో రేవంత్ ను ఇరకాటంలో పెట్టాలని చూస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ 'బొంద' రాజకీయం ఎవరికి లాభిస్తుందో చూడాలి.

# అమ్రాబాద్‌లో కొత్త అడ్వెంచర్

**మహబూబ్ నగర్, జనవరి 21, పెన్ పవర్:** వన్యప్రాణి, ప్రకృతి ప్రేమికులకు తెలంగాణ అటవీ శాఖ తీపి కబురు అందించింది. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో త్వరలోనే 20 కిలోమీటర్ల సరికొత్త 'కొల్లాం' సఫారీ మార్గాన్ని ప్రారంభించనున్నట్లు అటవీ అధికారులు వెల్లడించారు. ఇందుకోసం రహదారి పనులను ఇప్పటికే పూర్తి చేశారు. ప్రస్తుతం అమ్రాబాద్‌లో మూడు రకాల సఫారీలు అందుబాటులో ఉన్నాయి. ఫరాహాబాద్ సఫారీ మొత్తం 16 కి.మీ. ప్రయాణం కాగా... 7 సీట్లవాహనా నికి రూ. 3 వేలు ఛార్జ్ చేస్తున్నారు. గుండం సఫారీ దట్టమైన అడవిలో 35 కి.మీ. ప్రయాణం కాగా..వాహనానికి రూ. 5 వేలు, అక్కమహాదేవి గుహల సఫారీ 14 కి.మీ ప్రకృతి అందాల మధ్య ప్రయాణానికి.. 5సీట్ల వాహనానికి రూ. 3 వేలు వసూలు చేస్తున్నారు. ఈ సఫారీ కార్యకలాపాలన్నీ కూడా స్థానిక చెంచు గిరిజనులే నిర్వహిస్తున్నారు. మొత్తం 18 సఫారీ వాహనాలకు వారే డ్రైవర్లుగా, నేచర్ గైడ్‌లుగా వ్యవహరిస్తూపర్యాటకులకు అడవి గురించి వివరిస్తారు. దీని ద్వారా వచ్చే ఆదాయాన్ని నేరుగా 'టైగర్ కన్జర్వేషన్ ఫౌండేషన్'కు, గిరిజనుల జీవనోపాధికి మళ్లిస్తున్నారు. పర్యావరణానికి హాని కలగకుండా టైగర్ రిజర్వ్‌లో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఫరాహాబాద్ వ్యూ పాయింట్, గుండం, దోమలపెంట వంటి ప్రాంతాల్లో బయో-టాయిలెట్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు పర్యాటకులు రాకపోకలు సాగించే చోట స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం కల్పించారు. వన్యప్రాణుల కోసం అడవి లోపల సోలార్ బోర్ వెల్స్, నీటి కుంటలను నిర్వహిస్తున్నారు. 2025 అక్టోబర్ నుంచి ఇప్పటివరకు దాదాపు 50 సార్లు పులులు పర్యాటకులకుకనిపించడం ఇక్కడి అడవి ఆరోగ్యాన్ని సూచిస్తోంది. దేశ వ్యాప్తంగా జరుగుతున్న 'ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ 2026' (పులుల గణన) కారణంగా జనవరి 20 నుంచి 25 వరకు అమ్రాబాద్‌లో సఫారీకార్యకలాపాలను నిలిపివేశారు. ఈ పులుల గణన కార్యక్రమంలో మొత్తం 139 మంది అటవీ సిబ్బందితో పాటు 170 మంది వాలంటీర్లు పాల్గొంటున్నారు.

# వరంగల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట్‌రెడ్డి ఇంట్లో ఏసీబీ సోదాలు

**వరంగల్: పెన్ పవర్:** డిప్యూటీ కలెక్టర్ వెంకట్‌రెడ్డి ఇంట్లో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 10 చోట్ల ఏసీబీ సోదాలు కొనసాగుతున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో ఉన్న ఆయనకు సంబంధించిన ఇళ్లు, కార్యాలయాలు, అనుబంధ ప్రదేశాల్లో ఒకేసారి తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. ప్రాథమిక విచారణలో అక్రమంగా వందల కోట్ల రూపాయల ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. నగదు, కీలక పత్రాలు, స్థిరాస్తుల వివరాలపై అధికారులు సవివరంగా పరిశీలిస్తున్నారు. సోదాలు పూర్తయ్యాక పూర్తి వివరాలను ఏసీబీ వెల్లడించే అవకాశం ఉంది.

# హోంగార్డ్ పై రాళ్లతో యువకుల దాడి

**హైదరాబాద్: పెన్ పవర్:** హైదరాబాద్ లంగర్ హౌస్ పరిధిలోని బాగ్దాద్ కాలనీలో హోంగార్డ్ ఆలీంపై ఇద్దరు యువకులు దాడికి పాల్పడ్డ విషయం తెలిసిందే. గొడవ పడుతున్న యువకులను విడిపించేందుకు హోంగార్డ్ ఆలీం వెళ్లారు. ఈ క్రమంలో ఆ యువకులు అతనిపై రాళ్లతో దాడి చేశారు. దీంతో రాయి తగాలడంతో హోంగార్డ్ ఆలీం కుప్పకూలిపోయాడు. తాజాగా ఈ ఘటనకు సంబంధించిన సీసీఫుటేజ్ వెలుగులోకి రావడంతో వైరల్ అవుతోంది.

# పద్మశాలి సేవా సంఘానికి 200 భోజన ప్లేట్లు అందజేత

**చొప్పదండి, జనవరి 21 పెన్ పవర్:** ఎల్లారెడ్డిపేట్ మండల కేంద్రంలో శ్రీ మార్కండేయ జయంతి సందర్భంగా పద్మశాలి సేవా సంఘం వారికి రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి 200 భోజన ప్లేట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సేవా సంఘం సభ్యులు కృష్ణారెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు వనం రమేష్ తో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులను సర్పంచ్ బట్టు కృష్ణ ప్రారంభించారు

**సిరిసిల్ల, జనవరి 21 పెన్ పవర్:** వీర్నపల్లి మండలం బంజేరు గ్రామంలో బుధవారం సర్పంచ్ బట్టు కృష్ణ గ్రామ పంచాయతీ పాలక వర్గంతో కలిసి ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఈ పథకానికి అర్హులేనని, జాబ్ కార్డు లేనివారు వెంటనే గ్రామ పంచాయతీలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ పథకం ఆర్థిక ఎదుగుదలకు గొప్ప అవకాశమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, ఏఎంసీ డైరెక్టర్, వార్డు సభ్యులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యుత్ మోటార్ల చోరీ

**వేములవాడ, జనవరి 21 పెన్ పవర్:** మండలంలోని ఇప్పలపల్లి గ్రామ శివారులో ఎస్సారెస్పీ ప్రధాన కాలువకు సాగునీటి కోసం రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లు చోరీకి గురయ్యాయి. ఇప్పలపల్లి గ్రామానికి చెందిన చింతి రెడ్డి రాజిరెడ్డి, బొల్లెడ్ల కిషన్ రెడ్డి, యాకూబ్ వ్యవసాయ పొలాలకు నీరు పెట్టేందుకు ప్రధాన కాలువకు విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేసుకున్నారు. బుధవారం సాగునీటి కోసం రైతులు ప్రధాన కాలువ వద్దకు వెళ్లి చూసేసరికి మోటార్లు కనిపించలేదు. దీంతో దుండగులు 3 మోటార్లను ఎత్తుకెళ్లినట్లు రైతులు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ. 60 వేలు ఉంటుందని తెలిపారు. ఘటనపై కేశవపట్నం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతులు తెలిపారు.

# ఏపీలో కొత్త పార్టీలు

**విజయవాడ, జనవరి 21, పెన్ పవర్:** ఏపీలో కొత్త పార్టీలు రానున్నాయా? ఆ స్పేస్ ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం ఏపీలో ప్రాంతీయ పార్టీల హవా నడుస్తోంది. జాతీయ పార్టీల ప్రభావం అంతంత మాత్రమే. అధికార టిడిపి, జనసేనలు ప్రాంతీయ పార్టీలు. వాటితో అధికారం పంచుకున్న బిజెపి జాతీయ పార్టీ. మరో ప్రతిపక్ష పార్టీగా వైసీపీ ఉంది. అది సైతం ప్రాంతీయ పార్టీ. ఇంకా చిన్నచితకా పార్టీలు ఉండనే ఉన్నాయి. అయితే ఇప్పుడు ప్రాంతీయ పార్టీల ఏర్పాటు అంశం అనేది హాట్ టాపిక్ అవుతోంది. ప్రధానంగా ఏబీ వెంకటేశ్వరరావు, విజయసాయిరెడ్డి, షర్మిలాలు కొత్త పార్టీలు పెడతారని ప్రచారం నడుస్తోంది. అయితే ఈ ముగ్గురు పార్టీలు పెడితే ఎవరికి నష్టం అంటే మాత్రం.. కచ్చితంగా జగన్మోహన్ రెడ్డికి. అయితే ఆ ముగ్గురు టార్గెట్ సైతం జగన్మోహన్ రెడ్డి పార్టీ అని తెలుస్తోంది. వారి పార్టీల ఏర్పాటు వెనుక కూడా ఒక రకమైన వ్యూహం ఉన్నట్లు సమాచారం. అయితే వారి పార్టీ ప్రకటన నేరుగా లేదు కానీ ప్రచారం మాత్రం జరుగుతోంది.ఏబీ వెంకటేశ్వరరావుజగన్మోహన్ రెడ్డి సర్కార్ బాధిత అధికారి. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి సర్కార్లు ఆయన ఇంటలిజెన్స్ అధికారిగా పనిచేశారు. అప్పట్లో వైసీపీ ఎమ్మెల్యేలు చాలామంది టీడీపీలో చేరారు. ఆ సమయంలో నిఘా అధిపతిగా ఉన్న ఆయన టిడిపికి అనుకూలంగా పనిచేశారన్న అనుమానం జగన్ లో ఉండేది. అందుకే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బాధితుడిగా మారారు ఏబీ వెంకటేశ్వరరావు. ఈ రాష్ట్రానికి డిజిపి కావాల్సిన అధికారి లూప్ హోల్స్ లో ఉండిపోయారు. ప్రమోషన్ పొందిన నాడే పదవీ విరమణ చేశారు. అయితే ఇంతటి మూల్యాన్ని చెల్లించుకున్న తనకు తెలుగుదేశం అధికారంలోకి వస్తే మంచి గుర్తింపు ఉంటుందని భావించారు. అయితే తన ఆలోచనకు తగ్గట్టు టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత గుర్తింపు, పదవి దక్కలేదు. పైగా తాను ఆశించినట్టు వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డికి ట్రీట్మెంట్ ఇవ్వడం లేదన్న ఆవేదన ఉంది. మరోవైపు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు సైతం తనకు ఇబ్బందులు ఉన్నాయి. అందుకే ఆయన కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తానని ఇటీవల ప్రకటించారు.మరోవైపు విజయసాయిరెడ్డికొత్త పార్టీ పెడతారన్న ప్రచారం నడుస్తోంది. ఏడాది కిందట ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. రాజ్యసభ సభ్యత్వంతో పార్టీకి కూడా రాజీనామా చేశారు. ఇకనుంచి వ్యవసాయం చేసుకుంటానని చెప్పుకొచ్చారు.. అయితే ఆయన రూటు మార్చినట్టు కనిపిస్తున్నారు. ఇటీవల నిత్యం జగన్ కోటరిని టార్గెట్ చేసుకుంటున్నారు. ఈ క్రమంలో రెడ్డి సామాజిక వర్గాన్ని ఆకర్షించే వీలుగా ఒక కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయాలన్న ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. దీని వెనుక తెలుగుదేశం హస్తం ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. వచ్చే ఎన్నికల్లో మరోసారి రెడ్డి సామాజిక వర్గం మద్దతు జగన్మోహన్ రెడ్డికి దక్కకుండా విజయసాయిరెడ్డి తో పార్టీని ఏర్పాటు చేయిస్తున్నారన్న ప్రచారం మాత్రం జరుగుతోంది.వైయస్ షర్మిల కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెబుతారని కూడా టాక్ నడుస్తోంది. తెలంగాణలో తన తండ్రి పేరిట పార్టీ ఏర్పాటు చేసిన షర్మిల అక్కడ నడపలేకపోయారు. కాంగ్రెస్ పార్టీలో చేరి ఏపీ పగ్గాలు అందుకున్నారు. సోదరుడు జగన్తో వచ్చిన విభేదాలతో ఆయనను అధికారం నుంచి దూరం చేయాలని చూసారు. ఆ విషయంలో సక్సెస్ అయిన ఏపీలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కాలేదు. అందుకే కాంగ్రెస్ అధినాయకత్వం షర్మిలను తప్పిస్తుందన్న ప్రచారం నడుస్తోంది. ఈ తరుణంలో ఆమె ప్రత్యేక రాయలసీమ సాధన కోసం ఒక పార్టీని ఏర్పాటు చేస్తారని టాక్ నడుస్తోంది. ఇటీవల రాజకీయంగా యాక్టివిటీస్ తగ్గించారు షర్మిల. అందుకే ఈ ప్రచారం మరింతగా సాగుతోంది. అయితే వీరు రాజకీయ పార్టీలు ఏర్పాటు చేస్తారు అనేది ఒక్క ప్రచారం మాత్రమే. వారు పార్టీలు ఏర్పాటు చేస్తే మాత్రం అది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇబ్బంది కలిగించే విషయమే.

# విశాఖలో ఇమ్మిగ్రేషన్ ఆఫీస్

**విశాఖపట్టణం, జనవరి 21, పెన్ పవర్:** విశాఖపట్నం నగరం రోజురోజుకీ విస్తరిస్తూ ఒక మెగా సిటీగా రూపుదిద్దుకుంటోంది. ఇప్పటికే పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందిన ఈ నగరానికి తాజాగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక బహుమతి అందించింది. కేంద్ర హోం శాఖఆధ్వర్యంలో పనిచేసే ఇమ్మిగ్రేషన్ బ్యూరో కార్యాలయాన్ని విశాఖలో ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకోవడం ఉత్తరాంధ్ర ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారనుంది. ఈ కార్యాలయం ప్రారంభం కావడంతో విశాఖతో పాటు చుట్టుపక్కల జిల్లాల ప్రజలకు విదేశీ ప్రయాణాల విషయంలో పెద్ద ఊరట లభించనుంది. ఇప్పటికే మరో ముఖ్యమైన అభివృద్ధి కూడా సమీప భవిష్యత్తులో పూర్తి కాబోతోంది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వచ్చే కొన్ని నెలల్లో అందుబాటులోకి రానుంది. అక్కడి నుంచి తొలి అంతర్జాతీయ విమానం విదేశాలకు ఎగరబోతున్నట్టు సమాచారం. రానున్న రోజుల్లో అమెరికా, ఆస్ట్రేలియా సహా పలు దేశాలకు నేరుగా విమాన సర్వీసులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అలాంటి పరిస్థితుల్లో ఇమ్మిగ్రేషన్ సేవలు తప్పనిసరి కావడంతో విశాఖలోనే ఈ కార్యాలయం ఏర్పాటు చేయడం సమయోచిత నిర్ణయంగా భావిస్తున్నారు. ఇంతవరకూ విశాఖ లేదా ఉత్తరాంధ్ర ప్రాంతాల నుంచి విదేశాలకు వెళ్లాలనుకునే వారు తప్పనిసరిగా హైదరాబాద్ లేదా చెన్నై నగరాలకు వెళ్లి అక్కడ ఇమ్మిగ్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాల్సి వచ్చేది. దీనివల్ల సమయం, ఖర్చు రెండూ ఎక్కువయ్యేవి. ఇప్పుడు ఈ సదుపాయం నేరుగా విశాఖ లో లభించనుండటంతో ప్రజలకు పెద్దగా ఉపశమనం కలగనుంది. విదేశీ ఉపాధి, ఉన్నత విద్య, వ్యాపార అవసరాల కోసం వెళ్లే వారి సంఖ్య ఈ ప్రాంతంలో వేగంగా పెరుగుతోంది. ఈ అవసరాలను దృష్టిలో పెట్టుకునే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. విశాఖకు అంతర్జాతీయ హోదా మరింత బలపడేందుకు ఈ ఇమ్మిగ్రేషన్ బ్యూరో కార్యాలయం కీలకంగా మారనుంది. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విశాఖలో ఈ కార్యాలయం ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరగా, వెంటనే సానుకూల స్పందన లభించడం విశేషం. ఇప్పటివరకు దేశీయ విమానాలకే పరిమితమైన విశాఖ విమానాశ్రయ కార్యకలాపాలు, ఇకపై అంతర్జాతీయ స్థాయికి చేరుకోనున్నాయి. అందుకు అనుగుణంగా అవసరమైన మౌలిక వసతులు అందుబాటులోకి తేవడం కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. రాబోయే రోజుల్లో అంతర్జాతీయ ప్రయాణికుల రాకపోకలతో పాటు కార్గో విమాన సేవలు కూడా విస్తరించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో ఉత్తరాంధ్ర ప్రాంతంలో వాణిజ్య కార్యకలాపాలు మరింత ఊపందుకుంటాయి. ఐటీ రంగం, పర్యాటక రంగం అభివృద్ధికి కూడా ఇది దోహదపడుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. భోగాపురం విమానాశ్రయం కేవలం ఉత్తరాంధ్రకే కాకుండా ఒడిశా , ఛత్తీస్‌గఢ్ వంటి పొరుగున ఉన్న రాష్ట్రాల ప్రజలకు కూడా ఉపయోగపడనుంది. అంతేకాదు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు మరిన్ని విశాఖలో ఏర్పాటు కావడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరిగి, నగర అభివృద్ధి మరింత వేగవంతమవుతుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

# తెలుగు రాష్ట్రాల మధ్య చిచ్చు.. 42 ఎకరాల భూమి



**విజయవాడ, జనవరి 21, పెన్ పవర్:** హైదరాబాద్‌లోని అత్యంత ఖరీదైన కొండాపూర్ ప్రాంతంలో గల 42 ఎకరాల భూమి ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టింది. సుమారు 4,000 కోట్ల రూపాయల విలువ చేసే ఈ భూమిపై తమకే అధికారం ఉందంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయడంతో ఈ వివాదం సరికొత్త మలుపు తిరిగింది. కర్నూలు కేంద్రంగా పనిచేసే బాలసాయిబాబా సెంట్రల్ ట్రస్ట్ కు చెందిన ఈ భూములపై తెలంగాణ ప్రభుత్వానికి ఎలాంటి అధికారం లేదని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేయడం సంచలనంగా మారింది. ఈ వివాదానికి మూలాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలోనే ఉన్నాయి. కర్నూలు జిల్లా కేంద్రంగా బాలసాయిబాబా సెంట్రల్ ట్రస్ట్ రిజిస్టర్ అయింది. ఈ ట్రస్ట్‌కు కొండాపూర్‌లోని సర్వే నంబర్లు 105 నుంచి 108 వరకు సుమారు 42.03 ఎకరాల భూమి ఉంది. 2005లో అప్పటి ప్రభుత్వం జీఓ 2065 ద్వారా ఈ యూఎల్‌సీ మిగులు భూములను ట్రస్ట్‌కు క్రమబద్ధీకరించింది.

బాలసాయిబాబా మరణం తర్వాత ట్రస్ట్ నిర్వహణ బాధ్యతలను ఏపీ దేవాదాయ శాఖ చేపట్టింది. కర్నూలు దేవాదాయ శాఖ కార్యనిర్వహణాధికారిని ఈ ట్రస్ట్‌కు అధికారిగా నియమించారు. ఈ వివాదంలో ప్రైవేటు సంస్థ అయిన భూపతి ఎస్టేట్స్ ప్రవేశించడంతో సమస్య సంక్లిష్టంగా మారింది. 2023లో తెలంగాణ ప్రభుత్వం రెవెన్యూ రికార్డులలో మార్పులు చేస్తూ, ట్రస్ట్ పేరుకు బదులుగా 'భూపతి ఎస్టేట్స్' పేరును చేర్చింది. బాలసాయిబాబా ట్రస్ట్ భూములను ఈ ప్రైవేటు సంస్థకు అప్పగించడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. తమకు సమాచారం ఇవ్వకుండా, ఏపీ పరిధిలో ఉన్న ట్రస్ట్ భూములను తెలంగాణ ప్రభుత్వం ఎలా బదలాయిస్తుందని ఏపీ దేవాదాయ శాఖ ప్రశ్నిస్తోంది. ఈ క్రమబద్ధీకరణ చెల్లదని, తెలంగాణ తీసుకున్న నిర్ణయం చట్టవిరుద్ధమని ఏపీ ప్రభుత్వం వాదిస్తోంది. తమ్మనబోయిన సంతోష్ కుమార్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిల్ పై విచారణ సందర్భంగా ఏపీ దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్రమోహన్ కీలకమైన కౌంటర్ దాఖలు చేశారు. ఈ ట్రస్ట్ ఆంధ్రప్రదేశ్ చట్టం కింద ఏపీలో రిజిస్టర్ అయింది. కాబట్టి దాని ఆస్తుల నిర్వహణ ఏపీ దేవాదాయ శాఖ పరిధిలోకే వస్తుంది. రాష్ట్ర విభజన తర్వాత ఆయా రాష్ట్రాల్లోని భూములు ఆ రాష్ట్రాలకే చెందుతాయన్న నియమం ఉన్నప్పటికీ, ఒక రాష్ట్ర దేవాదాయ శాఖ పరిధిలోని ట్రస్ట్ ఆస్తులను మరో రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు ఎలా కట్టబెడుతుందని ఏపీ ప్రశ్నిస్తోంది. ఈ భూములపై తెలంగాణకు ఎలాంటి పరిపాలనాపరమైన అధికారం లేదని ఏపీ తేల్చి చెప్పింది. తెలంగాణ ప్రభుత్వం ఈ భూములు తమ భౌగోళిక పరిధిలో ఉన్నాయని, స్థానిక రెవెన్యూ నిబంధనల ప్రకారమే మార్పులు జరిగాయని భావిస్తోంది. అయితే, ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్‌పై తెలంగాణ ప్రభుత్వం తన తదుపరి వాదనలను కోర్టులో వినిపించాల్సి ఉంది. గతంలో కొందరు పిటిషన్లు వేసి ఉపసంహరించుకోవడం వెనుక భారీ కుట్ర దాగి ఉందని ఏపీ ప్రభుత్వం ఆరోపిస్తుండటంతో, ఈ వ్యవహారం మరింత ముదిరేలా కనిపిస్తోంది. 4,000 కోట్ల విలువైన భూమి కావడం, ఇందులో ఒక ఆధ్యాత్మిక ట్రస్ట్, ప్రైవేటు రియల్ ఎస్టేట్ సంస్థలు భాగస్వామ్యం కావడంతో ఈ కేసు తెలుగు రాష్ట్రాల్లో ఉత్కంఠ రేపుతోంది. హైకోర్టు ఇచ్చే తీర్పు రెండు రాష్ట్రాల మధ్య ఉన్న ఆస్తుల పంపకాల వివాదాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది.

# టీడీపీలో సెకండ్ జనరేషన్

**విజయవాడ, జనవరి 21, పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీ రాజకీయ ప్రయాణం ఇప్పుడు ఒక కీలక మలుపు వద్ద నిలిచింది. ఈ మార్చితో పార్టీకి 44 సంవత్సరాలు పూర్తై 45వ సంవత్సరంలోకి అడుగుపెడుతోంది. పార్టీ ఆవిర్భావ సమయంలో యువకులుగా రాజకీయాల్లోకి వచ్చిన చాలా మంది నేతలు ఇప్పుడు వయోభారంతో సీనియర్ స్థాయికి చేరుకున్నారు. అప్పట్లో అన్న ఎన్టీఆర్ చేతుల మీదుగా తొలి టికెట్ తీసుకుని అసెంబ్లీలో అడుగుపెట్టిన యువ నాయకులే, నేడు పార్టీలో అత్యంత అనుభవజ్ఞులుగా గుర్తింపు పొందుతున్నారు. కాలం మారినట్లే, రాజకీయాల్లోనూ మార్పు అవసరమన్న ఆలోచనలు ఇప్పుడు ఆ సీనియర్లలో మొదలయ్యాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ అంతటా చూస్తే, టీడీపీలోని సీనియర్ నేతల నుంచి ఒకే రకమైన మాట వినిపిస్తోంది. తాము ఇక రాజకీయాల నుంచి తప్పుకోవాలని, యువతకు అవకాశం ఇవ్వాలని పలువురు బహిరంగంగానే చెబుతున్నారు. ఇది ఒకరిద్దరి అభిప్రాయం మాత్రమే కాకుండా, చాలా జిల్లాల్లో వినిపిస్తున్న స్వరం కావడం విశేషం. ఈ జాబితా ఎంత పెద్దదంటే, ఒక ప్రాంతీయ పార్టీలో ఇంతమంది నేతలు ఒకేసారి పక్కకు తప్పుకునే పరిస్థితి దేశ రాజకీయాల్లో అరుదేనని చర్చ సాగుతోంది. సాధారణంగా రాజకీయాల్లో వయస్సుతో సంబంధం లేదని, చివరి శ్వాస వరకూ కొనసాగుతామని చెప్పే నాయకులు ఎక్కువ. కానీ టీడీపీ సీనియర్లు మాత్రం భిన్నంగా ఆలోచిస్తున్నారని అంటున్నారు. దీనికి ప్రధాన కారణంగా రాబోయే ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం ఇవ్వాలన్న పార్టీ వ్యూహం ఉందన్న ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా నారా లోకేష్ నాయకత్వం మరింత బలపడుతూ, ఆయన చుట్టూ కొత్త తరం నాయకుల బృందం తయారవుతుందని భావిస్తున్నారు. ఈ మార్పును దృష్టిలో పెట్టుకుని, ముందుగానే తాము తప్పుకుంటే మంచిదన్న ఆలోచన సీనియర్లలో ఏర్పడినట్టు చెబుతున్నారు. ఇదే సమయంలో మరో వ్యూహాత్మక ఆలోచన కూడా ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. గతంలో చంద్రబాబు నాయుడు వద్ద తాము కీలక పాత్ర పోషించినట్లే, ఇప్పుడు తమ వారసులను లోకేష్ టీంలోకి చేర్చితే భవిష్యత్తులో కుటుంబ రాజకీ యాలకు భరోసా ఉంటుందన్న భావన కూడా ఈ నిర్ణయాల వెనుక ఉందని అంటున్నారు. "దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకో వాలి" అన్న సామెత రాజకీయాల్లో ఉన్నవారికి మరింత వర్తిస్తుందన్న మాట వినిపిస్తోంది. ఇటీవల నర్సీపట్నం లో జరిగిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ సభలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు తనకు 70 ఏళు వచ్చాయని, ఇక రాజకీయాలకు గుడ్‌బై చెప్పాలని వేదికపైనే ప్రకటించడం పెద్ద చర్చకు దారితీసింది. ఆయన కుమారుడు విజయ్ పాత్రుడుకు వచ్చే ఎన్నికల్లో అవకాశం కల్పించాలన్న ప్రయత్నం జరుగుతోందన్న ప్రచారం కూడా ఉంది.

## కార్యకర్తలు సరే... లీడర్లు ఏరీ

**కడప, జనవరి 21, పెన్ పవర్:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాబోయే ఎన్నికల్ని లక్ష్యంగా చేసుకుని తన వ్యూహాలను పునర్వ్యవస్థీకరించుకునే ప్రయత్నంలో ఉంది. ప్రధానంగా ప్రజల మధ్యకు వెళ్లడం, ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడం, వచ్చే ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రావడం అన్నదే పార్టీ ముందున్న ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. అయితే ఈ లక్ష్యాలు కార్యరూపం దాల్చడంలో మాత్రం స్పష్టత కొరవడినట్టు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని పార్టీ నిర్ణయించినప్పటికీ, ఆ ఉద్యమాలు పరిమిత స్థాయిలోనే కొనసాగుతున్నాయి. ఎక్కువగా కార్యకర్తలు, స్థానిక నాయకులకే ఈ బాధ్యతలు అప్పగించడంతో ప్రజల్లోకి బలమైన సంకేతం వెళ్లడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దాదాపు గత ఇరవై నెలలుగా పార్టీ చేపట్టిన పలు కార్యక్రమాల్లో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యక్షంగా పాల్గొనకపోవడం గమనార్హం. అంతేకాదు, ఆయనకు సన్నిహితుడిగా భావించే సీనియర్ నేత సజ్జల రామకృష్ణారెడ్డి కూడా ఈ కార్యక్రమాల్లో ఎక్కడా కనిపించలేదు. ఈ పరిస్థితుల్లో పార్టీ పోరాటాలు కేవలం కార్యకర్తల స్థాయికే పరిమితమయ్యాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల మధ్యకు వస్తానని జగన్మోహన్ రెడ్డి గతంలో రెండు సార్లు తేదీలు ఇచ్చారన్న ప్రచారం జరిగింది. గత ఏడాది జూలై నెలలో ప్రజల్ని కలుస్తానని చెప్పినా, అది కేవలం కొద్ది సమయం పర్యటనకే పరిమితమైంది. ఆ తర్వాత ఈ ఏడాది జనవరి నుంచి విస్తృతంగా ప్రజల్లోకి వస్తానన్న మాట కూడా వాయిదా పడింది. తాజాగా పార్టీ వర్గాల్లో పాదయాత్రే తుది నిర్ణయం అన్న చర్చ నడుస్తోంది. అయితే ఈ పాదయాత్ర ఎప్పుడు అనే దానిపై స్పష్టత లేదు. పార్టీ నాయకుల మాటల్లో చెప్పాలంటే 2027 లేదా 2028 వరకూ దీనికి ముహూర్తం ఉండకపోవచ్చని అంటున్నారు. ఇప్పుడే పాదయాత్ర చేపట్టినా ఎన్నికలకు ఇంకా సమయం ఎక్కువగా ఉండటంతో దాని ప్రభావం తగ్గిపోతుందనే ఆలోచనతోనే ఈ నిర్ణయం తీసుకుంటున్నారని సమాచారం. అందుకే ఎన్నికలకు ఒకటి లేదా రెండు సంవత్సరాల ముందు మాత్రమే పాదయాత్ర ప్రారంభించే యోచనలో ఉన్నారని చెబుతున్నారు. ఇదిలా ఉండగా, మధ్యలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు , కార్పొరేషన్ ఎన్నికలు పార్టీకి కీలకంగా మారనున్నాయి. ఈ ఎన్నికల్లో వైసీపీ ఎలా ముందుకు సాగుతుంది, ఎలాంటి వ్యూహాలు అమలు చేస్తుందన్నది పెద్ద ప్రశ్నగా మారింది. పైగా జగన్మోహన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై కూడా చర్చ సాగుతోంది. ఆయన మోకాళ్ల సమస్యతో పాటు నడుము నొప్పితో బాధపడుతున్నారని ప్రచారం ఉంది. బహిరంగంగా చెప్పకపోయినా, గత కొన్నేళ్లుగా ఆయన వ్యవహార శైలిని గమనిస్తే ఆరోగ్య ఇబ్బందులు ప్రభావం చూపుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొంటూ వైసీపీ భవిష్యత్ అడుగులు ఎలా ఉండబోతాయన్నదే రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

## వెడ్డింగ్ హబ్ గా తిరుపతి

**తిరుపతి, జనవరి 21, పెన్ పవర్:** కలియుగ ప్రత్యక్ష దైవంగా భక్తులు భావించే వేంకటేశ్వర స్వామి కొలువైన తిరుమల లో వివాహం చేసుకోవడం అత్యంత పవిత్రమని చాలామంది విశ్వసిస్తారు. ఆ పవిత్ర వాతావరణంలో కొత్త జీవితం ప్రారంభిస్తే దాంపత్య జీవితం సుఖశాంతులతో, ఆరోగ్యంగా సాగుతుందని భక్తుల నమ్మకం. ప్రపంచ వ్యాప్తంగా పేరుగాంచిన ఆధ్యాత్మిక క్షేత్రం కావడంతో, అక్కడి ఆధ్యాత్మిక వాతావరణం వివాహ జీవితానికి శుభకారకమని భావిస్తారు. ఏడుకొండల వాడి సన్నిధిలో జరిగే పెళ్లిని ఎంతో పవిత్రంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు గౌరవిస్తారు. ఈ నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తిరుమలతిరుపతి ప్రాంతాన్ని వివాహాల కోసం ప్రత్యేక గమ్యస్థానంగా అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇటీవల సంక్రాంతి పండుగ సందర్భంగా తన స్వగ్రామం నారావారిపల్లె కు వెళ్లిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుపతిని వెడ్డింగ్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దే దిశగా అధికారులకు సూచనలు చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి ఆదేశాలతో తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు, పర్యాటక శాఖ కలిసి ప్రత్యేక ప్యాకేజీపై కసరత్తు చేస్తున్నారని సమాచారం. ప్రస్తుతం తిరుమలలో ఏటా సుమారు పదిహేను వేల నుంచి ఇరవై వేల వరకు వివాహాలు జరుగుతున్నాయి. శుభ ముహూర్తాలు ఉన్న రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. తిరుపతి , తిరుచానూరు ప్రాంతాల్లో జరిగే పెళ్లిళ్లు వీటికి అదనమే. ఇప్పటికే టీటీడీ వివాహాలు చేసుకునే జంటలకు కొన్ని సౌకర్యాలు అందిస్తోంది. 'కళ్యాణ వేదిక' లో వివాహం చేసుకున్న వారికి ప్రత్యేక దర్శన అవకాశం, ఆశీర్వచన కార్యక్రమం, ప్రసాదాల పంపిణీ వంటి సదుపాయాలు ఉన్నాయి. అయితే ఈ వేదికలో ఆర్భాటాలకు అవకాశం తక్కువగా ఉండటంతో, కొందరు భక్తులు కొండపై ఉన్న ప్రైవేటు మఠాలు, సత్రాలు లేదా దిగువ ప్రాంతాల్లోని కల్యాణ మండపాలను ఎంచుకుంటున్నారు. తొండవాడ , శ్రీనివాసమంగాపురం వంటి ప్రాంతాలు కూడా పెళ్లిళ్లకు ప్రాధాన్యం పొందుతున్నాయి. అయితే ఈ విధంగా ఇతర చోట్ల వివాహాలు చేసుకునే వారికి ఇప్పటివరకు ప్రత్యేక దర్శన సౌకర్యాలు లేకపోవడం వల్ల భక్తుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ అంశం ప్రభుత్వ దృష్టికి రావడంతో, ఇకపై కళ్యాణ వేదిక వెలుపల పెళ్లి చేసుకున్నా కూడా శ్రీవారి దర్శనం, ఆశీర్వచనం, ప్రసాదాలు అందించే విధంగా కొత్త విధానం తీసుకురావాలని యోచిస్తోంది. వివాహ వేదిక అలంకరణ, భోజన ఏర్పాట్లు, రవాణా, వసతి వంటి సేవలను ప్రైవేటు సర్వీసు ప్రొవైడర్లకు అప్పగించి, ప్రభుత్వ పర్యవేక్షణలో ప్యాకేజీగా అందించాలని ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. దీని వల్ల పెళ్లి చేసుకునే వారికి సౌలభ్యం కలగడంతో పాటు, స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలుపితే, తిరుమలతిరుపతి ప్రాంతం ఆధ్యాత్మికతతో పాటు వివాహాల కోసం కూడా దేశవ్యాప్తంగా మరింత గుర్తింపు పొందే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## వైసీపీకి కొత్త అధ్యక్షుడు... ధర్మాన



**గుంటూరు, జనవరి 21, పెన్ పవర్:** చంద్రబాబు ఆలోచన జగన్ చేస్తున్నారా? పార్టీ అధినేతగా ఉంటూ రాష్ట్ర పగ్గాలు మరొకరికి అప్పగించనున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. 2014 వరకు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా ఉండేవారు చంద్రబాబు. కానీ తర్వాత జాతీయ అధ్యక్షుడిగా మారి రాష్ట్ర పార్టీ బాధ్యతలను వేరొకరికి అప్పగించారు. ఇప్పుడు జగన్ సైతం వైసీపీ రాష్ట్ర పగ్గాలు సీనియర్ నేతకు అప్పగించాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. మొత్తం జగన్మోహన్ రెడ్డి సోలో అన్నట్టు పరిస్థితి మారింది. ఆపై ఆయన చుట్టూ ఆ నలుగురు చేరారని.. వారి వల్లే పార్టీ ఓడిపోయిందన్న విమర్శ ఉంది. అందుకే ఈసారి రాష్ట్ర పార్టీ అధ్యక్ష బాధ్యతలను సీనియర్ నేతకు అప్పగించేందుకు జగన్మోహన్ రెడ్డి కీలక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. తద్వారా పార్టీలో సీనియర్లకు సైతం గౌరవం కల్పించినట్లు అవుతుంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీ అధ్యక్షుడిగా జగన్మోహన్ రెడ్డి కొనసాగుతూ వచ్చారు. గౌరవ అధ్యక్షురాలిగా విజయమ్మ ఉండేవారు. కానీ షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టడంతో ఆమెకు అండగా నిలిచేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గౌరవ అధ్యక్షురాలి పదవి నుంచి తప్పుకున్నారు విజయమ్మ. అప్పటినుంచి పార్టీని అంతా తానై నడిపిస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. అయితే గతంలో విజయసాయిరెడ్డి కొద్దిరోజులపాటు జగన్ తర్వాత అన్నట్టు పరిస్థితి ఉండేది. అటు తరువాత సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ బాధ్యతలను చూస్తున్నారు. అయితే జగన్ చుట్టూ ఉన్న వారితో పని జరగదని.. పార్టీ అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నందున రాష్ట్ర అధ్యక్ష పదవి అనేది క్రియేట్ చేయాలన్న ఆలోచన వచ్చినట్లు సమాచారం. పార్టీ అధినేతగా జగన్మోహన్ రెడ్డి ఉంటే.. రాష్ట్ర పార్టీ బాధ్యతలను వేరే నేతకు అప్పగిస్తే బాగుంటుందన్న అభిప్రాయం పార్టీ వర్గాల నుంచి వినిపించిందట. అందుకే పార్టీలో ఒక సీనియర్ నేతకు అధ్యక్ష బాధ్యతలు కానీ.. పార్టీ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్గా కానీ అవకాశం ఇస్తారని తెలుస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలోనే సీనియర్ నేతగా ఉన్నారు ధర్మాన ప్రసాదరావు. 1989లో తొలిసారిగా ఆయన పోటీ చేసి గెలిచారు. అసెంబ్లీలో అడుగు పెట్టారు. మంత్రి కూడా అయ్యారు. రాజశేఖర్ రెడ్డి కి అత్యంత ఆప్తుడిగా మెదిలారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పదేళ్లపాటు మంత్రిగా వ్యవహరించారు. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో రెండున్నర ఏళ్ల పాటు మంత్రి అయ్యారు. మంచి వాగ్దాటితోపాటు సబ్జెక్టు ఉన్న నేత. అటువంటి నాయకుడికి వైసిపి రాష్ట్ర అధ్యక్ష పదవి కానీ.. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి కానీ ఇస్తే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. తద్వారా జగన్మోహన్ రెడ్డి చుట్టూ ఉన్న కోటరీ కి చెక్ పడవచ్చు అన్నది ఆలోచన. ఆపై జగన్మోహన్ రెడ్డి సీనియర్లను కలుపుతున్నారని సంకేతాలు పంపించినట్లు అవుతుంది. అందుకే త్వరలో ధర్మాన ప్రసాదరావు కు కీలక పదవి ఖాయమని తెలుస్తోంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## ఇజ్రాయిల్ బలగాల దురాక్రమణ



**హైదరాబాద్ పెన్ పవర్:** తూర్పు జెరూసలేంలో పాలస్తీనా శరణార్థుల వ్యవహారాలు చూసే ఐక్యరాజ్య సమితి సంస్థ యూఎన్ఆర్‌డబ్ల్యూఏ ప్రధాన కార్యాలయంలో కొంత భాగాన్ని ఇజ్రాయిల్ బలగాలు మంగళవారం కూల్చివేశాయి. 'ఇది అనూహ్యమైన దాడి' అనియూఎన్ఆర్‌డబ్ల్యూఏ ఎక్స్ పోస్టులో పేర్కొంది. ఇది అంతర్జాతీయ చట్టాన్ని తీవ్రంగా ఉల్లంఘించడం కిందకే వస్తుందని, ఐక్యరాజ్య సమితి హక్కులు, రక్షణలన్నింటిపై దాడి చేయడమేనని ఆ పోస్టు పేర్కొంది. సిబ్బంది ఫోన్లను, కంప్యూటర్లను సైన్యం లాగేసుకుందని, వారిని బలవంతంగా కార్యాలయ ఆవరణ నుండి బయటకు గెంటివేశారని ఆ పోస్టు పేర్కొంది. అలాగే పాలస్తీనా ట్రేడ్ స్కూల్‌పై ఇజ్రాయిల్ బలగాలు బాష్పవాయు గోళాలు ప్రయోగించాయి. యూఎన్ఆర్‌డబ్ల్యూఏ వెస్ట్ బ్యాంక్ డైరెక్టర్ రోలాండ్ ఫ్రెడరిక్ మాట్లాడుతూ, ఇజ్రాయిల్ బలగాలు జెరూసలేం శివార్లలోని క్వలాండియాలో యువ పాలస్తీనియన్ల కోసం ఏర్పాటు చేసిన వొకేషనల్ స్కూల్‌కు చేరుకుని కాల్పులు జరిపాయని చెప్పారు. ఈ స్కూల్లో 300మందికి పైగా యువ శరణార్థులు టెక్నాలజీలో, వెల్డింగ్‌లో ఉపాధి శిక్షణ పొందారని తెలిపారు.గాజా, వెస్ట్ బ్యాంక్, అలాగే జోర్డాన్, లెబనాన్, సిరియాల్లో పాలస్తీనా శరణార్థులకు ఆరోగ్య సంరక్షణను అందిస్తూ వారికోసం స్కూళ్ళు, శరణార్థుల శిబిరాలను యుఎన్ఆర్‌డబ్ల్యుఎ నడుపుతోంది. ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను అందించడంలో ఈ సంస్థ చాలా కీలకంగా వ్యవహరిస్తోంది. ఆ సంస్థ పైనే నిషేధం విధిస్తూ కొత్త చట్టం తీసుకువచ్చిన నేపథ్యంలో ఈ విధ్వంస చర్యలు చేపట్టినట్లు ఇజ్రాయిల్ విదేశాంగ శాఖ తెలిపింది. హమాస్‌కు మిలిటెంట్ గ్రూపులతో ఈ సంస్థ సంబంధాలు కొనసాగిస్తోందని ఆరోపించింది. జాతీయ భద్రతా వ్యవహారాల మంత్రి ఇటామిర్ బెన్ గివిర్ మొత్తంగా ఈ వ్యవహారంపై ఒక ప్రకటన చేశారు.

## గ్రీన్‌లాండ్‌లో యుద్ధ మేఘాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** గ్రీన్‌లాండ్‌ను చేజిక్కించుకు నేందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ యుద్ధ సన్నాహాలు ప్రారంభించారు. గ్రీన్‌లాండ్ లోని కీలక సైనిక స్థావరానికి యుద్ధ విమానాల ను తరలించాలని నిర్ణయించారు. పిటుఫిక్ స్పేస్ బేస్‌కు త్వరలోనే విమానాలు చేరుకుంటా యని ఉత్తర అమెరికా ఏరోస్పేస్ డిఫెన్స్ కమాండ్ తెలిపింది. ఆర్కిటిక్ ప్రాంతంలో రక్షణ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు వీటిని మోహరి స్తున్నట్టు చెప్పింది. అమెరికా, కెనడా దేశాల లోని స్థావరాల నుంచి పనిచేయడంతో పాటు కమాండ్ కార్యకలాపాలకు అవి మద్దతు ఇస్తాయని వివరించింది. కెనడా, డెన్మార్క్‌లతో రక్షణ సహకారానికి అవి ఉపకరిస్తాయని తెలిపింది. యుద్ధ విమానాల మోహరింపుపై గ్రీన్‌లాండ్‌కు ముందుగానే సమాచారం ఇచ్చామని కమాండ్ చెప్పింది. బల ప్రయోగంతో గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు 'నో కామెంట్' అని ట్రంప్ బదులిచ్చారు. అయితే గ్రీన్‌లాండ్‌ను చేజిక్కించుకోని పక్షంలో యూరోపియన్ దేశాలపై సుంకాలతో విరుచుకుపడతానని తేల్చి చెప్పారు. దావోస్‌లో జరగనున్న ప్రపంచ ఆర్థిక ఫోరం సమావేశాలలో గ్రీన్‌లాండ్ అంశాన్ని లేవనెత్తాలని ట్రంప్ భావిస్తున్నారు. ఆ దీవిని కొనుగోలు చేసే విషయంపై దావోస్‌లో చర్చిస్తానని ఆయన చెప్పారు. గ్రీన్‌లాండ్‌ను రక్షించే సత్తా డెన్మార్క్‌కు లేనందున దానిని తమ ఆధీనంలోకి తీసుకుంటామని తెలిపారు.

## వెనిజులాలో అదుపు తప్పిన ద్రవ్యోల్బణం

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా సైన్యం వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురోను అపహరించిన తర్వాత అక్కడ రాజకీయ, ఆర్థిక అస్థిర పరిస్థితులు నెలకొన్నాయి. ద్రవ్యోల్బణం అదుపు తప్పింది. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతుండడంతో వెనిజులా ప్రజలు ఆహార కొరతను ఎదుర్కోవాల్సి వస్తోంది. మరోవైపు కార్మికుల వేతనాలు తగ్గిపోతుండడంతో పరిస్థితి దుర్భరంగా మారింది. అమెరికా విధించిన ఆర్థిక ఆంక్షల కారణంగా వెనిజులాలో 70 శాతానికి పైగా ప్రజలు చాలా కాలంగా పేదరికంలో మగ్గిపోతున్నారు. అనేక ప్రాంతాలలో ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. తాజాగా అమెరికా జరిపిన దాడితో పరిస్థితి పూర్తిగా అదుపు తప్పింది. అమెరికా డాలర్‌పై వెనిజులా ఆధారపడుతుండడంతో ఆహార ధరలు బాగా పెరిగిపోయాయి. వెనిజులాలో రోజువారీ లావాదేవీలలో ఎక్కువగా అమెరికా డాలర్‌నే ఉపయోగిస్తుంటారు. ఎందుకంటే దానికి వెనిజులా కరెన్సీ బొలివర్ కంటే స్థిరత్వం ఎక్కువగా ఉంటుంది. ఒకప్పుడు లాటిన్ అమెరికాలో సంపన్న దేశంగా నిలిచిన వెనిజులా 2019లో అమెరికా ఆంక్షల కారణంగా పీకల్లోతు ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయింది. మెజారిటీ ప్రజలు అమెరికా డాలర్లలోనే పొదుపు చేయడం, ఖర్చు చేయడం, వసూలు చేయడం జరుగుతోంది. దీంతో నేడు వెనిజులా ప్రజలు తమ రోజువారీ ఖర్చుల కోసం అమెరికా డాలర్ పైనే ఆధారపడాల్సి వస్తోంది. వ్యాపారులు డాలర్లలోనే సరఫరాదారుల నుంచి వస్తువులు కొంటుంటారు. కొనుగోలుదారులు వెనిజులా కరెన్సీలో చెల్లింపులు జరపాలని అనుకుంటే ఎక్కువ ధర వసూలు చేస్తున్నారు.

## నూతన సామాజికాభివృద్ధి దిశగా వియత్నాం

**హైదరాబాద్ పెన్ పవర్:** వియత్నాం కమ్యూనిస్టు పార్టీ (సీపీవీ) 14వ జాతీయ మహాసభలు హనోరులోని నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం ప్రారంభమయ్యాయి. ప్రతి ఐదేండ్లకోసారి సీపీవీ జాతీయ మహాసభలను నిర్వహిస్తుంది. 2030లో పార్టీ శతాబ్ది ఉత్సవాలు దగ్గరపడుతున్న నేపథ్యంలో ఈ ఏడాది దేశానికి కీలకమైన మలుపు కానుంది. అలాగే 2045లో వియత్నాం సోషలిస్టు రిపబ్లిక్ శతాబ్ది ఉత్సవాలు జరగనున్నాయి. అధ్యక్షుడు లూయాంగ్ కుయాంగ్ ప్రారంభోపన్యాసం చేస్తూ, 14వ జాతీయ మహాసభలను ఒక చారిత్రక మలుపుగా అభివర్ణిస్తూ, యావత్ పార్టీ, ప్రజలు, సాయుధ బలగాలు తమ సంకల్పాన్ని, ఆకాంక్షలను దీనిపై కేంద్రీకరించారన్నారు. ప్రధానమైన చారిత్రక మైలురాళ్ళకు దేశం సమాయత్త మవుతున్న తరుణంలో, నూతన అభివృద్ధి దశలో ప్రవేశిస్తున్న సమయంలో ఈ మహాసభలు జరుగుతు న్నాయన్నారు. అంతర్జాతీయంగా, ప్రాంతీయంగా పరిస్థితులు అత్యంత వేగంగా, అనూహ్యంగా మారిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అగ్ర దేశాల మధ్య వ్యూహాత్మక పోటీ ఉధృతమవుతోందన్నారు,. వాతావరణ మార్పులు, అంటువ్యాధులు, సైబర్ సెక్యూరిటీ ముప్పులతో సహా పలు సాంప్రదాయేతర భద్రతా సవాళ్ళను ఎదుర్కొనాల్సి వస్తోందన్నారు. నాల్గవ పారిశ్రామిక విప్లవం ముఖ్యంగా కృత్రిమ మేధస్సులో, డిజిటల్ సాంకేతికతలో, క్వాంటమ్ టెక్నాలజీలో కొత్త పుంతలు తొక్కుతోందని, ఇవన్నీ కలిసి అంతర్జాతీయ ఆర్థిక, సామాజిక వ్యవస్థలకు కొత్త రూపునిస్తున్నాయన్నారు. కొత్త అభివృద్ధి నమూనాలను వియత్నాం అందిపుచ్చుకోవడానికి, కార్మిక ఉత్పాదకతను పెంచడానికి, జాతీయ పోటీతత్వాన్ని పెంచుకోవడానికి, పాలనను, దేశరక్షణను, భద్రతను బలోపేతం చేసుకోవడానికి ఈ పరివర్తనలు చాలా అవసరమని అన్నారు.

## నోబెల్ మా ప్రభుత్వ నిర్ణయం కాదు

**హైదరాబాద్ పెన్ పవర్:** నోబెల్ శాంతి బహుమతి తనకు ఇవ్వకూడదని నార్వే నిర్ణయించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పంపిన సందేశంపై ఆ దేశ ప్రధాని జోనస్ గా స్టోర్ స్పందించారు. నోబెల్ అవార్డులను నిర్ణయించే అధికారం నార్వే ప్రభుత్వానికి లేదని తెలిపారు. ఆ అధికారం పూర్తిగా నోబెల్ కమిటీదేనని స్పష్టం చేశారు. "నోబెల్ శాంతి బహుమతిని స్వతంత్ర నోబెల్ కమిటీ ప్రదానం చేస్తుంది. దీనిపై నార్వే ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదు. ఈ విషయాన్ని అధ్యక్షుడు ట్రంప్‌నకు కూడా స్పష్టంగా వివరించా. నోబెల్ శాంతి బహుమతి దక్కకపోవడం వల్ల తన ప్రపంచ రాజకీయ దృక్పథం, మైత్రి దేశాలపై విధానం మారిందని ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు" అని జోనాస్ వ్యాఖ్యానించారు. గ్రీన్‌లాండ్ విషయంలో నార్వే వైఖరి స్పష్టంగా ఉందని తెలిపారు.

# ఇక ఆ దేశాలపై నమ్మకం పెట్టుకోలేం




**హైదరాబాద్ పెన్ పవర్:** దావోస్‌లో జరుగుతోన్న ప్రపంచ ఆర్థిక సదస్సులో కెనడా ప్రధాని మార్క్ కార్నీ మాట్లాడుతూ..అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న సుంకాలపై పరోక్ష విమర్శలు చేశారు. అమెరికా ఆధిపత్యంలో ప్రపంచం పరివర్తన వైపు కాకుండా విచ్ఛిన్నం వైపు వెళ్తుందన్నారు. ఒకప్పుడు భాగస్వామ్య శ్రేయస్సు కోసం దేశాల మధ్య చేసుకున్న ఆర్థిక ఒప్పందాలను పైస్థానంలో ఉన్నవారు ఇప్పుడు ఆయుధంగా ఉపయోగించుకుంటున్నారన్నారు. బలవంతులు తమ సొంత ప్రయోజనాలకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటూ.. అసమానమైన వాణిజ్య నియమాలను అమలుచేస్తున్నారని మండిపడ్డారు. ఇంతకాలం భౌగోళిక పరిస్థితులు, ప్రపంచదేశాలతో పొత్తులు మాత్రమే దేశ శ్రేయస్సు, భద్రతకు హామీ ఇస్తాయని నమ్మేవాళ్లమని.. ఆ నమ్మకాలు ఇక ఎప్పటికీ తిరిగి రావని అన్నారు. ప్రపంచ దేశాలు ఒకదానిపై ఒకటి ఆధారపడితే ఎటువంటి సమస్యలు వస్తాయో ఇటీవల తలెత్తిన ఆర్థిక, ఇంధన, భౌగోళిక రాజకీయ సంక్షోభాలు తెలియజేశాయని కార్నీ (ఓజీటిఎ అజీటినివఎ) అన్నారు. ముఖ్యంగా ప్రపంచంలోని కొన్ని ప్రధాన శక్తులు సుంకాలు, ఆర్థిక వ్యవస్థలు, వాణిజ్య సరఫరా గొలుసులను ఆయుధంగా ఉపయోగించుకొని ఇతర దేశాలపై ఒత్తిడి తీసుకువస్తున్నాయన్నారు. వీటివల్ల కెనడా అనేక చిక్కులు ఎదుర్కొంటోందన్నారు. దీంతో ఇకనైనా ఇతర దేశాలపై ఆధారపడకుండా దేశీయ సామర్థ్యాలను బలోపేతం చేసుకోవడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రపంచ వాణిజ్య సంస్థ, ఐక్యరాజ్యసమితి వంటి సంస్థలు బలహీనపడ్డాయని, అందుకే దేశాలు మరింత స్వతంత్రంగా పని చేయవలసి వస్తుందన్నారు. ఒకే మనస్తత్వం కలిగిన దేశాలు భాగస్వాములుగా మారి.. సౌకర్యవంతమైన సంకీర్ణాలను నిర్మించుకోవాలని ప్రపంచ దేశాలకు కెనడా ప్రధాని పిలుపునిచ్చారు.

# నిబంధనల్లేని ప్రపంచంలోకి వెళ్తున్నాం



**హైదరాబాద్ పెన్ పవర్:** మనం నిబంధనల్లేని ప్రపంచంలోకి వెళు తున్నామని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ఆందోళన వ్యక్తంచేశారు. సుంకాల ద్వారా ఐరోపాను అణగదొక్కే అమెరికా ప్రయత్నం అర్థం లేనిదని వ్యాఖ్యానించారు. ట్రంప్ గ్రీన్‌లాండ్ హెచ్చరికల నేపథ్యంలో ట్రేడ్ బజూకాకు (అమెరికా సంస్థలు, వ్యక్తులపై ఆంక్షలు) సిద్ధంకావాలని ఐరోపా కూటమికి పిలుపునిచ్చారు. దావోస్‌లోని ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొన్న ఆయన ట్రంప్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 'ఇది నిబంధనల్లేని ప్రపంచంలోకి వెళ్లడమే. అంతర్జాతీయ చట్టం బలవంతుల పదఘట్టనల కింద నలిగిపోతోంది. సామ్రాజ్య వాదం మళ్లీ పురుడుపోసుకుంటోంది. ట్రంప్ అంతులేని సుంకాలు మౌలికంగా ఆమోదయోగ్యం కాదు. ఐరోపా నెమ్మదిగా సాగవచ్చు. కానీ అది చట్టానికి లోబడి పని చేస్తుంది. మేము బెదిరించే వారికంటే గౌరవానికి ప్రాధాన్యమిస్తాం. ట్రేడ్ బజూకా అమల్లో రెండో ఆలోచన చేయవద్దు. మనం నిర్బంధ వ్యతిరేక చర్యలను చేపట్టాల్సిన పరిస్థితిలో ఉన్నాం. ప్రస్తుత కఠిన పరిస్థితుల్లో మనం ఈ విధానాన్ని అనుసరించడానికి వెనుకాడకూడదు. ఈ విధానం రాజకీయ బ్లాక్ మెయిల్ నుంచి రక్షణకు రూపొందించింది. మనం దీనిని అమలుచేస్తే అమెరికాపై 81 బిలియన్ పౌండ్ల సుంకాలు పడతాయి. అయితే ఇది అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మనసును మార్చడానికి ఎంతవరకు ఉపయోగపడుతుందన్న భయాలూ ఉన్నాయి' అని మెక్రాన్ పేర్కొన్నారు.

## రిటైర్మెంట్ ప్రకటించిన సునీతా విలియమ్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత సంతతికి చెందిన ప్రముఖ నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్ రిటైర్ అవుతున్నట్లు ప్రకటించారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో తొమ్మిది నెలలుగా చివరి 10రోజుల అంతరిక్షయాత్ర సాగించిన ఆమె తన 27ఏళ్ల సుదీర్ఘ ప్రయాణానికి విరామం ప్రకటించనున్నట్లు మంగళవారం నాసా తెలిపింది. 2025 డిసెంబర్ 27నుండి రిటైర్మెంట్ అమల్లోకి వచ్చిందని పేర్కొంది.సునీతా విలియమ్స్ మానవ అంతరిక్షయానంలో ఒక మార్గదర్శకురాలిగా నిలిచారని నాసా నిర్వాహకుడు జారెడ్ ఐజాక్‌మాన్ పేర్కొన్నారు. "శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడంలో ఆమె చేసిన కృషి చంద్రునిపై మరియు మార్స్ వైపు ప్రయాణించేందుకు పునాది వేసింది. ఆమె అసాధారణ విజయాలు భవిష్యత్ తరాలకు మార్గనిర్దేశం చేయడంతో పాటు సరిహద్దులను అధిగమించేందుకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయి. పదవీ విరమణకు అభినందనలు, నాసా మరియు మన దేశానికి మీరు చేసిన సేవకు ధన్యవాదాలు" అని పేర్కొన్నారు.భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీతా 1998లో నాసాలో చేరారు. ఆమె మూడు సార్లు అంతరిక్ష నౌకలో ప్రయాణించి మొత్తం 608రోజులు అంతరిక్షంలోనే ఉన్నారు. తొమ్మిదిసార్లు స్పేస్‌వాక్ చేశారు. నాసా వ్యోమగామి అంతరిక్షంలో దీర్ఘకాలం గడిపిన వారి జాబితాలో ఆమె రెండవ స్థానంలో ఉన్నారు. నాసా బోయింగ్ స్టార్‌లైనర్ మరియు స్పేస్ ఎక్స్ క్రూ-9 మిషన్లలో 286రోజులు గడిపి నాసా వ్యోమగామి బుచ్ విల్మోర్‌తో సమానంగా, ఎక్కువ రోజులు అంతరిక్ష ప్రయాణం చేసిన జాబితాలో ఆమె ఆరవ స్థానంలో నిలిచారు. విలియమ్స్ తొమ్మిది సార్లు స్పేస్ వాక్ చేశారు. మొత్తం 62 గంటల 6 నిమిషాలు. ఏ మహిళా వ్యోమగామి ఈ రికార్డుకు చేరుకోలేదు. నాసా ఆల్‌టైమ్ జాబిఆలో ఇది నాల్గవది. అంతరిక్షలో పరిగెత్తిన (మారథాన్) మొదటి వ్యక్తి కూడా ఆమె కావడం గమనార్హం.

## నన్ను చంపేస్తే.. మీరు భూమ్మీదే ఉండరు:



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌ను ఉద్దేశించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనపై ఇరాన్ హత్యకు పాల్పడితే.. ఆ దేశాన్ని అమెరికా భూస్థాపితం చేస్తుందని వార్నింగ్ ఇచ్చారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో ఓ మీడియా సంస్థ ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. తనపై ఏదైనా హత్యాయత్నం జరిగి, దాని వెనక ఇరాన్ హస్తం ఉందని తేలితే.. ఆ దేశాన్ని తుడిచిపెట్టేయాలని తన సలహాదారులను ఆదేశించినట్లు ట్రంప్ ఇప్పటికే ఓసారి వ్యాఖ్యలు చేశారు. తాజాగా మరోసారి అదేతరహా హెచ్చరికలు చేశారు. కాగా.. డిసెంబర్ నుంచి పాలకులకు వ్యతిరేకంగా ఇరాన్ ప్రజలు నిరసనలు చేపడుతున్నారు. దీంతో తమ దేశంలో నెలకొన్న ఆందోళనలకు అమెరికా అధ్యక్షుడే కారణమని ఆయతుల్లా అలీ ఖమేనీ ఆరోపించగా.. ఇరాన్‌లో కొత్త నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని ఆ నిరసనకారులకు ట్రంప్ మద్దతు పలుకుతున్న సంగతి తెలిసిందే. సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఖమేనీ పాలన అంతం కావాలని పిలుపునిచ్చారు. ఈ వ్యాఖ్యలపై ఇరాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ నాయకుడే లక్ష్యంగా ఏదైనా దురాక్రమణ జరిగితే.. దానిని తాము దీటుగా ఎదుర్కొంటామని హెచ్చరించింది. ఇక ఈ నిరసనల్లో 5వేల మంది మృతి చెందినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. 26వేల మంది వరకు అరెస్టయినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ మరణాలకు అమెరికానే కారణమని ఖమేనీ నిందించారు.

## రైతుల, కార్మికుల ఆందోళనకు దిగివచ్చిన కర్ణాటక ప్రభుత్వం



**హైదరాబాద్ పెన్ పవర్:** భూసేకరణకు వ్యతిరేకంగా సుదీర్ఘంగా రైతులు, కార్మికులు ఐక్యంగా చేపట్టిన ఆందోళనలకు కర్ణాటక ప్రభుత్వం దిగివచ్చింది. హసన్ జిల్లాలోని చన్నరాయపట్నంలో 1,777 ఎకరాల వ్యవసాయ భూమిని రద్దు చేస్తున్నట్లు సిద్ధరామయ్య ప్రభుత్వం ప్రకటించింది. బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో అభివృద్ధి పేరుతో బిజెపి నేతృత్వంలోని గత ప్రభుత్వం ఈ భూమిని సేకరించింది. అయితే ఈ భూమిని కార్పోరేట్, రియల్‌ఎస్టేట్ ప్రయోజనాల కోసం వినియోగించడాన్ని స్థానిక రైతులు తీవ్రంగా వ్యతిరేకించారు. పోరాట కమిటీ బ్యానర్ కింద, వర్గ, సామూహిక మరియు దళిత సంఘాల విస్తృత కూటమి మద్దతుతో 1200 రోజులకు పైగా నిరసనలు చేపట్టడంతో ప్రభుత్వం భూమిని డీనోటిఫై చేస్తున్నట్లు ప్రకటించింది. శాంతియుతంగా నిరసన చేపడుతున్న రైతులపై గతేడాది 26న పోలీసులు విరుచుకుపడ్డారు. లాఠీచార్జ్ చేయడంతో పాటు పలువురిని అక్రమంగా నిర్బంధించారు. ఈ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహం వెల్లువెత్తింది. నిర్బంధాలను వ్యతిరేకిస్తూ పలు ప్రాంతాల్లో సంఘీభావ ప్రదర్శనలు చేపట్టారు. రైతులు సైతం తమ ఆందోళనను మరింత ఉధృతం చేశారు. బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో సాంస్కృతిక ప్రముఖులు, పౌర సంఘాలు మరియు సంయుక్త హోరాట కర్ణాటక బ్యానర్ కింద వేలాది మంది నిరసనలు చేపట్టారు. ఆందోళన ఉధృతం కావడం, రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమవడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దిగివచ్చారు. మూడేళ్ల నిరంతర ఆందోళనల తర్వాత, జులై 15న రైతుల డిమాండ్‌కు అనుగుణంగా భూమిని అధికారికంగా ఢీనోటిఫై చేసింది.

## త్వరలో స్పెయిన్ అధ్యక్షుడు భారత్ పర్యటన

**హైదరాబాద్ పెన్ పవర్:** త్వరలో స్పెయిన్ అధ్యక్షుడు పెడ్రో సాంచెజ్ పెరెజ్ ? కాస్టెజోన్ భారత్ పర్యటన ఉంటుందని ఆ దేశ విదేశాంగ మంత్రి జోస్ మాన్యుయెల్ అల్బారెస్ బుధవారం తెలిపారు. బహుశా ప్రధాని మోడీ కూడా స్పెయిన్‌ని సందర్శించే అవకాశం ఉందని ఆయన అన్నారు. నేడు దేశ రాజధాని ఢిల్లీలో భారత విదేశాంగ శాఖా మంత్రి జై శంకర్, స్పెయిన్ విదేశాంగ మంత్రి జోస్ మాన్యుయెల్ సమావేశమయ్యారు. ఇండో పసిఫిక్ మహాసముద్రాల ప్రాంతాల దేశాలతో, యూరోపియన్ యూనియన్ ద్వారా ద్వైపాక్షికంగా పనిచేయడానికి స్పెయిన్ ఆసక్తిగా ఉందని అల్బారెస్ ఈసందర్భంగా చెప్పారు. అలాగే ఇటీవల స్పెయిన్‌లో బార్సిలోనాలో జరిగిన రైలు ప్రమాదంలో 40 మందికిపైగా మృతి చెందారు. ఇలాంటి బాధాకరమైన సమయంలో స్పానిష్ ప్రజలకు, ఈ ఘటన బాధితులకు సంఘీభావ సందేశం పంపినందుకు భారత విదేశాంగశాఖామంత్రి జైశంకర్‌కు అల్బారెస్ కృతజ్ఞతలు తెలిపారు.

# హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ఫాలో అప్ సదస్సు



**హైదరాబాద్ పెన్ పవర్:** స్విడ్జర్లాండ్ లోని దావోస్ వేదికగా జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డిఇఈ) సదస్సులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక వినూత్న ప్రతిపాదన ఉంచారు. ప్రతి సంవత్సరం జూలై – ఆగస్టు నెలల్లో హైదరాబాద్‌లో 'మినీ దావోస్' తరహాలో ఫోరమ్ ఫాలో-అప్ సదస్సును నిర్వహించాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు. పెట్టుబడి ఒప్పందాలు, వాణిజ్య నిర్ణయాలకు ఏడాది కాలం చాలా ఎక్కువని, అందుకే ఆరు నెలలకోసారి సమీక్షా సమావేశం అవసరమని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ ప్రతిపాదనకు గ్లోబల్ బిజినెస్ లీడర్లు, పాలసీ నిర్ణేతలు ఏకగ్రీవంగా మద్దతు పలికారు. ఇదే వేదికపై సీఎం 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌ను ప్రదర్శిస్తూ, 30 వేల ఎకరాల్లో నిర్మిస్తున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ' మూసీ పునరుజ్జీవనం ద్వారా హైదరాబాద్‌ను 24 గంటలు పనిచేసే నగరంగా మారుస్తామని సీఎం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం 'తెలంగాణ ఎఐ ఇన్నోవేషన్ హబ్' (ంఎఐఊ), 'నెక్ట్స్-జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-2030'లను అధికారికంగా ఆవిష్కరించింది. 2030 నాటికి లైఫ్ సైన్సెస్ రంగంలో వి250 బిలియన్ల ఆర్థిక వ్యవస్థను సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి మెట్రో రైలు విస్తరణ, కొత్త ఆర్థిక వృద్ధి జోన్ల ప్రణాళికలను వివరించగా, ప్రముఖ సినీ నటుడు చిరంజీవి ఈ సమావేశంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ముఖ్యమంత్రితో కలిసి విందులో పాల్గొన్నారు. ఇటీవల నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ద్వారా ఇప్పటికే రూ. 5.75 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని, రానున్న రోజుల్లో తెలంగాణను గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## బ్రేకుల్లేకుండా దూసుకెళ్తున్న బంగారం



**హైదరాబాద్ పెన్ పవర్:** బంగారం, వెండి ధరల పెరుగుదలకు ఇప్పట్లో బ్రేకులు పడే పరిస్థితి కనిపించడం లేదు. అంతర్జాతీయంగా వాటికి ఉన్న డిమాండ్, ఇప్పుడున్న పరిస్థితుల్లో వాటిపైన పెట్టుబడులే సేఫ్ గా భావించి ఇన్వెస్ట్ చేస్తుండటంతో విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. మంగళవారం రాత్రి 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,49,780 (చితిబిష్ట్రనీబీబి ఊూ) ఉండగా.. బుధవారం ఉదయానికి ఏకంగా రూ.5 వేలకు పైగా పెరిగింది. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.5020 పెరిగి రూ.1,54,800కు చేరింది. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర కూడా ఏకంగా రూ.4600 పెరిగి రూ.1,41,900కు చేరింది. 18 క్యారెట్ల బంగారం ధర కూడా భారీగా పెరిగింది. 10 గ్రాముల ధర రూ.3770 పెరిగి రూ.1,16,110కి చేరింది. వెండిధర స్థిరంగా ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు వెండి ధర 94 డాలర్ల మార్కును దాటింది. ఔన్సు బంగారం ధర 4849 డాలర్లకు చేరింది. బంగారమే కాదు. ప్లాటినం ధరలు కూడా రోజురోజుకూ భారీగా పెరుగుతున్నాయి. బుధవారం 10 గ్రాముల ప్లాటినం ధర రూ.3460 పెరిగి రూ.71,780కి చేరింది. జనవరి 11 నుంచి నేటి వరకూ 100 గ్రాముల ప్లాటినం ధర రూ.65,460 వరకూ పెరిగింది.

# రిపబ్లిక్ డే సేల్‌లో భారీ ఆఫర్లు ప్రకటించిన అమెజాన్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ ఇటీవల గ్రేట్ రిపబ్లిచ్ డే సేల్‌ను ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సంస్థ అమెజాన్ బజార్ విభాగంలో కస్టమర్ల కోసం పెద్ద ఎత్తున ఫ్యాషన్, ఎలక్ట్రానిక్ యాక్సెసరీలు, ఇంకా అనేక విభాగాల్లో తక్కువ ధరలో ఉత్పత్తులను అందుబాటులో ఉంచింది. అమెజాన్ గ్రేట్ రిపబ్లిక్ డే సేల్ సందర్భంగా కస్టమర్లు డీల్స్, కొన్ని రకాల ప్రీమియం ఉత్పత్తులపై 80 శాతం వరకు ఆఫర్లను, రూ. 500 వరకు క్యాష్బ్యాక్ పొందవచ్చని తెలిపింది. ముఖ్యంగా రూ. 99 ప్రారంభ ధరలో లభించే వస్తువులపై అమెజాన్ బజార్లో మొదటి ఆర్డర్‌పై రూ.50 వరకు క్యాష్‌బ్యాక్ పొందవచ్చు. ఇదే సమయంలో ప్రైమ్ మెంబర్లకు 5 శాతం క్యాష్బ్యాక్, అమెజాన్ పే ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డ్‌పై నాన్-ప్రైమ్ మెంబర్లకు 3 శాతం, రూ. 2,500ల వరకు వెల్ గిఫ్ట్స్ సహా పేమెంట్, రివార్డులతో మరింత ఆదా చేసుకోవచ్చని కంపెనీ వెల్లడించింది. అర్హులైన కస్టమర్లు అమెజాన్ పే లేటర్ ద్వారా రూ. 60,000 వరకు తక్షణ క్రెడిట్ను కూడా యాక్సెస్ చేయవచ్చు. ప్రత్యేకమైన షాపింగ్ రివార్డులను కూడా ఆఫర్ చేస్తున్నట్టు కంపెనీ తెలిపింది. రోజుకు రూ. 99 ఈఎంఐ ద్వారా అమెజాన్ బజార్ నుంచి మొబైళ్లు, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, ఇతర పరికరాలను కొనుగోలు చేయవచ్చు. అంతేకాకుండా ఎంపిక చేసిన బ్యాంక్ కార్డులు, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు, ఈఎంఐ లావాదేవీలపై 10 శాతం వరకు తక్షణ డిస్కౌంట్లను కూడా లభిస్తుంది. అదనంగా క్యాష్బ్యాక్, రివార్డ్స్ లభిస్తాయి. వాటిలో రూ. 799ల కన్నా ఎక్కువ ఆర్డర్లపై ప్రైమ్ మెంబర్లకు 5 శాతం తగ్గింపు, రూ. 499 కన్నా ఎక్కువ విలువ గల ఆర్డర్లపై అందరికీ 10 శాతం క్యాష్బ్యాక్ ఉంటుందని అమెజాన్ తెలిపింది. ఇవి మాత్రమే కాకుండా అనేక రకాల ఆఫర్లు, క్యాష్‌బ్యాక్, రివార్డులను అందిస్తున్నట్టు పేర్కొంది.

## భారీగా పతనమైన స్టాక్ మార్కెట్లు

**హైదరాబాద్ పెన్ పవర్:** భారతీయ ఈక్విటీ మార్కెట్లు దేశీయ, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో భారీ పతనాన్ని చూశాయి. పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, మార్కెట్‌లో కీలక రిలయన్స్, బజాజ్ ఫైనాన్స్, ఎంఅండ్ఎం లాంటి షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడి కారణంగా మంగళవారం స్టాక్ మార్కెట్ బెంచ్‌మార్క్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ 1 శాతానికి పైగా పడిపోయాయి. అంతేకాకుండా, రూపాయి మారకంలో కొనసాగుతున్న బలహీనత, విదేశీ నిధుల ఉపసంహరణ పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ముఖ్యంగా ఐటీ షేర్లలో పెద్ద ఎత్తున అమ్మకాలు జరిగాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 2 శాతానికి పైగా పడిపోయింది. ఇటీవల కేంద్రం తెచ్చిన కొత్త లేబర్ కోడ్స్ వల్ల ఐటీ కంపెనీలు త్రైమాసిక ఫలితాలు తగ్గాయి. అందుకే ఐటీ స్టాక్స్‌పై ఒత్తిడి కనిపించింది. ట్రేడింగ్ సమయంలో కీలక సూచీ సెన్సెక్స్ ఓ దశలో 1,200 పాయింట్ల కంటే ఎక్కువ నష్టపోయినప్పటికీ, ఆ తర్వాత కోలుకున్నాయి. నిఫ్టీ సైతం 25,170 పాయింట్లకు చేరిన అనంతరం రికవరీ అయ్యాయి. ఫలితంగా మదుపర్ల సంపద ఒక్కరోజే రూ. 9.8 లక్షల కోట్లు కోల్పోయారు. బీఎస్ఈ మార్కెట్ క్యాప్ రూ. 455.4 లక్షల కోట్లకు చేరుకుంది. దీంతో మార్కెట్లు ముగిసే సమయానికి సెన్సెక్స్ 1,065.71 పాయింట్లు కుదేలై 82,180 వద్ద, నిఫ్టీ 353 పాయింట్లు క్షీణించి 25,232 వద్ద ముగిశాయి. సెన్సెక్స్ ఇండెక్స్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్ మాత్రమే లాభాలను దక్కించుకోగా, మిగిలిన అన్ని స్టాక్స్ దెబ్బతిన్నాయి. ఎటర్నల్, బజాజ్ ఫైనాన్స్, సన్‌ఫార్మా, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇండిగో షేర్లు 3 శాతానికి పైగా పడిపోయాయి.

# ఏఐ ప్రయోజనాలు అందరికీ సమానంగా దక్కాలి



**హైదరాబాద్ పెన్ పవర్:** కృత్రిమ మేధ (ఏఐ) ద్వారా కలిగే ప్రయోజనాలు అందరికీ సమానంగా దక్కాలని మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల అభిప్రాయపడ్డారు. 'విద్య లేదంటే ప్రభుత్వ విధానాల ద్వారా కావచ్చు.. ప్రతి ఒక్కరి జీవన విధానాన్ని మెరుగుపర్చడమే కృత్రిమ మేధ లక్ష్యంగా ఉండాల'ని ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సదస్సులో నాదెళ్ల పేర్కొన్నారు. ఏఐపై చర్చంతా సాంకేతిక కంపెనీల కేంద్రంగానే జరిగితే.. అది గాలిబుడగ లాగా అవుతుందని అన్నారు. కీలక ఔషధాలను మార్కెట్లోకి తేవడంలో, క్లినికల్ ట్రయల్స్‌ను వేగవంతం చేయడంలో ఫార్మా కంపెనీలకు కృత్రిమ మేధ ఎలా ఉపయోగపడుతుందో చూడాలన్నారు. రోజువారీ జీవితాన్ని ఏఐ ఏ విధంగా మెరుగుపరుస్తుందో పరిశీలించాల్సిన అవసరం ఉందని నాదెళ్ల వివరించారు. కేవలం వినియోగాన్ని పెంచడం పైనే కాకుండా.. ఏఐ ఆధారిత ఆర్థిక వృద్ధిపైనా దృష్టి పెట్టాలని సూచించారు. ఉత్పాదకతను పెంచడంలో, పని విధానాల్లో మార్పులు తేవడంలో ఏఐ, ఇతర అధునాతన సాంకేతికతలు ఎలా ఉపయోగపడుతున్నాయో ఆయన వివరించారు. ప్రజలు, సమాజం, దేశాలు, పరిశ్రమలకు కొంతైనా ప్రయోజనం కలిగేలా మనం ఏఐను వాడుతున్నామా? లేదా? అనే విషయాన్ని గమనిస్తూ ఉండాలని తెలిపారు.

# తన టీవీ వ్యాపారాన్ని చైనా కంపెనీకి అప్పగించిన సోనీ




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం సోనీ సంచలన నిర్ణయం తీసుకుంది. తన ప్రఖ్యాత హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్ వ్యాపారాన్ని చైనాకు చెందిన టీసీఎల్ ఎలక్ట్రానిక్స్ హోల్డింగ్స్ లిమిటెడ్‌కు అప్పగించనున్నట్లు మంగళవారం ప్రకటించింది.ఇందులో భాగంగా సోనీ బ్రావియా టీవీ బ్రాండ్‌తో సహా, తన హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్ విభాగంలో 51 శాతం మెజారిటీ వాటాను టీసీఎల్‌కు విక్రయించనుంది.ఈ ఒప్పందం ప్రకారం, ఇరు కంపెనీలు కలిసి ఒక జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేయనున్నాయి. ఇది 2027 ఏప్రిల్ నుంచి కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉంది. భవిష్యత్తులో టీవీలు సోనీ, బ్రావియా బ్రాండింగ్‌తోనే మార్కెట్లోకి వస్తాయి. అయితే, వాటిలో ఉపయోగించే డిస్‌ప్లే టెక్నాలజీ మాత్రం టీసీఎల్‌కు చెందినదిగా ఉంటుంది. తక్కువ లాభదాయకత ఉన్న టెలివిజన్ తయారీ రంగం నుంచి వైదొలగడంలో భాగంగానే జపాన్ కంపెనీ అయిన సోనీ ఈ నిర్ణయం తీసుకుంది.ఈ ఏర్పాటు ద్వారా తయారీ ఖర్చులు, నష్టాలను తగ్గించుకుంటూనే, ప్రపంచవ్యాప్తంగా తమ బ్రాండ్‌కు ఉన్న గుర్తింపును నిలుపుకోవచ్చని సోనీ భావిస్తోంది. ప్లేస్టేషన్ వ్యాపారంతో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సోనీ, కొంతకాలంగా సంప్రదాయ ఎలక్ట్రానిక్స్ నుంచి అధిక లాభాలు వచ్చే విభాగాలపై దృష్టి సారిస్తోంది.మరోవైపు, చైనాకు చెందిన అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ సంస్థల్లో ఒకటైన టీసీఎల్, ఇటీవలి కాలంలో ప్రపంచ మార్కెట్లో వేగంగా విస్తరిస్తోంది. ఇప్పటికే అమెరికాలో బడ్జెట్ టీవీ బ్రాండ్‌గా ఎదిగిన ఈ సంస్థ, బ్లాక్‌బెర్రీ, ఆల్కాటెల్ వంటి బ్రాండ్లను కూడా లైసెన్స్ కింద నడుపుతోంది. ఈ ఒప్పందం ద్వారా సోనీ బ్రాండ్ ఇమేజ్‌ను ఉపయోగించుకుని ప్రీమియం టీవీ సెగ్మెంట్‌లో తమ స్థానాన్ని బలోపేతం చేసుకోవాలని టీసీఎల్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం ద్వారా వినియోగదారులకు మరింత మెరుగైన అనుభూతిని అందిస్తామని సోనీ, టీసీఎల్ ప్రతినిధులు తెలిపారు.

# ఒక ఛార్జింగ్‌తో 543 కి.మీ. ప్రయాణం





**హైదరాబాద్ పెన్ పవర్:** తమ తొలి బ్యాటరీ విద్యుత్ ఎస్‌యూవీ 'అర్బన్ క్రూయిజర్ ఎబెల్లా'ను టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) మంగళవారం ఆవిష్కరించింది. జపాన్‌కు చెందిన టయోటా మోటార్ కార్పొరేషన్, కిర్లోస్కర్ గ్రూప్ సంయుక్త సంస్థే టయోటా కిర్లోస్కర్ మోటార్. జపాన్‌కే చెందిన సుజుకీ, టయోటా సంస్థల మధ్య ఉన్న అంతర్జాతీయ భాగస్వామ్యం నేపథ్యంలో, అర్బన్ క్రూయిజర్ ఎబెల్లాను టీకేఎంకు సుజుకీ మోటార్ గుజరాత్ సరఫరా చేస్తుంది. ఈ ఎస్‌యూవీకి 49 - 61 కిలోవాట్ అవర్ బ్యాటరీలు అమర్చినందున, ఒకసారి ఛార్జ్ చేస్తే 543 కి.మీ.ల వరకు ప్రయాణించవచ్చని టీకేఎం డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ తడషి అసజుమా తెలిపారు. 8 ఏళ్ల బ్యాటరీ వారంటీతో పాటు బ్యాటరీ-యాజ్-ఏ-సర్వీస్ పద్ధతిలోనూ ఈ కారు లభిస్తుంది. రూ.25,000 తో బుకింగ్ చేసుకోవచ్చని, ఫిబ్రవరి నుంచి డెలివరీ చేయవచ్చని సమాచారం. 5 మోటోటోన్, 4 డ్యుయల్ టోన్ రంగుల్లో లభిస్తుంది. ఈ వాహన ధరలు రూ.20.79- 24.49 లక్షల శ్రేణిలో ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఇ-విటారా పేరుతో ఈ వాహనాన్ని మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) విడుదల చేసింది. ఇ-విటారా, అర్బన్ క్రూయిజర్ ఎబెల్లా మోడళ్లు దాదాపుగా ఒకే రకంగా ఉంటాయని.. వాహన ముందు భాగం మాత్రం వేరుగా, సెగ్మెంటెడ్ ఎల్ఈడీ డీఆర్ఎల్‌తో ఉన్న హెడ్‌ల్యాంపులు, భిన్నమైన బంపర్ ఎబెల్లాకు అమర్చినట్లు టీకేఎం తెలిపింది.

# పిల్లల బ్రేక్ ఫాస్ట్ కోసం గాబరా పడుతున్నారా



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుత రోజుల్లో ఇళ్లు గడవాలంటే ఇంట్లోని తల్లిదండ్రులు ఇద్దరూ పనిచేయాల్సిన పరిస్థితి. పనొక్కటే కాదు ఇంట్లో పిల్లలను కూడా చూసుకోవాలి. ఇలాంటి సందర్భంలో ఇంట్లోని మహిళలు ఉదయం పిల్లలకు, భర్తలకు ఫుడ్ రెడీ చేసేందుకు చాలా ఇబ్బంది పడుతుంటారు. ఈ ఇబ్బంది లేకుండా పిల్లలకు ఆరోగ్యంతో పాటు త్వరగా రెడీ చేసే కొన్ని బ్రెక్‌ఫాస్ట్‌లు మేం చెప్పబోతున్నాం. మొదటగా స్ప్రౌట్స్ ఛాట్, దీన్ని రెడీచేసేకోవడం చాలా ఈజీ.. ఇందుకో మీకు మొలకెత్తిన శనగలు, పెసలు, పల్లీలు, ఉల్లి తరుగు, టొమాటో, పచ్చిమిర్చి, కొత్తిమీర, నిమ్మకాయలు ఉంటే సరిపోతుంది. దీన్ని ఎలా తయారు చేసుకోవాలంటే మొదటగా ఒక పెద్ద ప్లేట్ తీసుకొని.. మొలకెత్తిన శనగలు, పెసలు, పల్లీలు, ముందుగానే మరు తరతిగిపెట్టుకున్న కూరగాయల తురుము ఇందులో యాడ్ చేయండి. తర్వాత గినంత ఉప్పు, కారం, మసాలాలు వేసుకొని బాగా కలపండి. టేస్ట్ చూసుకొని ఉప్పు కారం, సరిపోయిందో లేదో చెక్ చేసుకోండి. అన్ని ఓకే అనుకుంటే ఒక ప్లేట్‌లోకి సర్వ్ చేసుకుంటే సరి.. టేస్టీ టేస్టీ స్ప్రౌట్స్ ఛాట్ రెడీ అయినట్టే. దీన్ని మీ పిల్లలకు బ్రేక్‌ఫాస్ట్‌లోకి ఇవ్వండి.మరమరాల మసాలా మిక్స్: దీని కోసం మీకు కొన్ని మురమురాలు, ఇంట్లో ఉండే ఉల్లి, టొమాటో, పచ్చిమిర్చి, పల్లీలు, పుట్నాల పొడి, కొత్తిమీర, నిమ్మరసం ఉంటే సరిపోతుంది. ఇందులో ఉన్న కూరగాయలను చిన్నగా తరుముకొని ఒక ప్లేట్‌లో పక్కకు తీసి ఉంచుకోంఇ. ఆ తర్వాత ఒక పెద్ద పాత్ర తీసుకొని అందులో ముందుగా మురమురాలు వేసి.. దానిలో మీరు ముందుగా కట్‌చేసి పెట్టుకున్న కూరగాయల తురుము వేయండి. తర్వాత తగినంత ఉప్పు, కారం, పల్లీల పొడి, చాట్ మసాలా, నిమ్మరసం వేసి బాగా మిక్స్ చేయండి. తర్వాత స్టౌపై చిన్న పాత్రవేసి తాలింపు వేసి అందులో ఈ మిక్స్‌ను వేసి కలపండి అంతే మీకు మరమరాల ఛాట్ రెడీ అయినట్టే.రవ్వ దోశ: పిల్లలకు దోశలు అంటే ఎంతో ఇష్టం. మీరు త్వరగా వాళ్లకు దోశలు ఇవ్వాలంటే ఉప్మా రవ్వదోశ చాలా బెటర్. ఇందుకోసం మీకు ఉప్మారవ్వ, బియ్యప్పిండి, పెరుగు, ఉల్లి, పచ్చిమిర్చి, అల్లం, కొత్తిమీర అవసరం అవుతుంది. ఇది తయారు చేసేందుకు ముందుగా ఒక పాత్ర తీసుకొని అందులో రవ్వ, బియ్యం పిండి తగినన్ని వాటర్ వేసి కలపండి. తర్వాత రుచికి సరిపడ ఉప్పు, జీలకర్ర, మిరియాల పొడి వేసి బాగా మిక్స్ చేయండి. అది కలిసిన తర్వాత ముందుగా తీసిపెట్టుకున్న పచ్చిమిర్చి, ఉల్లిపాయ, కొత్తిమీర, కరివేపాకు తురుము వేసి బాటా కలపండి. ఆ పేస్ట్‌ను పెనంపై దోశల్లా వేసుకొండి. కాజూ పోహా: పిల్లల బ్రేక్‌ఫాస్ట్‌లోకి ఇది చాలా హెల్దీ ఫుడ్. దీనికి కావాలసిన పదార్థాలు అటుకులు, ఉల్లి, బంగాళదుంప, పచ్చిమిర్చి, అల్లం, జీడిపప్పులు, పల్లీలు, కరివేపాకు, వీటన్నింటి తీసుకొని పక్కన ఉంచుకోండి. తర్వాత కూరగాయలను సన్నగా కట్‌చేసుకొని ఉంచుకోండి. తర్వాత ఆటుకులను వేడి నీటిలో వడకట్టి పెట్టుకోండి. ఇక దీన్ని తయారు చేసేందుకు ముందుగా స్టౌ పై ప్యాన్ పెట్టి అందులో కొన్ని ఆయిల్ వేసి.. ఇంట్లో ఉండే ఆవాలు, శనగపప్పు, పల్లీలు, కాజూ వేసి వేగించండి. తర్వాత ముందుగా కచ్‌చేసి పెట్టుకన్న కూరగాయల తరుగులను వేయండి. అవి వేగిన తర్వాత రుచికి సరిపడ ఉప్పు, కారం, అల్లం, మసాలా వేసి కలపండి. తర్వాత అటుకు యాడ్ చేసి కలిపి లో ఫ్లేమ్‌లో వేయించండి. తర్వాత నిమ్మరసం, కోత్తమీర, ఉల్లి తరుగు యాడ్ చేసికుని ప్లేట్‌లోకి సర్వ్ చేసుకుంటే వేడివేడి కాజూ పోహా రెడీ. వెజిటేబుల్ అమ్లెట్ ఇది తయారు చేసుకునేందుకు. మనకు అరకప్పు శనగపిండి, టేబుల్ స్పూన్ బియ్యం పిండి, సన్నగా తరిగిన టొమాటో, క్యారెట్లు , క్యాబేజీ, క్యాప్సికం, పచ్చిమిర్చి,-కొత్తిమీర ఉంటే సరిపోతుంది. ఇది తయారు చేసేందుకు ముందుగా ఒక పాత్రలో శనగపిండి, బియ్యప్పిండి, కారం, పసుపు, ఉప్పు, జీలకర్ర వేసి బాబా మిక్స్ చేయండి. దానిలో కొన్ని వాటర్ వేసి.. తర్వాత ముందుగా తరిగి పెట్టుకున్న కూరగాయాలు యాడ్ చేసిండి. దాన్ని బాగా కలిపి దోశల పిండిలా రెడీ చేసుకోండి తర్వాత దాన్ని అమ్లెట్ మాదిరి పెనంపై వేసి రెండు వైపులా బాగా కాల్చి ప్లేట్‌లోకి సర్వ్ చేసుకోండి. దానికి ఏదైనా చట్నీతో తింటే అదిరిపోతుంది.

# కడుపు నొప్పి వస్తున్నా లైట్ తీసుకుంటున్నారా!



కడుపు నొప్పి రావడం సహజం. ప్రతి ఒక్కరూ ఏదో ఒక సమస్యల వలన కడుపు నొప్పి వంటి ఇబ్బందులను ఎదుర్కుంటారు. అయితే కొంత మందికి మాత్రం ఎలాంటి సమస్యలు లేకున్నా పదే పదే కడుపు నొప్పి వస్తుంటుంది. దీంతో ఇదేదో నార్మల్ అనుకొని దానిని లైట్ తీసుకుంటారు. కానీ ఇది చాలా ప్రమాదకరం అంటున్నారు ఆరోగ్య నిపుణులు. కడుపు నొప్పి రాగానే కొంత మంది ఇది గ్యాస్ సమస్య అనుకుంటారు. ఇంకొంత మంది మాత్రం తీసుకున్న ఆహారం జీర్ణం అవ్వడం లేదు అందుకే ఈ సమస్యనేమో అనుకుంటారు. కానీ పిత్తాశయంలో రాళ్లు ( గాల్ బ్లాడర్ స్టోన్స్) ఉన్న సమయంలో కూడా పదే పదే కడుపు నొప్పి వస్తుందని చెబుతున్నారు ఆరోగ్య నిపుణు? గాల్ బ్లాడర్ స్టోన్స్ వచ్చినప్పుడు, ప్రాథమిక దశలో కడుపు నొప్పి అనేది పదే పదే వస్తుందంట. అయితే ఇలా పదే పదే వస్తూ ఉన్నప్పుడు తప్పకుండా వైద్యుడిని సంప్రదించాలని చెబుతున్నారు వైద్యులు. ఎక్కువగా ఈ నొప్పి అనేది కడుపుకు కుడి వైపున మొదలై, ఓ ఐదు నిమిషాల వరకు నొప్పి అలానే ఉంటుంది. అంతే కాకుండా ఈ నొప్పి కుడి భుజం, వీపై వైపుకు కూడా పాకుతుందంట. గాల్ బ్లాడర్ స్టోన్స్ లక్షణాల్లోకి వెళ్లితే.. గాల్ బ్లాడర్‌లో స్టోన్స్ ఉన్నప్పుడు కుడివైపు పై భాగంలో తీవ్ర మైన నొప్పి, వాంతులు , వికారం, విరేచనాలు, కడుపు ఉబ్బరం, పసుపు రంగులోకి కళ్లు మారడం, వెన్ను నొప్పి , జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తాయంట. అయితే ఈ గాల్ బ్లాడర్ స్టోన్స్ రావడానికి ముఖ్య కారణం తీసుకుంటన్న ఆహారం, జీవనశైలి అంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఆహారంలో పీచు పదార్థం తక్కువగా ఉండటం, ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోకపోవడం వలన ఇలాంటి సమస్య ఏర్పడుతుందంట. అందుకే ఆరోగ్యం విషయంలో తప్పకుండా జాగ్రత్తలు తీసుకోవాలంట. ముఖ్యంగా పిల్లల నుంచి పెద్ద వారి వరకు ఎవ్వరైనా సరే పదే పదే కడుపు నొప్పి వంటి సమస్యలు ఎదురు అయినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. నోట్ పై సమాచారం ఇంటర్నెట్ ఆధారంగా మాత్రమే ఇవ్వడం జరిగింది. టీవీ9 తెలుగు దీనిని ధృవీకరించలేదు.

# ఫాస్ట్‌గా బరువు తగ్గాలనుకుంటున్నారా?

బరువు తగ్గడం కేవలం తక్కువ తినడం కాదు, సరైన ఆహారం తీసుకోవడం. ఊబకాయం తగ్గాలంటే జీవక్రియను వేగవంతం చేసే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పాటించాలి. నిమ్మ, తేనెతో గోరువెచ్చని నీటితో రోజు ప్రారంభించండి. ఇడ్లీ, ఉప్మా, మొలకలు వంటి పోషక అల్పాహారం తినండి. భోజనంలో ఆకుకూరలు, తక్కువ అన్నం, సలాడ్ చేర్చండి. సాయంత్రం నట్స్, పండ్లు తీసుకోండి. రాత్రి తేలికపాటి భోజనం, వ్యాయామం, నీరు, నిద్ర బరువు తగ్గిస్తాయి. జంక్ ఫుడ్ మానండి. బరువు తగ్గడం అంటే తక్కువ తినడం మాత్రమే కాదు, సరైన ఆహారం తీసుకోవడం కూడా. నేటి జీవనశైలిలో సరైన పోషకాలు లేని ఆహారం కారణంగా చాలా మంది ఊబకాయంతో బాధపడుతున్నారు. సరైన పద్ధతిలో, సరైన ఆహారపు అలవాట్లను పాటిస్తూ ఉంటే..మీరు సులభంగా బరువు తగ్గవచ్చు. ఒక గ్లాసు గోరువెచ్చని నీటితో మీ రోజును ప్రారంభించండి. దానికి కొంచెం నిమ్మరసం, తేనె యాడ్ చేసుకోండి. దీని వల్ల మీ జీవక్రియ వేగవంతం అవుతుంది. ఇది శరీరం నుండి విషాన్ని బయటకు పంపి మీ చర్మాన్ని మెరుగుపరుస్తుంది. కాఫీ, టీలకు బదులుగా గ్రీన్ టీ తాగడం మంచిది. మార్నింగ్ బ్రేక్‌ఫాస్ట్ మంచి పోషకాలతో నిండి ఉండాలి. వేయించిన పూరీలు, వడలకు బదులుగా ఇడ్లీ, ఉప్మా లేదా ఓట్స్‌ను తీసుకోండి. మొలకెత్తిన ధాన్యాలు శరీరానికి అవసరమైన ప్రోటీన్‌లను అందిస్తాయి. బ్రేక్‌ఫాస్ట్ స్కిప్ చేయటం వల్ల మధ్యాహ్నం ఆకలిగా ఉంటుంది. కాబట్టి ఇది చాలా ముఖ్యం. మీ భోజనంలో తెల్ల బియ్యం మొత్తాన్ని తగ్గించి, ఆకుకూరలు, కూరగాయలకు ప్రాధాన్యత ఇవ్వండి. పాలిష్ చేయని బియ్యం, జొన్న రొట్టెలు తినడం మంచిది. భోజనానికి ముందు గ్రీన్ బఠానీలు, క్యారెట్లు, కీర వంటి వాటితో సలాడ్ తినడం వల్ల కడుపు నిండినట్లు అనిపిస్తుంది. మీరు తక్కువ తింటారు. క్రమం తప్పకుండా పెరుగు లేదా మజ్జిగ తీసుకోవటం వల్ల జీర్ణక్రియకు సహాయపడుతుంది.సాయంత్రం ఆకలిగా అనిపించినప్పుడు చిప్స్, బిస్కెట్లు తినడం మానుకోండి.



బదులుగా, కొన్ని బాదం, వాల్‌నట్స్ లేదా ఒక పండు ముక్క తినండి. ఇది రాత్రి భోజనం వరకు మీ ఆకలిని అదుపులో ఉంచుతుంది. బరువు తగ్గాలనుకునే వారు వీలైనంత త్వరగా రాత్రి భోజనం ముగించాలి. రాత్రి 8 గంటల లోపు రాత్రి భోజనం చేయడం ముఖ్యం. రాత్రి తేలికపాటి భోజనం తినండి. మొక్కజొన్న గంజి లేదా సూప్ ఉత్తమ ఎంపికలు. రాత్రి భోజనం చేసిన వెంటనే పడుకునే బదులు, కాసేపు నడవడం అలవాటు చేసుకోండి. ప్రోటీన్ సమృద్ధిగా ఉండే ఆహారపదార్థాలు తీసుకోవడం వలన కండరాలు బలంగా ఉంటాయి, జీవక్రియ మెరుగవుతుంది. గుడ్లు, పప్పులు,టోఫు, చేపలు, చికెన్, పనీర్, యోగర్ట్ వంటి ఫుడ్ తీసుకోవాలి. ప్రోటీన్ పుష్కలంగా ఉండే ఈ ఫుడ్, శరీర బరువు తగ్గేందుకు దోహదం చేస్తుంది. ముఖ్యంగా బరువు తగ్గాలనుకునే వారు వీలైనంత త్వరగా రాత్రి భోజనం ముగించాలి. రాత్రి 8 గంటల లోపు తినేయాలి. రాత్రి తేలికపాటి భోజనం చేయండి.. మొక్కజొన్న గంజి లేదా సూప్ వంటివి బెస్ట్. రాత్రి భోజనం చేసిన వెంటనే పడుకునే బదులు, కాసేపు నడవడం అలవాటు చేసుకోండి. దీనితో పాటు, మీరు ప్రతిరోజూ కనీసం 3-4 లీటర్ల నీళ్లు తాగాలి.. మీరు ఈ డైట్ ప్లాన్‌లో తగినంత నిద్ర, క్రమం తప్పకుండా వ్యాయామం కూడా పాటిస్తూ ఉంటే.. ఫలితాలు చాలా త్వరగా కనిపిస్తాయి. వాకింగ్ చేయడం వలన ఫ్యాట్ మెటబాలిజం మెరుగవుతుంది, జీర్ణశక్తి పెరిగి, ఒత్తిడి తగ్గుతుంది. రెగ్యులర్‌గా వాకింగ్ చేయడం వలన శరీర బరువును నియంత్రణలో ఉంచుకోవచ్చు. బరువు తగ్గాలనుకునే వారికి మంచి నిద్ర ఎంతో అవసరం. దీని వలన ఆకలి హార్మోన్స్ నియంత్రణలో ఉంటాయి.రోజుకు కనీసం 7 నుండి 9 గంటల నిద్రపోవడం మంచిది. చక్కెర, స్వీట్లు, జంక్ ఫుడ్‌ను పూర్తిగా నివారించాలి.

# చేతిలో ఉన్న వస్తువు కిందపడిపోతే భవిష్యత్తుకు సంకేతమా?



మన దేశంలో మత గ్రంథాలు, శకునాలు, అశుభ సంకేతాలకు అధిక ప్రాముఖ్యత ఇస్తారు. ఇవి భవిష్యత్తును సూచించే సందేశాలుగా భావిస్తారు. శుభ శకునాలు విజయాన్ని సూచిస్తే, అశుభ సంకేతాలు హెచ్చరికలు లేదా ఇబ్బందులను తెలుపుతాయి. ఉప్పు, నూనె, పాలు వంటివి చేతి నుండి జారిపడటం అశుభంగా పరిగణిస్తారు. వీటి వెనుక మానసిక, సామాజిక అర్థాలు కూడా ఉన్నాయి, అవి మనల్ని మరింత జాగ్రత్తగా ఉండేలా చేస్తాయి. మన దేశంలో చాలా మంది ప్రజలు ఎక్కువగా మత గ్రంథాలు శకునాలు, అశుభ సంకేతాలకు ప్రత్యేక ప్రాముఖ్యతను ఇస్తుంటారు. పురాతన కాలం నుండి మనుషులు మన చుట్టూ ఉన్న ప్రకృతి, జంతువులు, పక్షులు, సంఘటనలు, యాదృచ్ఛికాల ద్వారా భవిష్యత్తు సంకేతాలను గుర్తించడానికి ప్రయత్నించారు. వేదాలు, పురాణాలు, రామాయణం, మహాభారతం, అలాగే జ్యోతిష్యం, శకునాలు, అశుభ సంకేతాలను ప్రస్తావిస్తాయి. శకునం అనేది శుభ సంకేతం. ఇది సానుకూల ఫలితాలు, విజయం, శ్రేయస్సు, భద్రతకు సూచనగా పరిగణించబడుతుంది. అయితే అశుభ సంకేతం అనేది మంచిది కాదని అంటారు. ఇది ఇబ్బందులు, హెచ్చరికల గురించి సూచిస్తుంది. ఉదాహరణకు శుభకార్యాల సమయంలో కుడి వైపు నుండి ఎగురుతున్న పక్షి, దేవుడిని చూడటం లేదా మంచి మాటలు వినడం శుభ సంకేతంగా పరిగణించబడుతుంది. పనికి వెళ్లేటప్పుడు అడ్డంకులను ఎదుర్కొన్నప్పుడు, కొన్ని వస్తువులు పడిపోవడం లేదా ప్రమాదవశాత్తు జరిగిన సంఘటనలను అశుభ సంకేతంగా పరిగణిస్తారు. మతపరంగా ఈ సంకేతాలను దేవుడు లేదా ప్రకృతి నుండి వచ్చిన సూక్ష్మ సందేశాలుగా పరిగణిస్తారు. ఇవి ఒక వ్యక్తి సరైన నిర్ణయం తీసుకోవడానికి సహాయపడతాయి. చెడు శకునాల ప్రాముఖ్యత మూఢనమ్మకాలకే పరిమితం కాదు. వాటి వెనుక మానసిక, సామాజిక అర్థాలు కూడా ఉన్నాయి. చాలా సార్లు చెడు శకునాలు ఒక వ్యక్తి జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తుంటాయి. ఇది అతని నిర్ణయాన్ని మరోసారి పరిశీలించుకునేలా చేస్తుంది. తొందరపడకుండా, సాధ్యమయ్యేంత వరకు ప్రమాదాలను తగ్గించేలా చేస్తుంది. దీనికి విరుద్ధంగా శుభ శకునాలు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి. మనసుకు సానుకూల శక్తిని ఇస్తాయి. పనిలో ముందుకు వెళ్లేందుకు అతన్ని ప్రేరేపిస్తాయి.నూనె ? శాస్త్రాలలో నూనె శని దేవునికి సంబంధించినది. చేతుల నుండి నూనె పదే పదే జారిపడితే, అది భవిష్యత్తులో ఆర్థిక ఇబ్బందులకు సంకేతంగా పరిగణించబడుతుంది. తరచుగా నూనె పడిపోవడం కూడా కుటుంబ సభ్యులను ప్రభావితం చేసే పెద్ద సమస్యకు సంకేతం కావచ్చు. హారతి పళ్ళెం ? పూజ చేస్తున్నప్పుడు హారతి పళ్ళెం చేతి నుండి పడిపోవడం చాలా అశుభ సంకేతంగా పరిగణిస్తారు. హారతి పళ్ళెం చేతి నుండి పడిపోవడం అంటే, దేవుని అసంతృప్తికి సంకేతం కావచ్చు. ఏదైనా శుభ కార్యంలో అడ్డంకులు ఏర్పడటానికి కూడా ఇది సంకేతం కావచ్చునని భావిస్తారు.

# ప్రయాణాల్లో వాంతులు ఎందుకు అవుతాయ్?



ప్రయాణం సమయంలో తల తిరగడం, వాంతులు అవ్వడం లాంటి సమస్యలు రావడాన్ని మోషన్ సిక్ నెస్ అంటారు. కొంతమందిలో ఎక్కువగా ఘాట్ రోడ్లలో ప్రయాణం చేసేటప్పుడు, మలుపుల వద్ద ఇలాంటి సమస్యలు ఎక్కువగా ఫేస్ చేస్తారు. మనం ప్రయాణం చేసేటప్పుడు కళ్ళు, చెవుల నుంచి మెదడుకు వేరు వేరు సంకేతాలు చేరతాయి. బస్సు, కారు, రైలు, విమానం వాహనం ఏదైనా ప్రయాణంలో వామిటింగ్ జరగడం అనేది చాలామందిలో సర్వసాధారణంగా కనిపిస్తుంది. అయితే వైద్యభాషలో దీనిని మోషన్ సిక్ నెస్ అని అంటారు. వెహికల్‌లో ప్రయాణం అవుతున్న సమయాల్లో ఎందుకు జరుగుతుంది అంటే.. ప్రయాణంలో వాంతులు చేసుకోవడానికి మనసు, కళ్ళు, శరీర సమతుల్యత మధ్య కోఆర్డినేషన్ మిస్ అవుతుంది అని పరిశోధకులు చెబుతున్నారు. అయితే ప్రయాణంలో వామిటింగ్ జరగకుండా ఉండడానికి కొన్ని చిట్కాలు పాటిస్తే బాగుంటుందని వారు అంటున్నారు. ప్రయాణం సమయంలో తల తిరగడం, వాంతులు అవ్వడం లాంటి సమస్యలు రావడాన్ని మోషన్ సిక్ నెస్ అంటారు. కొంతమందిలో ఎక్కువగా ఘాట్ రోడ్లలో ప్రయాణం చేసేటప్పుడు, మలుపుల వద్ద ఇలాంటి సమస్యలు ఎక్కువగా ఫేస్ చేస్తారు. మనం ప్రయాణం చేసేటప్పుడు కళ్ళు, చెవుల నుంచి మెదడుకు వేరు వేరు సంకేతాలు చేరతాయి. ప్రయాణంలో ఉన్నప్పుడు కళ్ళు కిందికి గమనిస్తున్నప్పుడు.. మీరు కదలడం లేదని మెదడుకు సంకేతమందుతుంది. కానీ చెవుల్లోని బ్యాలెన్స్ సిస్టం శరీరం కదులుతుందని మెదడుకు చెబుతుంది. ఈ డిఫరెంట్ సంకేతాలు శరీరంలోకి విషపూరితమైన పదార్థాలు ఏదో ప్రవేశించిందని శరీరాన్ని అలర్ట్ చేస్తుంది. దాన్ని ఎలా ఎదుర్కోవాలో శరీరానికి తెలిసిన ఏకైక మార్గం దానిని బయటకు పంపడం అంటే వామిటింగ్ చేసుకోవడం అని ఢిల్లీలోని ప్రముఖ వైద్యులు మొహసిన్ వలి తెలిపారు. ఈ వామిటింగ్ నివారణకు కిటికీలోంచి దూరంగా చూడడం వల్ల కళ్ళు, చెవుల నుంచి వచ్చే సంకేతాలను మెదడు అర్థం చేసుకుని సమతుల్యం చేస్తుంది. దీనివల్ల శరీరానికి కలిగే అసౌకర్యం తగ్గి వాంటింగ్ సెన్సేషన్ తగ్గిపోతుంది. ఈ మోషన్ సిక్ నెస్ అనేది ప్రతి ముగ్గురిలో ఒకరిని ప్రభావితం చేసే అంశంగా వైద్యులు చెప్తున్నారు. ఖాళీ కడుపుతో ప్రయాణం, బాగా తిని ప్రయాణం చేయడం, లాంటివి చేయడం వల్ల కూడా కొంతవరకు ప్రయాణాల్లో వాంతులు జరుగుతుంటాయి.

# ఉదయం లేచినప్పుడు అలసిపోయినట్లు అనిపిస్తుందా?



చాలా మందికి రకరకాల సమస్యలు ఉంటాయి. వాటిని అధిగమించాలంటే రోజు వారీగా కొన్ని పనులు చేయడం చాలా ముఖ్యం. మీరు ఉదయాన్ని నిద్రలేవగానే అలసిపోయినట్లుగా అనిపించినట్లయితే అందుకు కొన్ని కారణాలు ఉన్నాయి. వాటిని నివారించినట్లయితే మీరు హుషారుగా ఉంటారు.శీతాకాలంలో చాలా మంది ఉదయం నిద్రలేచిన తర్వాత బరువుగా, అలసటగా భావిస్తారు. కొంతమందికి బరువు లేదా నొప్పి, శరీర నొప్పులు వంటి సమస్యలు ఎదురవుతాయి. చలి రోజులు సాధారణంగా రోజువారీ దినచర్యకు అంతరాయం, ఎక్కువసేపు నిద్రపోవడం, తక్కువ సూర్యకాంతి మొదలైన వాటి కారణంగా శరీరంలో కొన్ని మార్పులకు కారణమవుతాయి. అయితే ఈ సమస్యలు ప్రతిరోజూ సంభవిస్తే వాటిని సాధారణమైనవిగా విస్మరించకూడదు. ఉదయం నిరంతరం అలసట అనేది శరీరంలోని సమస్యకు సంకేతం కావచ్చు. అందుకే భవిష్యత్తులో మరిన్ని సమస్యలు రాకుండా ఉండాలంటే ఈ సమస్యలకు కారణాన్ని ముందుగానే అర్థం చేసుకోవాలి. నిద్ర నాణ్యత సరిగా లేకపోవడం: ఆలస్యంగా నిద్రపోవడం, మొబైల్ ఫోన్లు వాడటం, అర్ధరాత్రి తరచుగా మేల్కొనడం వల్ల శరీరానికి సరైన విశ్రాంతి లభించదు. దీనివల్ల ఉదయం అలసట వస్తుంది.డీహైడ్రేషన్: చాలా మంది శీతాకాలంలో దాహం తక్కువగా ఉండటం వల్ల తక్కువ నీరు తాగుతారు. డీహైడ్రేషన్ వల్ల కండరాలు బలహీనపడి శరీరం బద్ధకంగా అనిపిస్తుంది.విటమిన్-డి లోపం: చలి రోజుల్లో ఎండ తక్కువగా ఉంటుంది. విటమిన్ డి లోపం వల్ల శక్తి స్థాయిలు తగ్గి అలసట కలుగుతుంది. ఒత్తిడి: అధిక ఆందోళన లేదా ఒత్తిడి మెదడు విశ్రాంతి తీసుకోకుండా నిరోధిస్తుంది. ఇది ఉదయం అలసటకు ప్రధాన కారణం. శారీరక శ్రమ లేకపోవడం: వ్యాయామం లేకపోవడం, ఎక్కువసేపు మంచం మీద పడుకోవడం వల్ల కండరాల చురుకుదనం తగ్గడం, బలహీనత ఏర్పడవచ్చు.మిమ్మల్ని మీరు ఎలా చురుగ్గా ఉంచుకోవాలి: ఎల్లప్పుడూ ఒక నిర్దిష్ట సమయానికి పడుకోవడం, ఉదయాన్నే లేవడం అలవాటు చేసుకోండి. దాహం వేయకపోయినా రోజులో సరైన మొత్తంలో నీరు తాగాలి. ఎండలో కూర్చోవడం: పగటిపూట కొద్దిసేపు ఎండలో కూర్చోవడం వల్ల విటమిన్ డి లభిస్తుంది. మనస్సును తాజాగా ఉంచుతుంది. ఉదయం లేచి కాసేపు నడవడం లేదా తేలికపాటి వ్యాయామాలు చేయడం వల్ల మీ శరీరానికి బలం చేకూరుతుంది. సమతుల్య ఆహారం తీసుకోండి, ఎక్కువ నూనె, కారంగా ఉండే ఆహారాన్ని నివారించండి.

## ఇంట్లో ఇన్సులిన్ ఎలా పెంచాలి?

ఇన్సులిన్ మొక్కను కుండీలో నాటడం చాలా సులభం. మొదట్లో పెరుగుదల నెమ్మదిగా అనిపించవచ్చు. కానీ తర్వాత అది వేగంగా వ్యాపిస్తుంది. బాగా నీరు కారుతున్న కుండీ మట్టిని వాడండి. వర్మి కంపోస్ట్‌లను సమాన భాగాలుగా కలపండి. ఇండోర్ మొక్కలు ఇకపై కేవలం అలంకారంగా మాత్రమే కాదు, ఆరోగ్యాన్ని మెరుగుపరిచే సహజ మార్గంగా కూడా మారుతున్నాయి. ఇన్సులిన్ మొక్క అటువంటి ప్రయోజనకరమైన మొక్క, దాని ఔషధ గుణాలు, ఆకర్షణీయమైన ఆకుల కోసం ప్రజలలో ప్రసిద్ధి చెందింది. మీరు కూడా మీ ఇంట్లో ఇన్సులిన్ మొక్కను నాటాలనుకుంటే ఈ మొక్కల సంరక్షణ కోసం కొన్ని సులభమైన చిట్కాలు ఇక్కడ ఉన్నాయి. శాస్త్రీయంగా కోస్టస్ ఇగ్నియస్ అని పిలిచే ఈ ఇన్సులిన్ మొక్క భారతదేశంలోని వెచ్చని, తేమతో కూడిన ప్రాంతాలకు చెందినది. దీనిని సాధారణంగా "స్పైరల్ ఫ్లాగ్" అని కూడా పిలుస్తారు. దీని విశాలమైన, ప్రకాశవంతమైన ఆకుపచ్చ ఆకులు సర్పిలాకార నమూనాలో పెరుగుతాయి. ఈ మొక్క ఔషధంగా ఉన్నంత అందంగా ఉంటుంది. దీని ఆకులను సాంప్రదాయ వైద్యంలో పరిమిత పరిమాణంలో ఉన్నప్పటికీ, మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉపయోగిస్తున్నారు. రోజుకు ఒక ఆకు నమిలితే డయాబెటిస్ అదుపులో ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఈ మొక్క జాగ్రత్తగా పెంచాల్సి ఉంటుంది. పచ్చని ఇంటి వాతావరణం, ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ మొక్కను నర్సరీలో లభిస్తుంది. లేదా వ్యవసాయ అధికారులను సంప్రదించి కూడా ఈ మొక్కను తీసుకోవచ్చు. వారైతే ఉచితంగానే అందిస్తారు. ఇన్సులిన్ మొక్కను కుండీలో నాటడం చాలా సులభం. మొదట్లో పెరుగుదల నెమ్మదిగా అనిపించవచ్చు. కానీ తర్వాత అది వేగంగా వ్యాపిస్తుంది. బాగా నీరు కారుతున్న కుండీ మట్టిని వాడండి. వర్మి కంపోస్ట్‌లను సమాన భాగాలుగా కలపండి. మట్టి కుండలో ఈ మిశ్రమంతో నింపండి. కొద్దిగా హెడ్‌రూమ్ ఉంచండి. కోత లేదా రైజోమ్‌ను ఒక కోణంలో చొప్పించండి. మట్టిని సున్నితంగా కిందికి నొక్కండి. అలాగే బాగా నీరు పెట్టండి.

## ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్ లో రెండో స్థానానికి పడిపోయిన కోహ్లీ... నెంబర్ వన్ ఎవరంటే...!

- ఐసీసీ వన్డే బ్యాటింగ్ ర్యాంకులు విడుదల
- అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్న న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్
- భారత్‌తో సిరీస్‌లో మిచెల్ అద్భుత ప్రదర్శన
- మూడు వన్డేల సిరీస్‌లో 352 పరుగులతో సత్తా చాటిన కివీస్ ఆల్ రౌండర్
- మిచెల్ ఖాతాలో 845 పాయింట్లు, కోహ్లీ ఖాతాలో 795 పాయింట్లు



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో తన అగ్రస్థానాన్ని కోల్పోయాడు. న్యూజిలాండ్ ఆల్ రౌండర్ డారిల్ మిచెల్ అద్భుత ప్రదర్శనతో అతడిని వెనక్కి నెట్టి నెంబర్ వన్ బ్యాటర్‌గా నిలిచాడు. ఐసీసీ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో ఈ మార్పు చోటుచేసుకుంది.

ఇటీవల భారత్‌తో ముగిసిన మూడు వన్డేల సిరీస్‌లో డారిల్ మిచెల్ అసాధారణ ఫామ్‌తో చెలరేగాడు. ఈ సిరీస్‌లో ఏకంగా 352 పరుగులు సాధించాడు. ఇందులో రెండు శతకాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా నిర్ణయాత్మక మూడో వన్డేలో మిచెల్ 137 పరుగులతో రాణించి జట్టుకు చారిత్రక సిరీస్ విజయాన్ని అందించాడు. ఇదే మ్యాచ్‌లో కోహ్లీ కూడా శతకం (124) బాదినప్పటికీ, మిచెల్ ఇన్నింగ్స్ ముందు అది సరిపోలేదు. సిరీస్ ఆసాంతం చూపిన ఈ నిలకడైన ప్రదర్శన అతడి ర్యాంకింగ్‌ను అమాంతం పెంచింది.

తాజా ర్యాంకింగ్స్ ప్రకారం, డారిల్ మిచెల్ 845 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, విరాట్ కోహ్లీ 795 పాయింట్లతో రెండో స్థానానికి పడిపోయాడు. వీరి తర్వాత ఆఫ్ఘనిస్థాన్‌కు చెందిన ఇబ్రహీం జద్రాన్, టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. గతేడాది నవంబర్‌లో కేవలం మూడు రోజులు మాత్రమే నెంబర్ 1 స్థానంలో ఉన్న మిచెల్, ఇప్పుడు మరోసారి ఆ ర్యాంకును దక్కించుకోవడం విశేషం.

## ఐపీఎల్ 2026 షెడ్యూల్‌పై ఎన్నికల ప్రభావం.. వేదికలపై ఫ్రాంచైజీల మల్లగుల్లాలు

- రాష్ట్రాల ఎన్నికల కారణంగా ఐపీఎల్ 2026 షెడ్యూల్ విడుదలలో జాప్యం
- ఎన్నికల తేదీలు ఖరారయ్యాకే షెడ్యూల్ ప్రకటిస్తామన్న బీసీసీఐ
- ఆర్‌సీబీ, రాజస్థాన్ రాయల్స్ హోం గ్రౌండ్స్‌పై వీడని సందిగ్ధత
- వారం రోజుల్లో వేదికలు ఖరారు చేయాలని ఫ్రాంచైజీలకు ఆదేశం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్ షెడ్యూల్ విడుదలలో జాప్యం జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. పలు రాష్ట్రాల్లో జరగనున్న ఎన్నికల తేదీలను ఎన్నికల సంఘం ప్రకటించే వరకు వేచి చూడాలని బీసీసీఐ నిర్ణయించింది. మరోవైపు రాజస్థాన్ రాయల్స్ (ఆర్‌ఆర్), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఫ్రాంచైజీలు తమ హోం గ్రౌండ్స్ విషయంలో ఇంకా స్పష్టత ఇవ్వకపోవడం కూడా ఈ ఆలస్యానికి మరో కారణంగా తెలుస్తోంది.అసోం, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల తేదీలు ఖరారైన తర్వాతే వాటికి ఇబ్బంది కలగకుండా ఐపీఎల్ షెడ్యూల్‌ను రూపొందించాలని బీసీసీఐ భావిస్తోంది. "ఎన్నికల తేదీల ప్రకటన కోసం ఎదురుచూస్తున్నాం. అవి ఖరారయ్యాక, మ్యాచ్‌లకు, పోలింగ్‌కు అడ్డంకులు లేకుండా షెడ్యూల్ తయారు చేస్తాం" అని బీసీసీఐ వర్గాలు ఐఏఎన్ఎస్‌కు తెలిపాయి.

**ఆర్‌సీబీ, ఆర్‌ఆర్ ఫ్రాంచైజీల హోం గ్రౌండ్స్‌పై గందరగోళం**

మరోవైపు ఆర్‌సీబీ, ఆర్‌ఆర్ ఫ్రాంచైజీల హోం గ్రౌండ్స్‌పై నెలకొన్న గందరగోళం కూడా షెడ్యూల్‌పై ప్రభావం చూపుతోంది. గతేడాది ఐపీఎల్ 2025 విజయోత్సవాల సమయంలో చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాటలో 11 మంది మరణించడంతో అక్కడ మ్యాచ్‌ల నిర్వహణను నిలిపివేశారు. ఇటీవల కొన్ని షరతులతో కూడిన అనుమతులు లభించినప్పటికీ, ఆర్‌సీబీ తమ హోం మ్యాచ్‌లన్నీ బెంగళూరులోనే ఆడుతుందా? లేక కొన్ని మ్యాచ్‌లను రాయ్‌పూర్‌కు తరలిస్తుందా? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

ఇక, రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్ (ఆర్‌సీఏ)లో నెలకొన్న పరిపాలనా సమస్యల కారణంగా జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియం లభ్యతపై సందేహాలున్నాయి. ఈ క్రమంలో పుణే వంటి బ్యాకప్ వేదికను సిద్ధం చేసుకోవాలని బీసీసీఐ ఇప్పటికే రాజస్థాన్ ఫ్రాంచైజీకి సూచించింది. ఈ రెండు ఫ్రాంచైజీలు తమ హోం వేదికలను వారం రోజుల్లో ఖరారు చేయాలని బీసీసీఐ ఆదేశించినట్లు సమాచారం. ఈ రెండు అంశాలు తేలిన తర్వాతే ఐపీఎల్-2026 పూర్తి షెడ్యూల్‌పై స్పష్టత రానుంది.

## అన్ని వరల్డ్ కప్‌లు ఆడాను.. ఇంట్లో కూర్చొని టోర్నీ చూడడం కొత్తగా అనిపిస్తుంది: రోహిత్ శర్మ

**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా దిగ్గజ క్రికెటర్ రోహిత్ శర్మకు ఎవరికీ లేని ఒక ప్రత్యేక రికార్డ్ ఉంది. అదేంటో కాదు ఇప్పటివరకు జరిగిన అన్ని టీ20 వరల్డ్ కప్ టోర్నీలు హిట్ మ్యాన్ ఆడేశాడు. 2007లో తొలిసారి మొదలైన టీ20 వరల్డ్ కప్ లో రోహిత్ ప్లేయర్ గా ఉన్నాడు. తొలిసారి జరిగిన ఈ పొట్టి ప్రపంచ కప్ ను ఇండియా సొంతం చేసుకుంది. అప్పటి నుంచి వరుసగా రోహిత్ టీ20 వరల్డ్ కప్ మిస్ కాకుండా ఆడాడు. ఓవరాల్ గా జరిగిన 9 టీ20 వరల్డ్ కప్ హిట్ మ్యాన్ ఆడి ఈ ఫార్మాట్ లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాడు. 2024 టీ20 వరల్డ్ కప్ టైటిల్ గెలిచిన తర్వాత రోహిత్ శర్మ టీ20 ఫార్మాట్ కు రిటైర్మెంట్ ప్రకటించాడు.




2026 టీ20 వరల్డ్ కప్ ఇండియాలోనే జరగనుంది. తొలిసారి రోహిత్ శర్మ లేకుండా ఇండియా టీ20 వరల్డ్ కప్ ఆడుతుంది. ఈ భావన తనకు చాలా కొత్తగా ఉందని హిట్ మ్యాన్ తెలిపాడు.. రోహిత్ శర్మ మాట్లాడుతూ.. " ఈ సారి జరగబోయే టీ20 వరల్డ్ కప్ ను మేము ఇంట్లో కూర్చొని చూడడం చాలా కొత్తగా అనిపిస్తుంది. ఈ టోర్నీ ప్రారంభమైన తర్వాత ప్రతి వరల్డ్ కప్ నేను ఆడాను. తొలిసారి జట్టులో లేకపోవడం చాలా భిన్నంగా అనిపిస్తుంది. జట్టు టీ20 మ్యాచ్ లు ఆడుతున్నప్పుడు నేను జట్టులో మిస్ అవుతున్నాననే ఫీలింగ్ ఉండదు. కానీ వరల్డ్ కప్ లాంటి టోర్నీలో లేకపోతే మిస్ అవుతున్నా అనే ఫీలింగ్ కలుగుతుంది. ఇది నాకు కొత్త అనుభూతి. వరల్డ్ కప్ కోసం అందరిలాగే నేను ఎదురు చూస్తున్నాను". అని జియో హాట్ స్టార్ తో రోహిత్ శర్మ తెలిపాడు. 2026 వరల్డ్ కప్ కు 18 రోజుల సమయం మాత్రమే ఉంది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీలో తొలిసారి 20 జట్లు ఆడుతుండడంతో భారీ హైప్ నెలకొంది. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది. టోర్నీ ఇండియాలోనే జరుగుతుండడంతో డిఫెండింగ్ ఛాంపియన్ టీమిండియా టైటిల్ నిలబెట్టుకుంటుందని ఫ్యాన్స్ ఎంతో ఆతృత్తగా ఎదురు చూస్తున్నారు. మరోసారి ఇండియా, పాకిస్థాన్ ఒకే గ్రూప్ లో ఉండడంతో ఫ్యాన్స్ కు ఫుల్ మీల్స్ పక్కా. అంచనాలకు తగ్గట్టుగా ఆడితే భారత జట్టు టైటిల్ నిలబెట్టుకోవచ్చు. భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్, యూఏఈ, ఒమన్, వెస్టిండీస్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వే, ఐర్లాండ్, ఇంగ్లాండ్, నెదర్లాండ్స్, ఇటలీ, నేపాల్, పాకిస్థాన్ జట్లు టోర్నమెంట్ లో భాగం కానున్నాయి. భారత్‌లో జరిగే మ్యాచ్ లు 5 స్టేడియాల్లో జరుగుతాయి. అహ్మదాబాద్, దిల్లీ, కోల్‌కతా, చెన్నై, ముంబయి స్టేడియాలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఇక శ్రీలంక లో 3 వేదికల్లో నిర్వహించనున్నారు. ప్రారంభ, ఫైనల్ మ్యాచ్‌లు అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంలో నిర్వహించనున్నారు.

## సాయిపల్లవి పై అమీర్ ఖాన్ ప్రత్యేక దృష్టి

నిధి అగర్వాల్ చిక్ ప్రీ-డ్రేప్డ్ లుక్







రాయల్ బ్లూ మ్యాక్సీ డ్రెస్‌లో అషు రెడ్డి తాజా ఫోటో



డ్యాన్సర్ గా, కొరియోగ్రాఫర్ గా కెరీర్ ప్రారంభించిన సాయిపల్లవి ఇప్పుడు భారతదేశపు ఐకాన్ స్టార్ గా ఎదిగిన తీరు ఆసక్తిని కలిగిస్తోంది. అద్భుత నటిగా, పాన్ ఇండియన్ స్టార్ గా సాయిపల్లవి నిరూపిస్తోంది. టాలీవుడ్ కోలీవుడ్ మాలీవుడ్ సహా హిందీ చిత్రసీమలో ఇప్పుడు సాయిపల్లవి ప్రతిభ గురించిన చర్చ సాగుతోంది. బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్షనిస్ట్ అమీర్ ఖాన్ అంతటి వాడే సాయిపల్లవిపై ప్రశంసలు కురిపించారంటే అర్థం చేసుకోవాలి.అంత పెద్ద స్థాయికి ఎదిగిన ప్రతిభావంతురాలు సాయిపల్లవిని చూసి దక్షిణాది గర్వించాల్సిన సమయం వచ్చింది. మొదటి సినిమా -ప్రేమమ్-తోనే నిరూపించిన సాయిపల్లవి నేడు మోస్ట్ వాంటెడ్ స్టార్లలో ఒకరిగా ఎదిగిన తీరు ఆసక్తిని కలిగిస్తుంది. భారతీయ సినీపరిశ్రమల్లోని అగ్ర హీరోల సరసన సాయిపల్లవి నటిస్తోంది. ముఖ్యంగా బాలీవుడ్ లో బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా చిత్రాల్లో నటించే అవకాశం అందుకుంటోంది. అక్కడ రణబీర్ కపూర్ లాంటి పెద్ద హీరో సరసన రామాయణం లాంటి క్రేజీ పాన్ ఇండియన్ సినిమాలో నటిస్తోంది. ఈ చిత్రానికి నితీష్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. మరోవైపు అమీర్ ఖాన్ నిర్మాతగా, అతడి కుమారుడు జునైద్ ఖాన్ హీరోగా రూపొందుతున్న -ఏక్ దిన్- అనే ప్రేమకథా చిత్రంలోను సాయిపల్లవి నటిస్తోంది.ఇది ఒక స్వచ్ఛమైన రొమాంటిక్ ఫిల్మ్. చాలా క్లాసిక్ రొమాన్స్ జానర్. ప్రేక్షకుడిగా నాకు భావోద్వేగాలతో కూడిన ప్రేమకథలంటే పిచ్చి. ఇది అచ్చం అలాంటి మ్యాజికల్ లవ్ స్టోరీ.. అని తెలిపారు. ఈ కథను మొదటిసారి విన్నప్పుడే తాను దానికి ఫిదా అయ్యానని, అందుకే తన సొంత బ్యానర్‌లో నిర్మిస్తున్నానని తెలిపారు.ఈ సినిమాతో హిందీలో అరంగేట్రం చేస్తున్న సాయి పల్లవిని ఆమిర్ ఆకాశానికెత్తారు. మేం సాయి పల్లవిని ఎంపిక చేసుకున్నందుకు చాలా సంతోషంగా ఉన్నాము. తను అద్భుతమైన నటి.. ఈ సినిమాలో తన నటనతో ప్రాణం పోసింది! అని కొనియాడారు. తన కుమారుడు జునైద్ గురించి మాట్లాడుతూ.. జునైద్ కూడా చాలా బాగా నటించాడు. అతను నా కొడుకు కాబట్టి నేను ఎక్కువగా మాట్లాడకూడదు.. కానీ ఇద్దరూ కలిసి తెరపై మ్యాజిక్ చేశారు! అని చెప్పారు.-ఏక్ దిన్- చిత్రం 2016 నాటి పాపులర్ థాయ్ చిత్రం -వన్ డే-కి అధికారిక రీమేక్ అని సమాచారం. ఈ సినిమా 1 మే 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. టీజర్‌లో చూపించినట్లుగా జపాన్ వంటి మంచు ప్రాంతాల్లో ఈ సినిమా చిత్రీకరణ జరిగింది. జునైద్ - సాయి పల్లవిల మధ్య కెమిస్ట్రీ ప్రేక్షకులకు ఒక ఫీల్ గుడ్ అనుభూతిని ఇస్తుందని టీజర్ స్పష్టం చేస్తోంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965